తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

| శనివారం 22.02.2025 | సంపుటి : 11 సంచిక : 222 | పేజీలు : 12 వెల: రూ. 4/- |
|---|---|---|

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698


సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV


మహిళలు, చిన్నారులకు

## సంకెళ్లు వేయలేదు

**అమెరికా డిపోర్టేషన్‌పై వివరణ ఇచ్చిన కేంద్రప్రభుత్వం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికాలో అక్రమంగా ఉంటున్న భారతీయ వలసదారులను ట్రంప్ యంత్రాంగం వెనక్కి పంపిస్తోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారిని నిర్బంధించి తీసుకొస్తుండటంపై విమర్శలు వచ్చాయి.వీటిపై

మిగతా 2లో..





## నీళ్లదోపిడీని ఆపండి

**శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ తరలింపును నివారించండి**

ఇప్పటికే ఆ రాష్ట్రం వాటాకు మించి కృష్ణాజలాలను వాడుకుంది

కేఆర్‌ఎంబీకి తెలంగాణ ఫిర్యాదు

**హైదరాబాద్(జనంసాక్షి):** ఇప్పటికే వాటాకు మించి నీటిని ఉపయోగించుకున్న ఆంధ్రప్రదేశ్.. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీరు తీసుకోకుండా నిలువరించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డును తెలంగాణ ప్రభుత్వం మరోమారు కోరింది. ఇవాళ తలపెట్టిన బోర్డు ప్రత్యేక సమావేశం వాయిదా పడిన తరుణంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్.. జలసౌధలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్‌ను కలిశారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహుల్ బొజ్జా.. బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించారు. ఏపీ ఇప్పటికే వాటాకు మించి నీటిని వాడుకొందన్న తెలంగాణ

మిగతా 2లో..

కృష్ణా యాజమాన్య బోర్డు

## భేటీ వాయిదా

ఎపి హాజరు కాకపోవడంతో నిర్ణయం 2లో





# కోటిమంది మహిళల్ని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం

## మోదీ, కేసీఆర్, నా పాలనపై చర్చిద్దామా?

- పాలమూరు ప్రాజెక్టులను ఎండబెట్టిన ఘనత కెసిఆర్‌దే
- ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తా
- మెడికల్ కాలేజీకి చిట్టెం నర్సిరెడ్డి పేరు ఖరారు
- పేదవాడి ఆత్మగౌరవం ఇందిరమ్మ ఇండ్లు
- ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తాం
- నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన
- నియోజకవర్గానికో పెట్రోల్ బంక్ కేటాయిస్తా
- ఏటా రెండు చీరలు పంపిణీ చేస్తాం
- నారాయణపేట జిల్లా పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

**కేసీఆర్, కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ బహిరంగ సవాల్**

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా చెప్పారు.ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. నారాయణపేటలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్‌ను రేవంత్ ప్రారంభించారు. మహిళలో ముఖాముఖీ మాట్లాడిన రేవంత్.. కోటి మంది మహిళలను మహిళా సంఘాల్లో చేర్చుతామని చెప్పారు. ఇందిరా మహిళా శక్తిలో 67 లక్షల మంది ఉన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం. 1000 మెగావాట్ల సోలార్ పవర్ ను మహిళా సంఘాలకు అప్పగించాం. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తాం. శిల్పారామం పక్కనే పెద్ద వ్యాపార కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత ఎదగాలి. గత ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోలె. 1000 కోట్లతో మహిళా సమాఖ్య సభ్యులకు చీరలు ఇస్తాం. మహిళలు ఆత్మగౌరవంతో బతకాలనే ఏడాదిలో రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. గత ప్రభుత్వం మాములు చీరలు ఇచ్చేది..మేం నాణ్యమైన చీరలు ఇస్తాం అని రేవంత్ అన్నారు. రాష్ట్ర,కేంద్రం

మిగతా 2లో..

హాథ్రస్ తొక్కిసలాట ఘటన..

## భోలే బాబాకు క్లీన్ చిట్

**లఖ్‌నవూ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హాథ్రస్ తొక్కిసలాట ఘటనలో గతేడాది 121 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల జ్యుడిషియల్ కమిషన్

మిగతా 2లో..



కొవిడ్ మాదిరి

## చైనాలో కొత్త వైరస్ గుర్తింపు

**బీజింగ్(జనంసాక్షి):** చైనాలో కొవిడ్ మాదిరిగా ఉన్న కొత్త వైరస్‌ను పరిశోధకులు గుర్తించారు. జంతువుల నుంచి మానవులకు సంక్రమించే ముప్పు ఉన్నట్లు భావిస్తున్నారు. గబ్బిలాల్లో గుర్తించిన ఈ కొత్త వైరస్‌ను 'హెచ్‌కెయూ5- కోవ్-2'గా పేర్కొన్నారు. ఇది కొవిడ్ 19కి కారణమైన పోలి ఉన్నట్లు పరిశోధనల్లో గుర్తించినట్లు హాంకాంగ్‌కు చెందిన 'సౌత్‌చైనా మార్నింగ్ పోస్ట్' పత్రిక తన కథనంలో పేర్కొంది. గబ్బిలాల్లో కరోనా వైరస్‌లపై విస్తృత పరిశోధనలు చేసి 'బ్యాట్ ఉమెన్'గా పేరొందిన ప్రఖ్యాత వైరాలజిస్టు షీ ఝెంగ్‌లీ ఈ పరిశోధనా

మిగతా 2లో..





# సంక్షేమమే ప్రథమం

**అదే ప్రజా ప్రభుత్వం లక్ష్యం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

- రూ.3వేల కోట్ల బడ్జెట్‌తో ఎస్సీ, ఎస్టీలకు స్వయం ఉపాధి పథకాలు 2 నెలల్లో అమలు చేయాలి
- అద్దెలు, డైట్ చార్జిలు పెండింగ్లో పెట్టవద్దు
- అటవీ భూముల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి
- ప్రజా ప్రతినిధులు, అధికారులు తరచుగా హాస్టల్లలో పర్యటించాలి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం ఆదేశాలు


**హైదరాబాద్(జనంసాక్షి):**సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.. సంక్షేమ శాఖలో పథకాల అమలుకు ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, సంక్షేమ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పలు అంశాల పై సమిక్ష నిర్వహించారు.గత దశాబ్ద కాలంగా పాలించిన వారుఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలు పూర్తిగా పక్కన పెట్టారు. 3,000 కోట్ల బడ్జెట్ తో ఎస్సీ, ఎస్టీ యువతకు రెండు నెలల వ్యవధిలో స్వయం ఉపాధి పథకాలు అందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారులను కోరారు. ఈ భారీ ఉపాధి పథకాలకు సంబంధించిన ప్రణాళికలను వేను వెంటనే సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులు అందరినీ ఆదేశించారు. సంక్షేమ హాస్టల్లు, రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలకు సంబంధించి అద్దెలు, డైట్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు.

మిగతా 2లో..

భూపాలపల్లి కోర్టు ఉత్తర్వులను

## కొట్టివేయండి

**హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, హరీశ్‌రావు**



**హైదరాబాద్(జనంసాక్షి):** మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. రాజలింగ మూర్తి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి కోర్టు విచారణకు స్వీకరించి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. వాటిని కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మీడియా ద్వారా తనకు ఈ విషయం తెలిసిందని న్యాయమూర్తి చెప్పారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతిచెందితే ఈ పిటిషన్‌పై ఎలా విచారణ చేపడతామని ప్రశ్నించారు. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. వాదనలు వినిపించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

### నాపై కేసులనూ కొట్టేయండి

బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులపై హైకోర్టులో కేటీఆర్ రెండు వేర్వేరు పిటిషన్లు 2లో

# దేశాన్నే దోచుకుంటుంటే వ్యక్తిగతమెలా అవుతుంది?

**అమెరికాలో అదాని గురించి మోదీ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ విమర్శలు**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**అమెరికాలో విలేకరుల సమావేశంలో అదానీ గురించి అడిగిన ప్రశ్నకు ప్రధాని మోదీ ఇచ్చిన సమాధానాన్ని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తప్పుపట్టారు. "నరేంద్రమోదీజీ.. అది వ్యక్తిగత అంశం కాదు. అది దేశప్రయోజనాలకు సంబంధించిన విషయం" అని ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీలో జరిగిన కార్యక్రమంలో రాహుల్ విమర్శించారు.ఇటీవల ప్రధాని మోదీ అగ్రరాజ్యంలో పర్యటించిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్‌పై అమెరికాలో పెట్టిన కేసు గురించి ట్రంప్‌తో భేటీ సమయంలో చర్చకు వచ్చిందా..? అని మీడియా సమావేశంలో మోదీకి ప్రశ్న ఎదురైంది. "భారత్ ఓ ప్రజాస్వామ్య దేశం. వసుధైక కుటుంబం అనేది మా సంస్కృతి. ప్రపంచం మొత్తం మా కుటుంబం అనుకొంటాం. ప్రతి భారతీయుడిని మావాడిగానే భావిస్తాం. ఇద్దరు దేశాధినేతలు ఎప్పుడూ వ్యక్తిగత స్థాయి అంశాలను చర్చించరు" అని ప్రధాని వెల్లడించారు. ఈ సమాధానాన్ని రాహుల్ గతంలోనూ విమర్శించారు. "ఈ విషయం గురించి దేశంలో ఎవరైనా ప్రశ్నిస్తే మౌనం దాల్చే ప్రధానమంత్రి.. అదే ప్రశ్నను విదేశాల్లో ఎవరైనా అడిగితే అది వ్యక్తిగత విషయమని బదులిస్తారు" అని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభాన్ని పొందేలా అధిక ధరకు సౌర విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ఏపీ,ఒడిశా రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 'ఉన్నత స్థాయి' వర్గాలకు లంచాలు ఇచ్చినట్లు ఎఫ్‌సీపీఏ కింద పలువురిపై అమెరికాలో కేసులు నమోదు చేశారు. ఆ నిధులను అమెరికాలో పెట్టుబడి కింద అదానీ గ్రూప్ సమీకరించడమే అక్కడ కేసు నమోదుకు కారణం. సౌర విద్యుత్ విక్రయ కాంట్రాక్టుల్లో అనుకూల షరతులు అమలుచేసేందుకు అదానీ గ్రూప్ 250 మిలియన్ డాలర్ల (రూ.2029 కోట్లు) మేర లంచాలు ఇచ్చారన్నది ఆరోపణ.ఇటీవల వ్యాపారాల్లో కొనసాగడానికి, ప్రాజెక్టులు దక్కించుకోవడానికి విదేశీ ప్రభుత్వాలు, అధికారులకు లంచం ఇచ్చే అమెరికా కంపెనీలు, విదేశీ సంస్థలపై చర్యలు తీసుకొనే 1977 ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్(ఎఫ్‌సీపీఏ) అమలును నిలిపేస్తూ ట్రంప్ సంతకాలు చేసి, యూఎస్ అటార్నీ జనరల్ పామ్ బోండికి ఆదేశాలు జారీ చేయడంతో అదానీ గ్రూప్‌నకు ఊరట లభించింది.

పరీక్షల్లో 'చీటింగ్' వివాదం..

## విద్యార్థుల మధ్య తీవ్రఘర్షణ

**తుపాకులతో కాల్పులు, ఒకరి మృతి**

**పాట్నా(జనంసాక్షి):**పదో తరగతి పరీక్షల్లో చీటింగ్ జరిగిందంటూ వచ్చిన ఆరోపణలు విద్యార్థుల మధ్య తీవ్ర ఘర్షణకు దారితీశాయి. దీంతో రెచ్చిపోయిన విద్యార్థులు ఏకంగా తుపాకులతో కాల్పులకు పాల్పడ్డారు.ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు గాయాలు కాగా.. అందులో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బిహార్‌లోని రోహ్‌తాస్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది.రోహ్‌తాస్‌లోని సాసారామ్ పట్టణంలో నిర్వహించిన పదోతరగతి

మిగతా 2లో..





# నా దెబ్బకు బ్రిక్స్ కూటమి బెంబేలెత్తింది

**సుంకాలు విధిస్తామనగానే చెల్లాచెదురయ్యారు • ట్రంప్ వ్యంగ్యాస్త్రాలు**

**న్యూయార్క్(జనంసాక్షి):**బ్రిక్స్ కూటమి పట్ల వ్యతిరేకతను వ్యక్తం చేసే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా అదే తరహాలో మాట్లాడారు. సుంకాలు విధిస్తామనగానే 'బ్రిక్స్' చెల్లాచెదురైందని వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. "డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే బ్రిక్స్‌పై 150 శాతం సుంకాలు విధిస్తానని నేను చెప్పగానే అందులోని దేశాలు పరస్పరం దూరం జరిగాయి. తర్వాత ఆ కూటమి మాటే వినిపించడం లేదు" అని విమర్శించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, యూఏఈ.. ఈ గ్రూప్‌లో సభ్య దేశాలు.యూఎస్ డాలర్‌ను పక్కనపెడితే ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇప్పటికే ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. డాలర్‌కు బదులుగా బ్రిక్స్ దేశాలు మరో కరెన్సీని సృష్టించలేవన్నారు. ఒకవేళ వారు డాలర్‌ను వదులుకుంటే అద్భుతమైన యూఎస్ ఎకానమీలో అమ్మకాలకు గుడ్‌బై చెప్పి.. ఆయా దేశాలు ప్రయోజనం పొందడానికి మరో దేశాన్ని ఎన్నుకోక తప్పదని ట్రంప్ (ఽతీబీఎజూ) పేర్కొన్నారు. శక్తిమంతమైన అమెరికా డాలర్‌కు బదులుగా బ్రిక్స్ దేశాలు ఉమ్మడి కరెన్సీని రూపొందిస్తే ఆయా దేశాల దిగుమతులపై 100 శాతం సుంకం విధిస్తామని, అమెరికాతో వాణిజ్యాన్ని వదులుకోవాల్సి ఉంటుందని గతంలో హెచ్చరించారు.గత అక్టోబరులో రష్యాలోని కజాన్ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరిగిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలోనే బ్రిక్స్ దేశాలు ఉమ్మడిగా కరెన్సీ రూపొందించడంపై దృష్టిపెట్టాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పిలుపునిచ్చారు. పెట్టుబడుల ప్రాజెక్టులకు ఆర్థిక వనరులు సమకూర్చడానికి ఆయా దేశాలు డిజిటల్ కరెన్సీని వాడుకోవాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం కూటమిలోని దేశాలు డిజిటల్ కరెన్సీ వాడుకునేందుకు భారత్‌తో కలిసి రష్యా పని చేస్తోందన్నారు. సభ్య దేశాలు కొత్త ఆర్థిక సాధనాలను వినియోగించుకోవాలని

మిగతా 2లో..

# రైతులకు అందుబాటులో ఎరువులు



**యూరియా సరఫరాకు కేంద్రానికి తుమ్మల లేఖ**

**అధికారులతో పరిస్థితులపై సమీక్ష**



**హైదరాబాద్(జనంసాక్షి):**రైతులకు ఎరువుల కొరత రాకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏయే ఎరువుల ఎంతెత అవసరమో స్టాక్ పెట్టుకోవాలన్నారు. అరాష్ట్రంలో ఎరువుల సరఫరా లభ్యతపై రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ సంచాలకులు మాట్లాడుతు, గత 5 సంవత్సరాల్లో అత్యధికంగా 2022-23 యాసంగిలో 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వాడకం ఉన్నదని, దానిని ప్రామాణికంగా తీసుకొని, అంతకంటే ఎక్కువగా యూరియా అందుబాటులో ఉంచేటట్టు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 1 నుండి ఇప్పటిదాకా కేంద్రం నుండి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా ప్రణాళికలు ఇవ్వగా, కేవలము 6.73 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కాబడినదని, ఇదే విషయాన్ని సీజన్ ఆరంభములో కూడా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లగా, మన రాష్ట్ర అవసరాలను పరిగణలోకి తీసుకొని ఎప్పటికప్పుడు సరఫరా చేసే బాధ్యత తమదని కేంద్రం నుండి భరోసా వచ్చినప్పటికి కేవలం ఫిబ్రవరి మాసములోనే 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా రావడం జరిగిందని తెలిపారు.

మిగతా 2లో..

# రుణమాఫీపై అందమైన కట్టుకథలు

### గాంధీభవన్ దాకా వచ్చిన వారు మీ ఇంటికీ వస్తారు

### ఆరు గ్యారెంటీలపై ఇంకా నిలదీస్తారు: హరీష్ రావు



**హైదరాబాద్(జనంసాక్షి):** అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రజలు నిలదీస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇప్పటికీ చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. గాంధీ భవన్ వద్ద ధర్నాకు దిగిన రైతు విషయంలో హరీశ్‌రావు స్పందించారు. అందరికీ రుణమాఫీ చేసినట్లు అందమైన కట్టుకథను ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారూ.. మిమ్మల్ని నిలదీసేందుకు తుంగతుర్తి నుంచి గాంధీ భవన్ దాకా వచ్చిన రైతు తోట యాదగిరి గారికి ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. మీరిచ్చిన ఆరు గ్యారెంటీలు ఎన్నికల గారడీనేనని, 420 హామీల అమలు వట్టి బూటకమేనని తెలంగాణ ప్రజలు తక్కువ సమయంలోనే తెలుసుకున్నరు. మిమ్మల్ని నిలదీసేందుకు ఒక్కొక్కరిగా గాంధీ భవన్‌కు చేరకముందే పాపపరిహారం చేసుకోండి. రైతులు, మహిళలకు, విద్యార్థులకు, వృద్ధులకు, ఉద్యోగులకు.. అన్ని వర్గాలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోండి అని రేవంత్ రెడ్డికి హరీశ్‌రావు సూచించారు. ఈరోజు గాంధీ భవన్ దాకా వచ్చిన వారు, రేపో మాపో మీ జూబ్లీహిల్స్ ప్యాలెస్ దాక వస్తరు. ప్యాలెస్ పాలన వదిలి ప్రజా పాలన కొనసాగించు. ఏడు పదుల వయస్సులో రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరిగిండు, అధికారులను వేడుకున్నడు. అయినా వెనకడుగు వేయకుండా గాంధీ భవన్ దాకా వచ్చి పోరాటం చేస్తున్న రైతు యాదగిరి పట్టుదలకు అభినందనలు. ఇదే స్ఫూర్తితో అన్ని వర్గాల ప్రజలు మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలని, హామీలు అమలు చేసే దాకా కొట్లాడాలని బీఆర్ఎస్ పక్షాన పిలుపునిస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# భారత్‌లో ఎన్నిలకు అమెరికా నిధులు

### యూఎస్ఎయిడ్‌పై వార్తలుకలవరపాటుకు గురిచేస్తున్నాయి

### వ్యవహారంపై స్పందించిన కేంద్రప్రభుత్వం



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌లో ఎవరినో గెలిపించడానికి గత అధ్యక్షుడు జో బైడెన్ రూ.182 కోట్ల నిధులను కేటాయించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యవహారంపై తాజాగా భారత ప్రభుత్వం స్పందించింది. ఓటింగ్‌ను పెంచడం ద్వారా భారత ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు యూఎస్ఎయిడ్ ప్రయత్నించిందనే వార్తలు తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయని పేర్కొంది. దీనిపై సంబంధిత విభాగాలు దృష్టి సారించాయని వెల్లడించింది."యూఎస్ కార్యకలాపాలు, నిధులకు సంబంధించి అమెరికా ప్రభుత్వ యంత్రాంగం వెల్లడించిన సమాచారాన్ని చూశాం. అవి తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ఆందోళనలకు దారితీశాయి. ఈ దశలో దీనిపై బహిరంగంగా మాట్లాడటం తొందరపాటే అవుతుంది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం వచ్చిన తర్వాతే దీనిపై మరిన్ని వివరాలు వెల్లడిస్తాం" అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత వివిధ దేశాలకు అమెరికా చేసే సాయంపై పునఃసమీక్ష చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా యూఎస్ఎయిడ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు యూఎస్ఎయిడ్ ఖర్చు చేసిందనే విషయాన్ని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఆ దేశంలో మరెవర్నో గెలిపించేందుకు వారు (బైడెన్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ప్రయత్నించినట్లు అర్థమవుతోందన్న ఆయన.. ఈ విషయాన్ని భారత్‌కు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు.

## చాక్లెట్ కొనిస్తామని చెప్పి... బాలికపై అత్యాచారం

### సంగారెడ్డిలో ఇద్దరు యువకుల దురాగతం

**సంగారెడ్డి(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. 8 ఏళ్ల చిన్నారిపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఇంటి బయట ఆడుకుంటున్న బాలికను చాక్లెట్ కొనిస్తామని చెప్పి తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు. తీవ్ర రక్తస్రావంతో బాలిక కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయారు. అక్కడికి చేరుకున్న కుటుంబీకులు, బంధువులు బాధితురాలిని సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

## ఇజ్రాయెల్ బస్సుల్లో వరుస పేలుళ్లు..

### ఉగ్రదాడిగా అనుమానం

**టెల్‌అవీవ్(జనంసాక్షి):** ఇజ్రాయెల్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. బాట్‌యామ్ సిటీలో మూడు బస్సుల్లో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..గురువారం సాయంత్రం బాట్‌యామ్‌లోని వివిధ ప్రదేశాల్లో ఈ పేలుళ్లు జరిగాయి. సమాచారం అందిన వెంటనే బాంబు నిర్వీర్య విభాగం అధికారులు ఆ ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఇక, ఈ ఘటనలో ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని స్థానిక అధికారులు ధ్రువీకరించారు. అనుమానితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలాఉండగా.. పాలస్తీనా ఉగ్రవాద సంస్థలే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారని ఇజ్రాయెల్ రక్షణశాఖ మంత్రి కాట్జ్ అనుమానం వ్యక్తంచేశారు. వెస్ట్‌బ్యాంక్‌లో కనుగొన్న పదార్థాలు తాజా పేలుడు పరికరాలు ఒకేలా ఉన్నాయని టెల్‌అవీవ్ పోలీసు అధికారి తెలిపారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. దీనిపై అత్యవసర భద్రతా సమావేశానికి ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పిలుపునిచ్చినట్లు వెల్లడించింది. గాజా కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా తమ చెరలో చనిపోయిన నలుగురు ఇజ్రాయెలీల మృతదేహాలను హమాస్ టెల్‌అవీవ్‌కు అప్పగించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ సంస్థ అప్పగించిన ఒక మృతదేహం తమ దేశానికి చెందిన మహిళది కాదని టెల్‌అవీవ్ పేర్కొంది. మిలిటెంట్ సంస్థ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపణలు చేసింది. ఖాన్‌యుస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో షిర్ బిబాస్.. ఆమె ఇద్దరు కుమారులు ఎరియల్, కఫీర్‌లతో పాటు ఇంకొకరి మృతదేహాన్ని గురువారం రెడ్‌క్రాస్ స్వాధీనం చేసుకుంది.

# కోటి మంది మహిళల్ని కోటీశ్వరులను చేయడమే లక్ష్యం



ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలి. ఎన్నికలప్పుడే రాజకీయాలు..మిగతా టైంలో అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలన్నారు. నియోజకవర్గానికి ఒక్కమహిళా సమాఖ్యకు పెట్రోల్ బంక్ ఇస్తాం అన్నారు. కోటి మంది మహిళలతో ఓఆర్ఆర్ దగ్గర భారీ ప్రదర్శన చేద్దాం రండి అని రేవంత్ పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య సభ్యులకు ఏడాదికి రెండు చీరలు అందజేస్తామని ప్రకటించారు. నారాయణపేట జిల్లా పర్యటనలో భాగంగా అప్పక్‌పల్లెలో మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌ను సీఎం ప్రారంభించారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సమాఖ్యలో మొత్తం 67లక్షల మంది ఉన్నారు. ఈ సభ్యులకు ఇకపై రూ. 1000 కోట్ల ఖర్చుతో ఏడాదికి రెండు మంచి చీరలు ఇస్తాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. శిల్పారామం వద్ద మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఏర్పాట్లు చేశాం. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంటును మహిళలు నిర్వహించబోతున్నారు. తొలుత ప్రతి జిల్లాలో ఒక చోట ప్రభుత్వ భూముల్లో మహిళా సమాఖ్యలకు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తాం. ఆ తర్వాత అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక్కటైనా ఉండేలా చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో స్కూళ్ల నిర్వహణ బాగుండేలా మహిళలు చర్యలు తీసుకోవాలి. ఉపాధ్యాయులు లేకపోయినా, వసతులు సరిగా లేకపోయినా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లండి. నిధులు నేనిస్తా.. నిర్వహణ మీ చేతుల్లో ఉంటుంది. నిధులు ఇచ్చినా నిర్వహణ బాగాలేకపోతే ప్రయోజనం ఉండదు. గుడిని ఎంత పవిత్రంగా నిర్వహిస్తున్నామో బడి కూడా అలాగే నిర్వహించాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

**కెసిఆర్, కిషన్ రెడ్డిలకు సిఎం బహిరంగ సవాల్**

పదేళ్ల బీఆర్ఎస్ పాలన ..11 ఏళ్లు మోదీ పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్దమా అని సిఎం రేవంత్ అన్నారు. కేసీఆర్, కిషన్ రెడ్డి చర్చకు రావాలని అన్నారు. చర్చలో తాను ఓడితే ముక్కు నేలకు రాస్తానని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలకు ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రజాపాలన బాగలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యగాలు ఇచ్చాం. .21 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశామని చెప్పారు. పరిశ్రమలు ,ప్రాజెక్టులు రాకుండా బీఆర్ఎస్,బీజేపీ అడ్డుకుంటుందని మండిపడ్డారు. తాను అధికారం లోకి వచ్చిన తర్వాత మక్తల్, నారాయణపేట్ ,కొడంగల్ ప్రాజెక్టులను మొదలు పెట్టానన్నారు. కేసీఆర్ గట్టిగా కొడతానంటున్నావ్.. గట్టిగా కొట్టడానికి అది ఫుల్లా.. ఆఫా.. కొట్టాలనుకుంటే ముందుగా మీ బిడ్డను ,కొడుకును, అల్లుడిని కొట్టు..మమ్మల్ని కొడితే మా కార్యకర్తలు ఊరుకుంటారా? ఇచ్చిన హామీలను ఐదేళ్లలో పూర్తి చేసే బాధ్యత నాదే అని రేవంత్ అన్నారు. గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'పదేళ్ల పాటు ఏగ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే.. ఏ నాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదు. గతంలో కొందరు సీఎంలు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేశారు కానీ, జిల్లాకు చేసిందేమీ లేదు. భీమ, నె÷-టటెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండం, కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదు. పదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదు. వైఎస్ఆర్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదు. నా మీద పగతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేశారు. ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు, 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రిగా నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం.. చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తా. పదేళ్లలో ఏమీ చేయని వాళ్లు ఏడాదిలోనే కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్నారు జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా. ఇక్కడి మెడికల్ కాలేజీకి చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టాలని అదేశిస్తున్నా అని రేవంత్ అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే పర్ణికా ఓ డాక్టర్ కావడం ఇక్కడి మెడికోల అదృష్టమన్నారు. మీ అవసరాలు ఎంఎల్ఏ కు చెప్పాల్సిన పనిలేదు. బి. దేవమ్మ ,భర్త నర్సింగ్ కు చెందిన స్థలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కు భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ,రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు,రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క,రాష్ట్ర గృహ నిర్మాణ స్పెషల్ సెక్రటరీ వి.పి.గౌతం,జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్,మహబూబ్ నగర్ ఎం.పి.డి.కె.అరుణ, నారాయణ పేట శాసన సభ్యురాలు పర్ణికా రెడ్డి,మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీ హరి, షాద్ నగర్ శాసన సభ్యులు వీర్ల పల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు

# నీళ్లదోపిడీని ఆపండి

అధికారులు.. ఇక నుంచి ఉమ్మడి జలాశయాల నుంచి ఏపీ నీటిని తీసుకోరాదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్ చేశారు. మే నెల వరకు తెలంగాణకు 107 టీఎంసీల నీరు ఇవ్వాలని బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. ఇవాళ జరగాల్సిన ప్రత్యేక సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరినందున, ఆ రోజు సమావేశంలో చర్చించే వరకు శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా చూడాలని తెలంగాణ అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ బోర్డు తగిన విధంగా స్పందించడం లేదని తెలంగాణ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది..

## కృష్ణా యాజమాన్య బోర్డు భేటీ వాయిదా

**హైదరాబాద్(జనంసాక్షి):** కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం వాయిదా పడింది. సమావేశానికి తాము హాజరుకాలేమని, వాయిదా వేయాలని ఏపీ అధికారులు కోరారు. దీంతో సమావేశాన్ని సోమవారానికి బోర్డు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం అందించామని అధికారులు వెల్లడించారు. కాగా, శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి కృష్ణా నీటిని ఆంధప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తున్నదని, వెంటనే అడ్డుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేసింది. అయితే ఏపీ విజ్ఞప్తితో సమావేశం వాయిదాపడింది. అయితే కృష్ణా, గోదావరి జలాలను ఏపీ తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించిన విషయం తెలసిందే. 666 టీఎంసీలకు గాను ఏపీ ఇప్పటికే 657 టీఎంసీలను వినియోగించుకున్నదని, తెలంగాణకు 343 టీఎంసీలకు గాను 220 టీఎంసీలు మాత్రమే వినియోగించుకోవడం ప్రభుత్వ అసమర్థతేనని మండిపడ్డారు. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరిచి రైతుల పంటలు కాపాడలంటే తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఆంధప్రదేశ్‌కు నీటి విడుదలను వెంటనే బంద్ చేయించాలని డిమాండ్ చేశారు.

## నా దెబ్బకు బ్రిక్స్ కూటమి బెంబేలెత్తింది

పుతిన్ కోరారు. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేస్తున్నామన్నారు. కాగా అట్లాంటిక్ కౌన్సిల్‌కు చెందిన జియో ఎకనామిక్స్ సెంటర్ గత సంవత్సరం చేసిన అధ్యయనంలో బ్రిక్స్ దేశాలు ఎన్ని ప్రయత్నాలు చేసినా డాలర్‌పై ప్రపంచ దేశాలు ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించలేవని వెల్లడించింది.

## కొవిడ్ మాదిరి చైనాలో కొత్త వైరస్ గుర్తింపు

బృందానికి సారథ్యం వహించారు. ఇందులో గాంఘ్జౌ లేబోరేటరీ, గాంఘ్జౌ అకాడమీ ఆఫ్ సైన్సెస్, వుహాన్ విశ్వవిద్యాలయంతో పాటు వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీకి చెందిన శాస్త్రవేత్తలు భాగస్వాములుగా ఉన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన పరిశోధనా పత్రం 'సెల్' జర్నల్‌లో సమీక్షకు ఉంచినట్లు కథనంలో పేర్కొన్నారు. ఈ వైరస్ మెర్బెకోవైరస్‌తోపాటు ప్రాణాంతక మెర్స్-కోవ్ (మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సిండ్రోమ్) ఉప రకానికి చెందినదిగా పరిశోధకులు గుర్తించారు. ఇది హెచ్‌కేయూ5 కరోనా వైరస్ సంతతికి చెందినదిగా పేర్కొన్నారు. ఈ వైరస్‌ను తొలుత హాంకాంగ్‌లోని జపనీస్ పిపిస్ట్రెల్ రకం గబ్బిలాల్లో గుర్తించారు. తాజా పరిశోధన ప్రకారం.. నేరుగా లేదా మాధ్యమజీవుల ద్వారా మనుషులకు వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్ సామర్థ్యం కొవిడ్-19తో పోలిస్తే తక్కువేనని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

## నేడు భారత్, పాక్‌ల మధ్య కీలక భేటీ..!

### సరిహద్దులో ఉద్రిక్తతలపై చర్చించేందుకు ఇరు దేశాల మిలటరీ అధికారుల సమావేశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ఇటీవల పొరుగుదేశం పాకిస్థాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి సరిహద్దుల్లో కాల్పులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై చర్చలు జరిపేందుకు భారత్, పాక్ మిలిటరీ అధికారులు సిద్ధమయ్యారు. శుక్రవారం ఇరుదేశాల మధ్య కీలక సమావేశం జరుగుతుందని రక్షణ వర్గాలు వెల్లడించాయి. గురువారం జమ్మూకశ్మీర్ లోని పూంఛ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాద కదలికలను గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో భద్రతా దళాలు అప్రమత్తమై ఎదురుకాల్పులు జరిపాయని తెలిపారు. సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతుందన్నారు. ఈక్రమంలోనే ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై ఇరుదేశాల సైన్యాధికారులతో ఫ్లాగ్ మీటింగ్ జరగనుందని భారత సైన్యానికి చెందిన ఓ అధికారి తెలిపారు. ఇక, గత కొన్ని రోజులుగా వివిధ మార్గాల్లో పాక్ కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ క్రమంలోనే గతవారం ఘాటి సెక్టార్‌లో పాక్ సైన్యం కాల్పులకు దిగింది. దీన్ని భారత బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘటనలో శత్రు సైన్యంలో పలువురు మృతి చెందినట్లు వార్తలు వచ్చాయి. అయితే దీనివల్ల కాల్పుల విరమణ ఒప్పందం దెబ్బతినలేదని భారత సైన్యాధికారులు స్పష్టం చేశారు. సరిహద్దుల వద్ద కాల్పులు, ఐఈడీ పేలుడు ఘటనతో కొంత కలకలం చోటుచేసుకుందని పేర్కొంది. ఫిబ్రవరి 4, 5 తేదీల మధ్య అర్ధరాత్రి కొంతమంది చొరబాటుదారులు భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు.



# సంక్షేమమే ప్రథమం



శాఖల వారీగా ఈ అంశాల్లో ఉన్న బకాయిల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బకాయిలకు సంబంధించి శాఖల అధికారులు బాధ్యత తీసుకొని ఆర్థిక శాఖ నుంచి బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేయించుకోవాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ అధికారులు సంక్షేమ హాస్టలు, గురుకులాల్లో పర్యటన కార్యక్రమం నిరంతరం కొనసాగేలా సంక్షేమ శాఖ అధికారులు ఫాలో అప్ చేసుకోవాలని సూచించారు. పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ను సంక్షేమ శాఖల అధికారులు నిత్యం ప్రజా ప్రతినిధులు, సీనియర్ అధికారులకు గుర్తుచేసి కార్యక్రమం విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లాలని తెలిపారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం వివిధ శాఖల నుంచి ఎస్సీ, ఎస్టీ శాఖలకు రావలసిన నిధులపై కసరత్తు చేసి సీరియస్ గా ఫాలోఅప్ చేయాలని తెలిపారు. కేంద్ర పథకాలకు సంబంధించి ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించి నిధులు రాబట్టడంలో వేగం పెంచాలని కోరారు. ఆదిలాబాద్ నుంచి భద్రాచలం వరకు అటవీ హక్కుల చట్టం కింద లక్షలాది మంది గిరిజనులకు భూ పంపిణీ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ భూముల అభివృద్ధికి ఎస్సీ ,ఎస్టీ శాఖల అధికారులు విద్యుత్తు, వ్యవసాయ, అటవీ, ఉద్యాన శాఖ అధికారులతో సంయుక్తంగా సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ భూముల్లో సోలార్ పవర్ ఆధారంగా సాగు విస్తీర్ణాన్ని పెంచడం, అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు అవకాడో, వెదురు వంటి పంటల సాగుకు ప్రణాళికలు రచించి రాబోయే రెండు సంవత్సరాల్లో ఫలితాలు అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఆవాసాల్లో నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేపట్టి ఆ వర్గాల ఆదాయం పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. సంక్షేమ శాఖ అధికారులు ఆయా వర్గాల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని ఏ సూచన చేసిన అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఎస్సీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, ఎస్టీ కార్పొరేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, ఇరిగేషన్ సెక్రటరీ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## భోలే బాబాకు క్లీన్ చిట్

యూపీ ప్రభుత్వానికి పూర్తి నివేదికను సమర్పించింది.కాగా ఈ ఘటనతో భోలే బాబాకు సంబంధం లేదని పేర్కొంటూ కమిషన్ ఆయనకు క్లీన్ చిట్ ఇచ్చినట్లు పలు వార్తా సంస్థలు పేర్కొంటున్నాయి. భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరు కావడం వల్ల తొక్కిసలాటలో ఊపిరాడని కారణంగానే వారు మరణించారని నివేదికల్లో పేర్కొన్నట్లు సమాచారం. ఈ నివేదికపై రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన తర్వాత, దీనిని ప్రస్తుత బడ్జెట్ సెషన్‌లో యూపీ శాసనసభలో సమర్పించే అవకాశం ఉంది. నివేదిక ప్రకారం సత్సంగ్ కార్యక్రమ నిర్వాహకులు, పోలీసులు సరైన ఏర్పాట్లు చేయనందువల్ల, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని జ్యుడిషియల్ కమిషన్ పేర్కొంది. గతంలో ఈ కేసును విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సైతం ఈ ఘటనలో భోలే బాబా ప్రమేయం లేదని పేర్కొన్న విషయం తెలిసిందే. ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం.. హాథ్రస్ జిల్లా సికంద్రరావ్ ప్రాంతం ఫుల్‌రయీ, ముగల్‌గఢీ గ్రామాల మధ్యలోని రహదారిని అనుకొని ఉన్న ఓ ఖాళీ ప్రదేశంలో తాత్కాలిక షెడ్లు వేసి సత్సంగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 80 వేల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు పోలీసుల అనుమతి తీసుకున్నారు. అయితే 2.5 లక్షలకు పైగా ప్రజలు వచ్చినట్లు తేలింది. కార్యక్రమం అనంతరం భోలే బాబా వేదిక నుంచి వెళ్లే క్రమంలో దర్శనం కోసం భక్తులు ఆయన వెంట పరుగెత్తారు. ఆయన పాదాల వద్ద మట్టిని తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో తొక్కిసలాట నెలకొని 121మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఊపిరాడని కారణంగానే మరణాలు సంభవించాయని శవపరీక్షల్లో తేలిందని ఎటాలోని జిల్లా ఆసుపత్రి వైద్యులు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ కేసులో పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకోగా.. భోలే బాబాను నిందితుడిగా చేర్చలేదని అలీగఢ్ ఐజీ శాలభ్ మాథుర్ తెలిపారు.

## మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదు

స్పందించిన కేంద్ర ప్రభుత్వం.. గతవారం రెండు బ్యాచ్‌లలో వచ్చిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని స్పష్టం చేసింది."వలసదారులను స్వదేశానికి పంపించే సమయంలో మానవతా దృక్పథంతో వ్యవహరించడంతోపాటు మతపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని అమెరికా ప్రభుత్వం వద్ద ప్రస్తావించాం. దాని ప్రకారం.. ఫిబ్రవరి 15, 16 తేదీల్లో అమృత్‌సర్‌కు వచ్చిన వారిలో మహిళలు, చిన్నారులకు ఎలాంటి సంకెళ్లు వేయలేదు" అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. పనామా, కోస్టారికాకు తరలిస్తున్న అక్రమ వలసదారుల్లో భారతీయులు ఉండవచ్చన్న వార్తలపై స్పందిస్తూ.. ఆ వివరాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. ఒకవేళ వారిలో భారతీయులు ఉన్నట్లయితే.. వారిని స్వదేశానికి రప్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. అమెరికా డిపోర్టేషన్‌లో భాగంగా ఫిబ్రవరి 5న 104 మందితో కూడిన తొలి విమానం భారత్‌కు వచ్చింది. ఈ క్రమంలో వారిని బంధించి తీసుకువచ్చారనే వార్తలు తీవ్ర దుమారం రేపాయి. ప్రతిపక్షాలు కూడా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. ఫిబ్రవరి 15న 116 మంది, 16వ తేదీన 112 మంది అమృత్‌సర్‌కు చేరుకున్నారు.

## నాపై కేసులూ కొటేయండి

**హైదరాబాద్(జనంసాక్షి):** భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులు కొట్టేయాలని కోరారు. సీఎం రేవంత్‌ను అవమానించారంటూ కాంగ్రెస్ కార్యకర్త ఫిర్యాదుతో బంజారాహిల్స్ లో కేసు నమోదైంది. బిల్డర్లు, కాంట్రాక్టర్ల వద్ద సీఎం రూ.2500 కోట్లు తీసుకున్నట్లు కేటీఆర్ ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ కార్యకర్త బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాల్చినందుకు ముషీరాబాద్ పీఎస్‌లో కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే ముఠాగోపాల్‌పై పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులను కొట్టివేయాలని కేటీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణాలు లేకుండా పోలీసులు కేసులు నమోదు చేశారని పిటిషన్‌లో ఆయన పేర్కొన్నారు. సీఎంను దురుద్దేశ పూర్వకంగా అవమానించలేదని.. తన వ్యాఖ్యలతో శాంతిభద్రతలకు ఎలాంటి భంగం వాటిల్లలేదన్నారు. ఈ పిటిషన్లపై తదుపరి విచారణను హైకోర్టు మార్చి 18కి వాయిదా వేసింది.

## రైతులకు అందుబాటులో ఎరువులు

అయినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్1 న ప్రారంభనిల్వలు 3.08 లక్షల మెట్రిక్ టన్నులను జాగ్రత్తగా సరఫరా చేస్తు, రాష్ట్రం మొత్తం మీద రైతుల అవసరాలకు తగ్గట్టు ఇప్పటిదాకా సరఫరా చేయడం జరిగిందని, ఇకముందు కూడా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1.30 లక్షల మెట్రిక్ టన్నులను అవసరాల మేరకు ఆయా జిల్లాలకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదే సమయంలో మన రాష్ట్రానికి ఈ నెలలో రావాల్సిన యూరియాను వెంటనే ఇతర కంపెనీల ద్వారా సరఫరా చేయుటకు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ మంత్రిని లేఖ ద్వారా తిరిగి కోరడం జరిగింది. మన రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను సరఫరా చేయుటకు కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారి అవసరం మేరకే కొనుగోలు చేయాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి రైతులను కోరడం జరిగింది. సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు శ్రీ గోపి , కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

## పరీక్షల్లో 'చీటింగ్' వివాదం..

పరీక్షల్లో చీటింగ్ జరిగిందనే ఆరోపణలు వచ్చాయి. వీటికి సంబంధించి ఫిబ్రవరి 19న విద్యార్థుల మధ్య వివాదం చోటుచేసుకుంది. మరుసటి రోజూ గ్రూపులుగా విడిపోయిన విద్యార్థులు భౌతిక దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో తుపాకులతో కాల్పులకు తెగబడ్డారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత విద్యార్థి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మృతదేహంతో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. సాసారామ్‌లో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. దీంతో భారీ సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించారు. అటు విద్యార్థులు చికిత్స పొందుతున్న స్థానిక మెడికల్ కాలేజీ ఆసుపత్రి వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# రాష్ట్రం దశాదిశను సూచించే ఎమ్మెల్సీ ఎన్నికలు

- పాలనలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌వి చేతకాని విధానాలు
- హామీలు గుప్పించి అధికారం వచ్చాక విస్మరించారు
- మెదక్‌లో టీచర్లతో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**మెదక్ బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** సీఎంలు మారారేగానీ తెలంగాణ పాలనలో ఎలాంటి మార్పు లేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. రాబోయే శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను మేధావులు గెలిపించి సత్తా చాటాలన్నారు. ఎన్నికల తరువాత ప్రజా సమస్యలపై ఉద్యమబాటలో పయనిస్తామన్నారు. అనేక రాష్ట్రాల్లో మోదీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏ విధంగా అభివృద్ధిలో దూసుకుపోతుందో చూస్తున్నారని చెప్పారు. కర్ణాటక, హిమాచల్, తెలంగాణలో అవినీతి, అక్రమ ప్రభుత్వాల చేతకాని విధానాల వల్ల కనీసం జీతాలివ్వలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీల మాట దేవుడెరుగు, కనీస హామీలను కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో 14 నెలలుగా తెలంగాణలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అప్పులకుప్పగా మార్చాయని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మెదక్ జిల్లా పట్టణ కేంద్రంలో మెదక్ బిజెపి జిల్లా శాఖ నిర్వహించిన ఉపాధ్యాయ పట్టభద్రుల ఓటర్ల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేంద్ర మంత్రి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య, పట్టబద్దుల ఎమ్మెల్సీ అభ్యర్థి సతీమణి గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బిజెపి జిల్లా అధ్యక్షులు మల్లేష్ గౌడ్, బిజెపి జిల్లా నాయకులు ఇన్చార్జులు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పట్టభద్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు రాష్ట్ర దశ దిశను సూచించే ఎన్నికలన్నారు. మేధావులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, రైతులు, రైతు కూలీలు, మహిళలు, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో చతికిలపడిరదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ భృతి రూ. 4వేలు, మహిళలకు రూ. 2500, ప్రతీ దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు, రైతులు, రైతు కూలీలకు ఆదుకుంటామన్న హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీలిచ్చి ఇప్పుడు వారిని కనీసం కలవడం కూడా లేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చినవి, చేసినవన్నీ మోసపూరిత హామీలేనని, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఇంకేం లేవన్నది తేలిపోయిందని కేంద్రమంత్రి విమర్శించారు.

### దివాళా తీసిన ఆర్థిక పరిస్థితి

తెలంగాణలో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాళా తీసిందని, ఉద్యోగులకు జీతాలు, రిట్మెర్మెంట్ బెనిఫిట్స్, ఐదు డీఏలపై మాట్లాడే పరిస్థితి లేదన్నారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని అదే దిశలో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పాలన కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోసపూరిత హామీలు, అహాంకారపూరిత చర్యలు, అధికార దుర్వినియోగం తప్ప ఇరు ప్రభుత్వాల పాలనలో మార్పు ఏమీ లేదన్నారు. మార్పు వచ్చిందంటే కేవలం కేసీఆర్, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కుటుంబాల్లోనే వచ్చిందని విమర్శించారు. రాష్ట్రాన్ని గాడిన పెట్టడంలో పూర్తిగా వైఫల్యం చెందారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు.

### ప్రజాతీర్పు బీజేపీ వైపే..

ఈ శాసనమండలి ఎన్నికల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్ వైఫల్యానికి వ్యతిరేకంగా రానుందని బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఈ మార్పులో విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు కీలక పాత్ర పోషించి మోదీ ప్రభుత్వాన్ని అక్కున చేర్చుకోవాలని భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయంతో తమ పార్టీకి మరింత మద్ధతు లభిస్తుందని దీంతో మరింత బలపడి ప్రభుత్వాల మెడలు వంచే ఉద్యమబాటలో పయనిస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టండి

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం అన్ని ఆయా జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలింగ్ స్లిప్పులు పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. పోలింగ్ ఫిబ్రవరి 27న ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. జిల్లాలలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటరు పాటించాల్సిన నియమాలు వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్, ఎస్పి ఉదయ్ కుమార్ రెడ్డి , అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్లిప్పులు పంపిణి 90 శాతం జరిగిందని, శనివారం వరకు మిగిలిన 10 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా ,ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలు-21 ఉండగా ,1347 మంది ఓటర్లు, తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. ఈనెల 11 వ తారీఖున పీవోస్, ఏపీవోస్ ట్రైనింగ్ నిర్వహించుకున్నామని, 21-02-2025 రోజున రెండో విడతగా పీవోస్ ఏపీవోస్ఓపిఓస్ ట్రైనింగ్ పూర్తి అయిందని తెలిపారు. మైక్రో అబ్జర్వర్స్ విషయంలో 22 మందినినియమించుకున్నామని తెలిపారు. మైక్రో అబ్జర్వర్కు శిక్షణ ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో సంబంధిత ఎన్నికల విభాగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ నేషనల్ హెడ్‌గా డాక్టర్ జీ. ఆదిత్య రెడ్డి

- తెలంగాణ రాష్ట్రానికి దక్కిన గొప్ప అవకాశం



**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అనుబంధ సంస్థ ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ (ఏఐపిసి) హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ నేషనల్ హెడ్‌గా డాక్టర్ జీ. ఆదిత్య రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ప్రవీణ్ చక్రవర్తి శుక్రవారం నియామక పత్రాన్ని ఆదిత్య రెడ్డికి అందజేశారు. వనపర్తి జిల్లా గోపాల్ పేట మండలం జయన్న తిరుమలాపూర్ గ్రామానికి చెందిన దాక్టర్ ఆదిత్య రెడ్డి ప్రస్తుతం ప్రొఫెషనల్ కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి పెద్ద కుమారుడు ఆదిత్య రెడ్డి ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ హెల్త్ కేర్ నేషనల్ హెడ్ గా నియమితులు కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. ఏఐపిసి హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ డాక్టర్ ఆదిత్య రెడ్డి దేశంలోని 28 రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రొఫెషనల్ కాంగ్రెస్ కృషి చేయాలని జాతీయ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి సూచించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏఐపిసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ ను సమీకరిస్తానని డాక్టర్ ఆదిత్య రెడ్డి పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఎఐసిసి లోక్ సభ ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, అధినాయకురాలు సోనియా గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ, ఏఐపిసి చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి లకు డాక్టర్ ఆదిత్య రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

# కాలుష్య రహిత భారత్ కోసం కీలక ఖనిజాల ఉత్పత్తి అత్యవసరం

- భారత్ స్వయం సమృద్ధి సాధనకు కృషిచేద్దాం
- జాతీయస్థాయి కీలక ఖనిజాల సదస్సులో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్

(ప్రత్యేక ప్రతినిధి, జనంసాక్షి)






బ్యాటరీ వాహనాలు, సోలార్ విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లిథియం, కోబాల్ట్, నికెల్ వంటి కీలకఖనిజాలకు అనూహ్య డిమాండ్ ఏర్పడుతోందని, ఈ విషయంలో భారత్ స్వయంసమృద్ధి సాధించడానికి ప్రభుత్వరంగ సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సింగరేణి సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లో శు క్రవారం కీలక ఖనిజాలపై క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2070 నాటికి భారత్ ను కర్బన ఉద్గార రహిత " నెట్ జీరో " దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇది నెరవేరాలంటే దేశీయ ఖనిజ పరిశ్రమల వారు క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాల) ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కీలక ఖనిజాల పై పరిశోధన, అన్వేషణ, ఉత్పత్తి వంటి విషయాలలో ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం, సహకారం ఎంతో అవసరం అన్నారు. ఎలక్ట్రానిక్స్ రంగం, సాంప్రదాయేతర ఇంధన వనరుల రంగం, విద్యుత్ వాహనాలు, రక్షణ రంగాల్లో కీలక ఖనిజాల వినియోగం ఎంతో ఎక్కువగా ఉందని, ప్రస్తుతం ఈ ఖనిజాలను విదేశాలనుంచే ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వారు 30 రకాల కీలక ఖనిజాల జాబితాని విడుదల చేశారని, వీటిని దేశీయంగా ఉత్పత్తి చేయడం కోసం, తద్వారా స్వయం సమృద్ధి సాధనకు పరిశ్రమలు కృషి చేయాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. కనుక పెద్ద ఎత్తున పెరుగుతున్న డిమాండ్ కు తగ్గట్టుగా కీలక ఖనిజాలను దేశీయంగా ఉత్పత్తి చేయటం ఎంతో అవసరమని,ఈ సవాలను ఒక అవకాశంగా దేశీయ పరిశ్రమలు తీసుకోవలసి ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కూడా కీలక ఖనిజ పరిశ్రమ రంగంలోనికి అడుగుపెట్టడానికి సంసిద్ధమయిందని పేర్కొన్నారు. సింగరేణి ఇప్పటికే ఈ విషయంలో ముందడుగు వేసి, జనవరి మొదటి వారంలో ఐఐటి హైదరాబాద్ వారితో ఒప్పందం కుదుర్చుకుం దన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విడుదలయ్యే ఫ్లై యాష్, క్లే మరియు ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ నుండి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను వెలికి తీసే అంశంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయని పేర్కొ న్నారు. ఇకముందు సింగరేణి సంస్థ కేవలం బొగ్గు తవ్వకానికే పరిమితం కాకుండా కీలక ఖనిజాల అన్వేషణ మరియు ఉత్పత్తి రంగాల్లో కూడా అడుగు పెట్టనుందని తెలియజేశారు. సంస్థ తన వ్యాపార విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నప్పటికీ కీలక ఖనిజాల విషయంలో దేశీయ స్వయంసమృద్ధికి ఇది ఉడతాభక్తిని దోహదపడుతుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బి.ఎస్.మూర్తి, సింగరేణి ఈడీ కోల్ మూమెంట్, జీ.ఎం కో-ఆర్డినేషన్ ఎస్. డి.ఎం.సుభాని, క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ చైతన్యమొయి గంగూలీ, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ హామిల్టన్, సింగరేణి జీ.ఎంలు మనోహర్, నారాయణరావు, మిథానీ, న్యూ క్లియర్ ఫ్యూయల్ కార్పొరేషన్, వేదంతా తదితర కంపెనీల అధికారులు, ఐ.ఐ.టి సంస్థల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

# మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడి ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ లొంగుబాటు

- వరంగల్ సిపి అంబర్ కిషోర్ ఝా వెల్లడి




**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీ గొత్తికొయ ఏరియా కమిటీ సభ్యురాలు, కేంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయణ రెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్ వంజెం కేషా ఆలియాస్ జిన్ని శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఎదుట లొంగిపోయింది.ఈ లొంగుబాటుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా, పామెడ్ మండలం, రాసపల్లి గ్రామానికి చెందిన వంజెం కేషా తండ్రి హిడ్మా కూడా (ప్రస్తుతం ఇతను జైలులోవున్నాడు) మావోయిస్టు పార్టీలో పనిచేసేవాడు. దీనితో కేషా కూడా బాల్యంలో చైతన్య నాట్య మండలి పనిచేయడంతో మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యులతో పరిచయాలు కావడంతో 2017లో పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ గొట్టే కమల ద్వారా మావోయిస్టు పార్టీలో చేరిన కేషా రెండు సంవత్సరాలు పాటు పున్నెం జోగ అధ్వర్యంలో చైతన్య నాట్యమండలిలో పనిచేసింది. ఇదే సంవత్సరం కేషాను పార్టీ నాయకత్వం అబుజ్‌మడ్ ప్రాంతానికి బదిలీ చేసి కేంద్ర కమిటీ సభ్యుడు కడారీ సత్యనారయణ రెడ్డికి ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా నియమించింది. 2021 సంవత్సరంలో కేంద్ర మవోయిస్టు నాయకత్వం కేషాను ఏరియా కమిటీ సభ్యురాలిగా నియమించడం జరిగింది. 2022 డిసెంబర్ వరకు ప్రొటెక్షన్ గ్రూప్ సభ్యురాలిగా పనిచేసి కేషా మరో మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు రమేష్‌ను (ప్రస్తుతం మహరాష్ట్ర జైలులో వున్నాడు) వివాహం చేసుకోని ఉత్తర బస్తర్ డివిజన్లో కొద్ది కాలం పనిచేసింది. అనంతరం 2024 ఎప్రిల్ మాసంలో తిరిగి కంద్ర కమిటీ సభ్యుడు కడారి సత్యనారయన రెడ్డి ఆలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ మహిళా కమాండర్ బాధ్యతలు చేపట్టింది.

### పాల్పడిన నేరాల వివరాలు

పార్టీలో పనిచేసిన సమయంలో కొహిలబేడా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టు పార్టీ సభ్యులతో కల్సి పోలీసులపై కాల్పులు జరపడంతో ఒక పోలీస్ అధికారి మరణించగా మరో పోలీస్ అధికారి తీవ్రంగా గాయబడిన సంఘటనతో పాటు, అబుజ్‌మడ్‌లో ప్రాంతంలో పోలీసులపై జరిపిన కాల్పుల్లో ఒక పోలీస్ అధికారి మరణించాడు. ఈ రెండు సంఘటనల్లో వనజం కేషే నిందితురాలు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు అందిస్తున్న పునరావాస పథకాలకు అకర్షితులుకావడంతో పాటు, ప్రధానంగా తాను సురక్షితంగా లొంగుబాటు అయ్యేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారులు ఇచ్చిన వాగ్దనంతో పాటు ప్రస్తుతం మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత రావడం, ఆరోగ్యం కుడా సహకరించక పోవడంతో కేషా లొంగిపోయిందని. పోలీసుల ఎదుట లొంగిపోయిన వంజెం కేషాపై 4లక్షల రూపాయల ప్రభుత్వ రివార్డు వున్నట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడిరచారు.

# ఏఐ అమలుకు కలెక్టర్లకు ఆదేశాలు



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి):** కృత్రిమ మేధా (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఆరు జిల్లాల్లో పగడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా హైదరాబాద్ నుండి జూమ్ మీటింగ్ ద్వారా ఆదేశించారు. శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ జూమ్ మీటింగ్లో పాల్గొన్నారు. విద్యాశాఖ సెక్రెటరీ యోగితారాన కృత్రిమ మేధా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం పై పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన 06 జిల్లాల జిల్లా కలెక్టర్లకు జూమ్ మీటింగ్ ద్వారా పలు సూచన చేస్తూ కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నారాయణపేట, మేడ్చల్, భూపాలపల్లి, ఈ ఆరు జిల్లాల్లో ఒక్కో జిల్లాకు ఆరు పాఠశాలను ఎంపిక చేసి అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధా కిషన్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కోనేరు కోనప్ప



**పెంచికల్ పేట్ ఫిబ్రవరి 21,(జనంసాక్షి):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల, ప్రచారంలో భాగంగా ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు, మద్దతుగా సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప శుక్రవారం రోజున ప్రచారం చేశారు. ఈ నెల 27న జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదిలాబాద్-నిజామాబాద్-కరీంనగర్-మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ కు, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి,అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పిలుపునిచ్చారు. పట్టభద్రుల తరపున చట్టసభల్లో ప్రశ్నించే గొంతుక ప్రసన్న హరికృష్ణ అని అన్నారు. పార్టీలు కతీతంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రసన్న హరికృష్ణ కు మద్దతు తెలిపి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పట్టబధ్రులైన యువతీ యువకులకును కోరారు.

# రైతులతో కలెక్టర్ సమావేశం




**అదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : ఆదిలాబాద్** జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం రెడ్ గ్రామ్ పై తాంసి మండలం హస్నాపూర్ తలమడుగు మండలం లోని కోడద్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. రెడ్ గ్రామ్ గోదాం లను పరిశీలించిన అనంతరం ఆదిలాబాద్ మండలం పొచ్చెర గ్రామం లో రైతులతో సమావేశం నిర్వహించి పొచ్చెర గ్రామం శివారు లో బెంగాలీ గ్రామ్ కేంద్రాన్ని సందర్శించి తూకం ను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా.తాంసి మండలం హస్నాపూర్, తలమడుగు మండలం కోడద్ గ్రామాలలో రైతు వేదికలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని విషయాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులతో సమావేశ ఉద్దేశం రైతులు వేసిన కంది పంట పై ఎంత దిగుబడి రావడం జరిగింది , తదితర అంశాల పై వివిధ రైతులు చిన్న మధ్య తరగతి పెద్ద రైతులతో వారి అభిప్రాయాలు తీసుకోవడం జరిగిందన్నారు. వారికి రెడ్ గ్రామ్ సంబంధించిన ఎంత దిగుబడి వచ్చింది వారి అభిప్రాయ ప్రకారం వారు చాలావరకు ఆరు నుండి ఎనిమిది క్వింటాల్ వరకు ఎకరం కు దిగుబడి వచ్చింది అని చెప్పడం జరిగింది ఇది ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారికి సరైన దిగుబడి వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, జొన్న కూడా అన్ని భూములలో వేయడం జరిగింది జొన్న కు కూడా మంచి దిగుబడి వస్తుంది అది కూడా ప్రభుత్వ దృష్టి కి తీసుకెళ్లి రైతులకు లబ్ది చేకూరేలా మీ అందరి అభిప్రాయం తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం అన్నారు. అనంతరం రైతుల ఇళ్ళల్లో, గోదాం, చెల్లలో నిల్వ ఉన్న కంది పంటను, శనగ పంటను పరిశీలించారు. కార్యక్రమంలోవ్యవసాయ అధికారి శ్రీధర్, సైంటిస్ట్, ఎంపిడిఓ, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# అనేకవైపుల విస్ఫోటం



మాదాసి రామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు.




భారత దేశంలోని ప్రజల జీవించే హక్కుపైన జరుగుతున్న దాడిని చర్చించింది. పాలకులు అనుసరిస్తున్న కార్పోరేట్ అనుకూల విధానాన్ని తేటతెల్లం చేసింది. దేశ రాజకీయ నాయకులు, ప్రజల అభివృద్ధి కంటే ఓట్లు, సీట్లు, అధికారం చేజిక్కించుకోవడంపైనే పాలకవర్గ పార్టీలు దృష్టి సారిస్తాయనేది నగ్నసత్యం.

భూతల్లి తన కడుపులో దాచుకున్న ఖనిజాలను దోచుకుపోకుండా అడ్డుపడుతున్నారని ఆదివాసి బిడ్డలపై జరుపుతున్న మరణ హోమాన్ని అనేకవైపుల నవలలో రచయిత పాణి విస్తృతంగా చర్చించారు.

ఏ పార్టీ అధికారంలో ఉన్నా, సంపన్నులను సంతృప్తి పరచడం. సహజ వనరులపై స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తలకు అధికారం దఖలు పరిచి, సంపద పోగు చేసుకోవటం. పాలకులను ప్రశ్నించే వారిని నిర్మూలించటం. ప్రజా ఉద్యమాలను ఉక్కు పాదంతో అణిచివేయటం. అడవులను జల్లడ పట్టి "ఆదివాసీ గూడా"లను ఖాళీ చేసేందుకు భారీ ఎత్తున సైనిక పటాలాలను దింపడం. సొంత ప్రజల పైనే శత్రు దేశాలతో పోరాడిన విధంగా యుద్ధం చేస్తున్నారని అనేక వైపులలో తీవ్ర విమర్శలు గుప్పించారు.

**ప్రకృతి సంరక్షకులు ఆదివాసీలే!**

ప్రకృతి అంటే అడవి మాత్రమే కాదు. మనుషులు, సమస్త జీవజాలం. వాటి మధ్య ఉండే బంధం. అడవి బయట ఉండే సమాజం. వీటన్నిటిని కలుపుతూ పోవడమే చరిత్ర. జీవరాశి మనుగడకు అడవిని కాపాడాలని, పక్షులను, జంతువులను సంరక్షించాలని, నాగరికత పేరిట విధ్వంసం జరుపకూడదని, అడవి మా హక్కు.. మా స్వేచ్ఛ.. మా జీవనం అంటూ వందల ఏళ్లుగా ఆదివాసీలు పాలకులతో పోరాటం చేస్తూనే ఉన్నారు.

రాయలసీమ వెనుకబాటుతనంపై ప్రారంభించిన "అనేకవైపుల" నవల అస్తిత్వ ఉద్యమాలను తమకు అనుకూలంగా రాజకీయ నాయకులు ఎలా మలుచుకుంటారు, స్త్రీ వాదం, దళితవాదం, కులాధిపత్యం, రాజకీయ పార్టీ నేతల తీరు, ఆదివాసీ జీవనం, జనతన సర్కార్ పనులు, విప్లవోద్యమ పరిస్థితులు, మావోయిస్టు పార్టీ గురించి 'అనేకవైపుల'లో క్షుణ్ణంగా వివరించారు. ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానిగా అమరావతిని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో చుట్టుపక్కల భూముల రేట్లు ఆకాశాన్ని అంటుతాయి. ఈ సందర్భంగా సామాన్యులు కూడా అమరావతి చుట్టూ భూమిని కొని సంపన్నుడిగా మారిపోవాలని కలలు కంటారు. సంపన్నుడిగా మారిపోవడానికి భార్యాభర్తల మధ్య చెలరేగిన చిచ్చు కాపురాన్ని ఎలా కూల్చిందో మనం గమనించవచ్చు. కార్పొరేట్ మాయ అంటే ఇదే.

విప్లవోద్యమంలోకి వెళ్లిన వాళ్లు భార్యాభర్తలు గా జీవించడం, వారికి కలిగిన సంతానం వీరి వద్ద కాకుండా, ఇతరుల వద్ద పెరగడం, సాధన పాత్ర ద్వారా ఆ అమ్మాయిలోని ఆవేదన మనకు కనిపిస్తుంది.

విప్లవంలో ఉన్న మాతృమూర్తి తన రెండు నెలల పాపను ఇతరుల వద్ద వదిలి ఉద్యమంలోకి వెళ్లడం ఎంత కష్ట సాధ్యమో, పెంచిన తల్లిదండ్రుల మధ్య విభేదాలు వచ్చి ఏడేళ్ల తర్వాత మరో జంట వద్దకు చేరడం. అనంతర పరిస్థితులు, తల్లిదండ్రుల ఆవేదన, పిల్లల మానసిక సంఘర్షణ లిసాధనలిలో మనకు కనిపిస్తుంది. "సాధన" చదువు, ఉద్యమ జీవితం, చేసే పనులతో సాగే కథనం బాగుంది. రాయలసీమ ఉద్యమ నాయకులు, మావోయిస్టు పార్టీ నాయకులతో జరిపిన సంభాషణ, కార్యాచరణ మనకు అనేక మానవీయ కోణాలను, విప్లవంలో ఉన్న పరిస్థితులను తెలియపరుస్తుంది.

**నమ్మకంగా ఆదివాసి మహిళ....**

ఆదివాసీలు, ముఖ్యంగా మహిళలు ఎంతో చలాకీగా నవ్వుతూ, నమ్మకంగా పనిచేస్తారు. భయం ఎరుగరు. శత్రువుకు తలవంచని ధీరోదాత్తులు.

బుద్రు దీదీ తన కడుపున పుట్టిన పిల్లలు రాజ్యంతో పోరాడుతూ నేలకు ఒరిగినా.. తను విప్లవోద్యమ నుంచి వెను తిరగదు. పోరాటం మానదు.

తన కుటుంబాన్ని బలి తీసుకున్న కార్పోరేట్ శక్తులకు వ్యతిరేకంగా చిన్నారి నందే తన ఇద్దరు చిన్ని తమ్ముళ్లను సాకుతూ, జనతన సర్కార్ అండతో ప్రదర్శించిన సాహసాన్ని,గడుపుతున్న జీవనాన్ని మనకు అనేక ప్రశ్నలను సంధిస్తుంది.

చదువుకునే రోజుల్లో ఉద్యమానికి ఆకర్షితుడైన రసూల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. మధ్య భారతంలో నాయకుడిగా ఎదిగిన రసూల్ ఎన్ కౌంటర్ లో మరణిస్తాడు. ఇంటి నుండి నవ్వుతూ వెళ్ళిన కొడుకు శవమై రావటం, తల్లి సుల్తానాను తీవ్ర దుఃఖానికి గురిచేస్తుంది. అప్పటినుండి ఆమె కేవలం తన గదికి పరిమితం అవుతుంది. కానీ తన కొడుకు ఉద్యమంలోని పరిస్థితులు, అక్కడి ఆదివాసీలతో కలిసి చేస్తున్న పనులు, ప్రభుత్వంతో జరుగుతున్న పోరాటం, విజయాలు, నష్టం, అక్కడి జీవనం పై సవివరంగా రాసిన డైరీ ఆమెకు చేరుతుంది.

ఆ డైరీ చదివిన తర్వాత ఆ తల్లి ఉత్తేజితురాలై, తిరిగి పాత పద్ధతిలో జీవించడం, ఉద్యమం, ఉద్యమం కారుల పట్ల ప్రేమగా వ్యవహరించడం రచయిత వివరించిన తీరు అద్భుతంగా ఉంది. మరణించి జీవించడం అంటే ఇదేనేమో. వ్యక్తిని నిర్మూలించగలరు కానీ ఆయన ఆచరణను ముగించలేరని అర్థం చేసుకోవచ్చు. పార్టీలోని ముస్లిం యువ నాయకుడు రసూల్ ను పెళ్లి చేసుకున్న ఆదివాసి ఉద్యమ నాయకురాలు హిడ్మ.ఆమె శౌర్యం, పోరాటం శత్రువుతో జరిగే యుద్ధంలో తుపాకీ గుళ్ళు దిగి పోలీసులకు చిక్కటం. అరెస్టు అనంతరం బెయిల్ పై విడుదలై తన భర్త ఇంటికి వెల్తుంది. అత్తగారికి తన కుమారుడు రాసిన ఆఖరి ఉత్తరం అందించడం, దానిని ఆమె స్వీకరించి, గుండెలకు హత్తుకునే తీరు కన్నీరు తెప్పిస్తుంది.

ముస్లిం సంప్రదాయాల్ని తోసిపుచ్చి ఆదివాసీ మహిళను కోడలుగా స్వీకరించడం, ప్రభుత్వ నిర్బంధం ఉంటుందని తెలిసినా హిడ్మాను ఆ కుటుంబం ఇంటికి రానివ్వడం ద్వారా చేసిన సాహసం చైతన్యానికి ప్రతీక.

రైతు ఆత్మహత్యలు లేని దండకారణ్యం... దేశానికి వెన్నెముక రైతు అంటూ పాలకులు ఎంతో గొప్పగా చెప్తారు. ప్రభుత్వ విధానాలు రైతు ఆత్మహత్యలను ఆపలేకపోతున్నాయి. పెరిగిన పెట్టుబడులు, పండిన పంటకు గిట్టుబాటు ధర రాక, చేసిన అప్పులు తీర్చలేక, రైతు ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. రైతుపై వ్యాపారం చేసే దాన్యం దళారి, ఎరువులు, విత్తనాలు అమ్ముకునే వ్యాపారులు విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. కానీ జనతన సర్కారు చేసే సమిష్టి వ్యవసాయంలో రైతు క్షేమంగా ఉన్నాడని ఇందులో స్పష్టం చేస్తున్నది. దేశాన్ని జైలుగా మార్చిన పాలకులపై రచయిత మండిపడతాడు. ప్రజల ఆకాంక్షను గమనించరు...
మనసులో మాట చెప్పుకోవడానికి అనుమతించరు...
పాలకుల తప్పులను ప్రశ్నిస్తే పోలీసులతో సమాధానం ఇప్పిస్తారు...
కార్పొరేట్ శక్తులను అడ్డుకుంటే జైల్లో వేస్తారు.....
మరి తిరగబడితే తూటాలతో మాట్లాడుతారు... నేటికీ దేశంలోని జైళ్ళల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఆదివాసీలే పెద్ద సంఖ్యలో మగ్గుతున్నారు. వారిపై నమోదైన కేసు ఏమిటి, ఎందుకు జైలు జీవితం గడుపుతున్నారో కూడా వారికి తెలియని స్థితి. బెయిల్ ఎలా పొందాలి అనేది వారికి, ఆ కుటుంబాలకు కూడా తెలియని దుస్థితి.

నేడు సమాజంలో దేశభక్తి పేరిట హిందూ, ముస్లిం గొడవలు చెలరేగుతున్నాయి. మనుషులను విడగొట్టి, మనుసుల్లో విద్వేషాన్ని నింపి గద్దెనెక్కాలనే తాపత్రయం మనువాద పార్టీలకు వెన్నుతో పెట్టిన విద్యగా మారిపోయింది. స్వాతంత్ర సమరయోధుడు సదాశివం తన మనవడికి రాంప్రసాద్ బిస్మిల్ అనే పేరు పెట్టి ఎంతో సంతోషిస్తాడు. కానీ ఈ రోజుల్లో, ఈ విధ్వంస సమయాన ఆ కుర్రాడు తురకల పేరు ఏమిటని ఎంతో మధన పడతాడు. ఆయనపై ఆర్ఎస్ఎస్ భావజాలకులు చేసే దాడిని ఇందులో రచయిత వివరించిన తీరు బాగుంటుంది.

**స్త్రీ స్వేచ్ఛ విప్లవోద్యమంలోనే సాధ్యం..**

స్వేచ్ఛగా జీవించడం. తనకు నచ్చిన రీతిలో నడుచుకోవడం. వారి వ్యక్తిత్వం, ఆకాంక్షను గౌరవించడం, ఉద్యమంలో గమనించవచ్చు. స్త్రీ, పురుష భేదాలు లేకుండా, అందరూ అన్ని రకాల పనులు చేయటం, తుపాకులు ధరించి యుద్ధంలో పాల్గొనడం ఇందులో వివరించిన తీరు బాగుంది. స్త్రీలను కేవలం వ్యాపార ప్రకటనలకు, విలాస వస్తువుగా, లైంగిక దోపిడీకి పనికి వచ్చే ఆటబొమ్మగా భావించడాన్ని మనం రోజూ, మన చుట్టూ గమనించ వచ్చు. భిన్నమైన రీతిలో సమానతను, స్వేచ్ఛను మనం గమనించవచ్చు. అయితే మావోయిస్టు పార్టీ నుండి మగవాళ్ళు ఏ కారణం చేత బయటకు వచ్చిన, వారి వెంట భార్యలుగా ఉన్న మహిళా ఉద్యమకారులు కూడా బయటకి రావడం గమనించవచ్చు.

**అమరత్వం ఎంతో ఉన్నతమైనది!**

ఉద్యమంలో పనిచేస్తున్న వారికి వ్యక్తిగత కుటుంబ సంబంధాలు, ప్రేమానురాగాలు ఉండవు. ఎందుకంటే వారి చుట్టూ వేలాదిమంది తల్లులు, అక్క చెల్లెలు, అన్నదమ్ములు కుటుంబ సభ్యులుగా జీవిస్తుంటారు. ఒక తల్లి కడుపున పుట్టినా వేలాదిమంది తల్లులకు బిడ్డగా జీవిస్తున్నామని వివరిస్తాడు రచయిత. పోలీసులు చేత అరెస్టు కాబడిన విప్లవ నాయకులు, విప్లవకారులు అనంతరం జనజీవనంలో జీవించే పరిస్థితి, పార్టీ ద్వారా ప్రజల్లో కలిగే ప్రత్యేకత, గౌరవం, మర్యాదలు గమనించవచ్చు. పార్టీ సానుభూతిపరులుగా ఉద్యమానికి చేసే సేవలు ఎలా ఉంటాయో కూడా గుర్తించవచ్చు.

మైదాన ప్రాంతంలో ఉద్యమ వ్యాప్తికి జనజీవన స్రవంతిలో ఉండి పనిచేస్తున్న అజ్ఞాత నాయకుడు ప్రధాన్ ను గుర్తు తెలియని వ్యక్తులు చంపివేయటం ద్వారా పాలకులు ఏ రకంగా వ్యవహరిస్తున్నారు అనేది వివరిస్తాడు. దండకారణ్యంలో నిత్యం యుద్ధ వాతావరణం నెలకొని ఉందని, జనతన సర్కార్ పాలకులను ఎలా ఎదుర్కొంటున్నది, అడవిలోని ఉద్యమం, నాయకులు ఎలా వ్యవహరిస్తున్నది, జీవిస్తున్నది,ఉద్యమాన్ని నడిపిస్తున్నది ఇందులో మనకు కనిపిస్తుంది.మావోయిస్టు నాయకులు రఘు,మోహన్ లతో సాధనతో జరిపే సంభాషణ ద్వారా మొత్తం విప్లవోద్యమాన్ని మన కళ్ళకు కట్టినట్లు రచయిత ఇందులో వివరిస్తారు.

భారత దేశ తాజా పరిస్థితులు, విప్లవకారుల కార్యాచరణ, విప్లవోద్యమ స్థితి, పోరాటం, నిర్బంధం అన్నింటిని అన్ని వైపుల నుండి మనం గమనించే అవకాశం మనకు చిక్కుతుంది. రాయలసీమ ఉద్యమాన్ని ఎక్కువగానే వివరించారు. సమాచారం వివరంగా ఇవ్వడం వలన పుస్తకం సైజు పెరిగింది. మొదట చూస్తే అబ్బా ఇంత చదవగలమా అని భయపడతాం. కానీ మొదలుపెడితే చివరి వరకు వెళ్ళిపోతూనే ఉంటాం.

ఎగిరే పక్షులు
ఎగిసిపడే అలలు
గురి తప్పని తూటాలు
విజయం వైపే అడుగులు.......



# బీజేపీ సిఎంల ఎంపిక ఆశ్చర్యమే!

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో సిఎంల ఎంపిక ఆశ్చర్య పరుస్తున్నది. ముందు డిల్లీ సిఎం ఎంపిక చూద్దాం! రెండుసార్లు ఓడి మూడోసారి ఎన్నికల్లో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే రేఖగుప్తాను సిఎం పదవి వరించింది. ఒకప్పుడు డిల్లీ లో ఉన్న జేఎన్యూ ను బంద్ చేయాలని స్టేట్మెంట్ ఇచ్చిన రేఖా గుప్తా, డిల్లీ లో సిటీ కార్పొరేషన్ ముందు ఆందోళనలు చేస్తూ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. ఆమె పేరును సిఎంగా ప్రకటించగానే, ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

**2019 వీడియో వైరల్!**

2019 నవంబర్‌లో జేఎన్యూ మీద ఆమె చేసిన వ్యాఖ్యల వీడియోను వైరల్ చేశారు. కేవలం పది రూపాయలకే జేఎన్యూలో భోజనం చేస్తూ హాస్టల్‌లో ఉంటూ 50 ఏండ్లుపైబడినా ఇంకా ఆ కోర్సు, ఈ కోర్సు అంటూ విద్యార్థులమంటూ, తిష్ట వేశారని,10 రూపాయలు బిక్షగాడికి వేసినా తీసుకోడని,300 రూపాయలు ఫీజు పెంచితే పార్లమెంట్ ముందు ఆందోళనకు సిద్ధం అవుతారని, మూడు వేల జీన్స్, వెయ్యి రూపాయల షర్ట్, జేబులో లక్ష రూపాయల మొబైల్ మెయింటెయిన్ చేసే వారు,300 కట్టలేరా అంటూ, జెఎన్యూను బంద్ చేయాలంటూ ఏకైక పేదవాడికి అందుబాటులో ఉన్న జేఎన్యు మీద రేఖా గుప్తా మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అంతే కాదు డిల్లీ మాజీ సిఎం కేజ్రీ వాల్ మీద ఆమె విషం చిమ్ముతూ, మాట్లాడకూడని, రాయకూడని కేజ్రీవాల్ బర్త్ డే చేసుకోడు, అతను ఏ ప్రక్రియ ద్వారా పుట్టాడో ఆ వీడియోను వాళ్ళ అమ్మతో అడుగుతున్నాడు, అంటూ ఎంత నీచంగా చేసిన ట్వీట్ కూడా ఉంది. కేజ్రీవాల్‌ను అతని తల్లి ఒడిలోకి పంపుతామని ఆమె అన్నారు. డిసెంబర్ 2019లో తెలంగాణలో జరిగిన ఎన్కౌంటర్‌ను కూడా ఆమె సమర్థించారు.

**వర్మ అంతే!** మరోవైపు షాహిన్ బాగ్ వాళ్ళు ఇతరుల ఇండ్లలోకి జొరబడి ఆడపిల్లలను రేప్ చేస్తారు అని మాట్లాడిన వర్మను డిల్లీ ముఖ్యమంత్రిని చేశారు. ఇలాంటి వారిని పక్కగా ఎంపిక చేయడానికి, ప్రమోట్ చేయడానికి కారణం, వీరే సమాజంలో తిమ్మిని బమ్మిని చేయగలరని, ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ విధానంను సమాజంలోకి తీసుకెళ్ళి, విద్వేషం అనే దుకాణంను సాఫీగా నడపగలరనే నమ్మకం కాబోలు!

**ఈ సిఎంలలో విద్వేషం!** ఉత్తరప్రదేశ్ సిఎం యోగీ ఆదిత్య నాథ్ అయినా, అసోం సిఎం హేమంత్ బిస్వ శర్మ అయినా ఇలా ఎవరిని చూసినా ఏముంది గర్వకారణం అనేవిధంగా, మణిపూర్ కు మొన్నటి దాకా సిఎం గా ఉండి ఇటీవలి రాజీనామా చేసిన అక్కడ రెండువర్గాల ప్రజల మధ్య చిచ్చుకు కారణం అయిన బీరెన్ సింగ్ అయినా అంతే! నిజానికి డిల్లీకి ఇప్పుడు రేఖా గుప్తా నాలుగో మహిళా సిఎం , ఇప్పుడు బీజేపీ కి దేశంలోనే ఏకైక సిఎం అయ్యారు. రాజస్థాన్ లో మాజీ సిఎం వసుంధర రాజే సింధియా కు మరో అవకాశం ఇవ్వలేదు! డిల్లీ లో సుష్మా స్వరాజ్ బీజేపీ సిఎం గా పని చేశారు. కాంగ్రెస్ నుంచి షీలా దీక్షిత్ డిల్లీ సిఎం గా ఉన్నారు. మొన్న కొద్దికాలం ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఆతిశి సిఎం గా ఉన్నారు. డిల్లీ లో డిప్యూటీ సిఎం పర్వేష్ వర్మ కూడా విద్వేశాల ఉపన్యాసాలు ఇవ్వడంలో నెంబర్ వన్ గానే ఉన్నారు. డిల్లీ సిఎం గా రేఖా గుప్త కు మంచి అవకాశం లభించింది.

**మార్పు కోసం జుబాన్ సంభాల్కే!**

గతంలో కాకుండా ఆమె మాటల్లో, చేతల్లో జన హితం అలవర్చుకోవాలి! ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి! ఇంతకు ముందు వేరు, ఇప్పుడైట్కన కాస్త జుబాన్ సంభాల్ కే....లేని పక్షం లో డిల్లీ లో దశాబ్దాలుగా కలుషిత వాతావరణం ను జనం భరిస్తున్నారు. కాస్త విషం కక్కుతున్న రాజకీయాలను కూడా భరించడం అలవాటు చేసుకోవాలి! మన పీఎం మోడీ జీ , హోం మంత్రి అమిత్ షా లు బీజేపీ కి సంబంధించి రాష్ట్రాల , ఎన్డిఏ పాలిత రాష్ట్రాల్లో ఎవరిని సిఎం అంటే వారే సిఎం అంతే ! మహారాష్ట్ర లో షిండే, ఆతర్వాత ఇప్పుడు పడ్నవిస్, బీహార్లో ఇప్పుడు నితీష్కుమార్ రేపు మరొకరు కావచ్చు!,



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# పౌర నైపుణ్యాలను నేర్పే 'స్కౌట్స్ అండ్ గైడ్స్'

ప్రపంచ స్కౌటింగ్ ఉద్యమాన్ని రూపొందించడంలో కీలకపాత్ర పోషించి బాయ్స్ స్కౌట్స్ ఉద్యమాన్ని స్థాపించిన లార్డ్ రాబర్ట్ బాడెన్ పావెల్ జన్మదినం ఫిబ్రవరి 22న ప్రపంచ స్కౌట్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ప్రపంచ స్కౌట్ 11 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలుర కోసం ఒక కార్యక్రమంగా ప్రారంభమైంది.

విలువలు నేర్పుతున్న స్కౌట్:

స్కౌటింగ్ యువత విద్యా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, నైతికత, నాయకత్వ నైపుణ్యాలు, వారి వయోజన జీవితాలను ప్రభావితం చేసే పౌర నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది. స్కౌటింగ్ యువతకు వ్యక్తులుగా తాము ముఖ్యమని భావాన్ని అందిస్తుంది. స్కౌటింగ్ కుటుంబానికి చెందిన వారు ఒక గేమ్‌లో గెలిచినా ఓడినా అనే దానితో సంబంధం లేకుండా వారికి ఏమి జరుగుతుందనే దాని గురించి వారికి తెలియజేయబడుతుంది. స్కౌటింగ్ వ్యక్తిగత బాధ్యత, అధిక ఆత్మగౌరవానికి దారితీసే కార్యకలాపాలను ప్రోత్సహిస్తుంది. తత్ఫలితంగా కఠినమైన నిర్ణయాలు తీసుకోవలసి వచ్చినప్పుడు దానికి కావల్సిన సరైన మార్గాన్ని ఎంచేకునేటప్పుడు ఏర్పడే ఒత్తిడిని జయించవచ్చు. స్కౌటింగ్ మన సమాజంలో పెరుగుతున్న యువకుల ఆరు ముఖ్యమైన అవసరాలను తీర్చడంలో సహాయపడుతుంది. అవి మార్గదర్శకత్వం, జీవితకాలం నేర్చుకోవటం , విశ్వాస సాంప్రదాయాలు, ఇతరులకు సేవ చేయడం, ఆరోగ్యవంతమ్మైన జీవితం , బిల్డింగ్ క్యారెక్టర్. వంద సంవత్సరాలకు పైగా స్కౌటింగ్ కార్యక్రమాలు యువతలో స్కౌట్ ప్రమాణం స్కౌట్ చట్టంలో ఉన్న విలువలను నింపాయి. స్కౌటింగ్ ప్రపంచ వ్యాప్తంగా 200 దేశాలు, భూభాగాలలో 5.7 కోట్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. విద్య, సాహసం, వినోదం కలయికల ద్వారా మెరుగైన మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.

స్కౌట్ చరిత్ర :

1908 లో బాడెన్-పావెల్ "స్కౌటింగ్ ఫర్ బాయ్స్" అనే పుస్తకాన్ని ప్రచురించారు. ఇది తక్షణ విజయాన్ని సాధించింది. అప్పటి నుండి 100 మిలియన్ కాపీలు అమ్ముడవ్వడమే కాకుండా 1909లో ఐదు భాషల్లోకి అనువదించబడింది. ఇది "ది బాయ్ స్కౌట్స్" అనే పేరుతో ఒక ఉద్యమాన్ని రూపొందించింది. 1910లో బాడెన్ పావెల్ తన సోదరి ఆగ్నెస్ నాయకత్వంలో గర్ల్ గైడ్స్‌ను ప్రారంభించారు. 1916లో "వోల్ఫ్ కబ్స్ హ్యాండ్‌బుక్" ప్రచురణ, రుడ్యార్డ్ కిప్లింగ్ "జంగిల్ బుక్"ను ఫ్రేమ్‌వర్క్‌గా ఉపయోగించడం ద్వారా 11 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న అబ్బాయిల కోసం కబ్ స్కౌట్స్ ప్రారంభించబడింది. 1920లో మొదటి ప్రపంచ స్కౌట్ కాన్ఫరెన్స్ (నాటి పేరు అంతర్జాతీయ స్కౌట్ కాన్ఫరెన్స్) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో జరిగిన మొదటి ప్రపంచ స్కౌట్ జంబోరీలో 33 జాతీయ స్కౌట్ సంస్థలు హాజరయ్యాయి. వరల్డ్ స్కౌట్ బ్యూరో (అప్పట్లో బాయ్ స్కౌట్స్ ఇంటర్నేషనల్ బ్యూరో) యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లండన్‌లో స్థాపించబడింది. 1922లో 31 జాతీయ స్కౌట్ సంస్థలు ప్రాతినిధ్యం వహించిన ఫ్రాన్స్‌లోని పారిస్‌లో 2వ ప్రపంచ స్కౌట్ సమావేశం జరిగింది. గ్లోబల్ సభ్యత్వం ఒక మిలియన్ కంటే ఎక్కువ స్కౌట్‌లకు చేరుకుంది. రెండు ప్రపంచ యుద్ధాల మధ్య, స్కౌటింగ్ కార్యకలాపాలు నిషేధించబడిన నిరంకుశ ప్రాంతాలలో మినహా స్కౌటింగ్ అభివృద్ధి చెందుతూనే ఉంది. ఆక్రమిత దేశాల్లో, నిరంకుశ పాలన ఉన్న దేశాల్లో స్కౌట్‌లు ప్రతిఘటన భూగర్భ ఉద్యమాలలో ముఖ్యమైన పాత్రలు పోషించడంతో స్కౌటింగ్ రహస్యంగా కొనసాగింది. స్కౌట్స్ ఆకలితో ఉన్నవారికి ఆహారం ఇవ్వడం, గాయపడిన వారికి సహాయం చేయడం ద్వారా ప్రపంచ యుద్ధాల ద్వారా తమ దేశాలకు మద్దతు ఇచ్చారు. కొన్ని చోట్ల సీస్ స్కౌట్స్ కోస్ట్ గార్డ్స్ గా వ్యవహరించారు. స్కౌట్ ఉద్యమం 21వ ప్రపంచ స్కౌట్ జంబోరీ కోసం యునైటెడ్ కింగ్‌డమ్‌లో దాని మూలాలకు తిరిగి రావడం ద్వారా 2007లో దాని 100వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది.



200 పైగా దేశాలలో:

ఒక శతాబ్దం క్రితం స్కౌటింగ్ ప్రారంభించినప్పటి నుండి 50కోట్లకు పైగా యువకులు, పెద్దలు స్కౌటింగ్‌లో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ చురుకైన పౌరులుగా ఉండటానికి, వారి కమ్యూనిటీలలో సానుకూల మార్పును సృష్టించడానికి ఉద్యమంలో చేరారు. నేడు, స్కౌటింగ్ అనేది ప్రపంచవ్యాప్తంగా 200 దేశాలు, భూభాగాల్లో 5.7 కోట్లకు పైగా స్కౌట్‌లతో ప్రపంచంలోని ప్రముఖ విద్యా యువజన ఉద్యమం. విద్య, సాహసం, వినోదం దాని ప్రత్యేక కలయిక ద్వారా మెరుగైన మరింత స్థిరమైన ప్రపంచాన్ని సృష్టించడంలో నిమగ్నమై ఉన్న చురుకైన పౌరులుగా మారడానికి యువకులకు స్కౌటింగ్ ప్రేరణగా కొనసాగుతోంది.

మన దేశంలో...

స్కౌటింగ్ అధికారికంగా బ్రిటిష్ ఇండియాలో 1909లో స్థాపించబడింది. మొదట బెంగళూరులోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూల్‌లో ప్రారంభమైంది. స్థానిక భారతీయుల కోసం స్కౌటింగ్‌ను జస్టిస్ వివియన్ బోస్, మదన్ మోహన్, హృదయనాథ్ కుంజ్రు, గిరిజా శంకర్ బాజ్‌పాయ్, అనిబిసెంట్, జార్జ్ అరుండేల్ 1913లో ప్రారంభించారు. మొదటి గర్ల్ గైడ్స్ కంపెనీ జబల్‌పూర్‌లో 1911లో క్రైస్ట్ చర్చ్ స్కూల్‌లో స్థాపించబడింది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశంలో పనిచేస్తున్న స్కౌట్ , గైడ్ అసోసియేషన్ల ఏకీకరణకు కృషి జరిగింది. భారతదేశ మొదటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, భారతదేశ మొదటి విద్యా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్, సెంట్రల్ ప్రావిన్స్ గవర్నర్ మంగళ్ దాస్ పక్వాసా, ఇతర స్కౌట్ నాయకులు పండిట్ హృదయ్ నాథ్ కుంజ్రూ వంటి వారు, జాతీయ నాయకులు తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. స్కౌట్ అండ్ గైడ్ అసోసియేషన్ల విలీనం కోసం పండిట్ శ్రీరామ్ బాజ్‌పాయ్, జస్టిస్ వివియన్ బోస్, ఇతరులు కృషి చేశారు. విలీన పత్రాన్ని ఖరారు చేయడంలో భారత ప్రభుత్వ విద్యా కార్యదర్శి డాక్టర్ తారా చంద్ గణనీయమైన కృషి చేశారు. చివరి విలీనం 7 నవంబర్ 1950న జరిగింది. ఏకీకృత సంస్థ "ది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్" పేరుతో ఉనికిలోకి వచ్చింది. గర్ల్ గైడ్స్ అసోసియేషన్ అధికారికంగా 1951 ఆగస్టు 15న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరింది.



కింజరాపు
అమరావతి
82472 86357



## ఆమె బ్రతికే వుంటుంది..!

అందరూ అంటున్నారు
స్టెతస్కోప్‌తో ఆమె లేదని..!
ఆమె మృత్యు గుహలోకి
మళ్ళీ రాలేని చీకటిలోకి
ఎవ్వరికీ చెప్పకుండానే
వెళ్ళిందని ఏకధాటిగా
ఏడుస్తూనే వున్నారు
ఆమె తల్లిదండ్రులు..!
ఓ భయంకర రోడ్డు ప్రమాదం
ఆమె గుండె లయ ప్రవాహాన్ని ఆపేసి
"ఊపిరిని"శాశ్వతంగా చంపేసింది..!

బాల్యం నుంచే
బలమైన కలలుగనేది
భవిష్యత్తు కోసం..!
బ్రతికిస్తూ.. డాక్టరయ్యింది..!
మరణం మనల్ని ఓడించిన
"మన ప్రాణం"పదిమంది
జీవితాల్ని గెలిపించాలంది..!
చిన్న వయసు...
కానీ...ఎంత పెద్ద మనసు..!

ఆమె ప్రాణం ప్రపంచానికి
ఓ విలువైన పాఠమయ్యింది.
ఐదు జీవితపు రూపాల్లో
గుండె స్పందనగా కొట్టుకుంటూనే
బ్రతుకు దీపాలను వెలిగిస్తుంది..!

ఇప్పుడు అందరూ అంటున్నారు
ఆమె బ్రతికే వుందని..!
భూమికా రెడ్డి చావలేదని
ఆమెకు ఇక చావులేదని..!
ప్రతిభలోనే కాదు..
వ్యక్తిత్వంలోనూ ఆమె డాక్టరే..!

ఆ రోడ్డు ప్రమాదం..
ఆమె స్ఫూర్తి ప్రకాశంలో
పోరాడుతూ ఓడిపోయింది..!
"ఆమె"అవయవ దానానికి
దిక్సూచిగా నిలిచిపోయింది..!!

(రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మరణించిన డాక్టర్ భూమికా రెడ్డి అవయవదానం పై స్పందన)

ఫిజిక్స్ అరుణ్ కుమార్
9394749536

## నేటికవనాలు సమాలోచనలు

కవితలు
కుప్పలతెప్పలుగా వెలువడుతున్నాయి
కవులు
ఇబ్బడిముబ్బడిగా పుట్టకొస్తున్నారు
పత్రికలు
పెక్కురాతలను ప్రచురిస్తున్నాయి
కవులకుబిరుదులు
వివిధసంస్థలు ఇస్తున్నాయి
కవిసమ్మేళనాలు
పలుప్రదేశాలలో జరుగుతున్నాయి
కవిసన్మానాలు
విరివిగా జరుగుతున్నాయి
యువకవులు
రోజురోజూ పెరుగుతున్నారు
మహిళాకవులు
పెద్దసంఖ్యలో ప్రవేశిస్తున్నారు
కవితలలో
తాళులేకుండా
ధాన్యముండెలాచూడాలి
కవనాలలో
ఓడువిలేకుండా
గట్టివియుండేలాచూడాలి
కైతలలో..
పొట్టులేకుండా గింజలుండేలాచూడాలి
కయితలలో..
వ్యర్థాలులేకుండా
అర్థాలుండేలాచూడాలి
పుస్తకావిష్కరణలు..
పలుచోట్లా చేయబడుతున్నాయి
కవితలకు...
దిశయుండాలి మార్గనిర్దేశముండాలి
కయితలు
పాఠకులను ఆకట్టుకొనేలాగుండాలి
కవనాలు
చదువరులు
జ్ఞాపకంపెట్టుకొనేలాగుండాలి
రాతలలో...
నూతనత్వముండాలి
వస్తువైవిధ్యముండాలి
అక్షరాలలో
కువకువలుండాలి కళకళలుండాలి
అప్పుడే
సాహిత్యానికి వృష్టి పరిపుష్టి
ఆనాడే
వాణీదేవికి
హారతి
ప్రఖ్యాతి



గుండ్లపల్లి
రాజేంద్రప్రసాద్
భాగ్యనగరం

# బీఆర్ఎస్ సైలెంట్ మోడ్!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో వ్యూహం తెలియక తికమక
- ప్రధాన నేతలున్న ప్రాంతాల్లోనూ బరిలో లేని బీఆర్ఎస్ అభ్యర్థులు
- కాంగ్రెస్, బీజేపీలకు సవాల్ విసురుతున్న స్వతంత్ర అభ్యర్థులు
- ఎన్నికల్లో ఓటు ఎవరికి వేయాలనే దానిపై 'గులాబీ' క్యాడర్ తర్జనభర్జన

చాడ వేణుగోపాల్ రెడ్డి (జనంసాక్షి ప్రత్యేక ప్రతినిధి)



తెలంగాణవ్యాప్తంగా శాసనమండలి ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్ది బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారంలో స్పీడ్ పెంచారు. కాంగ్రెస్, బిజెపీ నాయకులు తమ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం ముమ్మరం చేస్తున్నారు. అయితే అనుహ్యంగా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ పోటీకి దూరంగా ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, క్యాడర్ ఏం చేస్తున్నారు? ఎన్నికలు అంటే ముందుండే బిఆర్ఎస్ పార్టీ ఈ మండలి ఎన్నికల్లో సైలెంట్‌గా సైడ్ అవ్వడంపై కార్యకర్తలు ఏమనుకుంటున్నారు..?

శాసనసభ మండలి ఎన్నికల్లో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితి పార్టీ దూరంగా ఉండటం సొంతపార్టీ కార్యకర్తలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ.. అధికారం కోల్పోయిన యేడాది తర్వాత జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో లేకుండా ఉండటానికి కారణలు ఏంటో కార్యకర్తలకు అంతు పట్టడం లేదు. టీచర్ల ఎమ్మెల్సీకి దూరంగా ఉన్న పర్లేదుగానీ, పట్టభద్రుల నియోజకవర్గంలోనూ అభ్యర్థిని నిలపలేదు. పార్టీ ఆవిర్బావం నుండి సంస్థాగతంగా బలంగా ఉండి, పార్టీకే అయువుపట్టుగా ఉన్న ఉమ్మడి మెదక్ -నిజామాబాద్ -ఆదిలాబాద్ -కరీంనగర్ జిల్లాల పరిధిలో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం ఉండడం కార్యకర్తల్లో అత్మసైర్యాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఉద్యమకాలం నుండి విజయాలు సాధిస్తువస్తున్న ఈ గ్రాడ్యుయేట్స్ స్థానంలో గ్రామగ్రామనా పార్టీకి కార్యకర్తలు ఉండి, రెండు పర్యాయాలు ప్రభుత్వం నడిపిన బీఅర్ఎస్ పార్టీ పోటీకి ఎందుకు వెనుకంజ వేసిందో కార్యకర్తలకు అంతుచిక్కడం లేదు. రాజకీయాల్లో గెలుపొటములు సహజంగానీ, సరైన కారణం లేకుండా, అది ప్రజలకు చెప్పకుండా పోటికి దూరంగా ఉండటం వల్ల నష్టమే ఎక్కువగా జరుగుతుందని బీఆర్ఎస్ కార్యకర్తలు మదనపడుతున్నారు. ఎన్నిక ఏద్కెనా ముందుండే బిఅర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ప్రభావితంచేసే మండలి ఎన్నికలకు దూరంగా ఉండటం పార్టీకి తీవ్ర నష్టం చేస్తుందని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. మండలి ఎన్నికల్లో బిఅర్ఎస్ పార్టీ పోటిలో ఉండి విజయం సాధించి ఉంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేసేవారమని బిఅర్ఎస్ కార్యకర్తలు చెబుతున్నారు.

### ఉద్ధండులున్నచోట.. ఎందుకిలా..!

ఒకవైపు బిఅర్ఎస్ పార్టీ అధినేత కెసీఅర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, ఇక కాంగ్రెస్ పార్టీ లేవదని, మళ్లీ మన బిఅర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని పదేపదే చెబుతున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల స్థానాల్లో ఉప ఎన్నికలు వస్తాయనీ సిద్ధంగా ఉండాలంటూ కర్తవ్యబోధ చేశారు. తీరా 15 జిల్లాల పరిధిలో మూడున్నర లక్షలకుపైగా ఓటర్లు పాల్గొనే ముఖ్యమైన మండలి ఎన్నికలకు దూరంగా ఉండటం ఏమి స్ట్రాటజీనో అర్థం కావడంలేదని కార్యకర్తలు అంటున్నారు. పట్టభద్రుల ఎన్నికలు జరుగుతున్న జిల్లాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఏడుగురు, నిజామాబాద్ జిల్లా నుండి ఇద్దరు, ఆదిలాబాద్ నుండి ఇద్దరు, కరీంనగర్ జిల్లా నుండి ఐదు మంది శాసనసభ్యులు మొత్తం 16 మంది 2023 ఎన్నికల్లో బీఅర్ఎస్ పార్టీ నుండి విజయం సాధించారు. అధినేత కేసీఆర్ మొదలు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత..అందరు ప్రసుత్త ఎన్నికలు జరుగుతున్న ఎమ్మెల్సీ పరిధిలోని జిల్లాల్లోనే ప్రజాప్రతినిధులుగా ఉన్నారు. ఉద్ధండులు ప్రాతినిధ్యం వహిస్తున్నచోట బీఆర్ఎస్ అభ్యర్థి లేకపోవడం ఆత్మహత్యా సదృశ్యమేననే అభిప్రాయం వినబడుతోంది. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు అభ్యర్థులను బరిలో నిలిపి ప్రచారానికి వెళ్తుండగా.. భారాస నేతలు మాత్రం ఏమీ పాలుపోక సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ అధికారం అనే మాటలు నమ్మకం కలిగించడం లేదని కార్యకర్తలు గుసగుసలాడుతున్నారు. సంస్థాగతంగా క్యాడర్ లేకపోయినా, పరిమిత ఆర్థిక వనరులతో స్వతంత్ర అభ్యర్థులుగా ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో కొందరు ధ్కెర్యంగా నిల్చొని కాంగ్రెస్, బిజెపీలకు సవాల్ విసురుతున్నారు. అలాంటిది ప్రధాన ప్రతిపక్షంగా ఉండి ఊరూరా క్యాడర్ ఉండి, ఎమ్మెల్యేలు, ఆర్థిక వనరులు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ బరిలో నిలవకపోవడం కార్యకర్తలను తీవ్రంగా బాధిస్తోంది.

### ఓటు ఎవరికో..?

పార్టీ తరపున అభ్యర్థి లేకపోవడంతో కీలకమైన ఎన్నికల వేళ బీఅర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు చేసే పనిలేక సైలెంట్ మోడ్‌లో ఉన్నారు. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఎన్నికల్లో ఎవరికి ఓటు వేయాలో చెప్పలేని స్థితిలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. అటు క్యాడర్‌కు ఏమి చెప్పుకోలేక.. ఇటు అధిష్టానం వైఖరి ఏంటో అర్థంగాక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలలు పట్టుకున్నారట. ఏద్కెనా రాజకీయాలు ఎప్పుడు ఏలా మారుతాయో తెలియదు. ఈ మండలి ఎన్నికలు ఫలితాలు భవిష్యత్తు తెలంగాణ రాష్ట్ర రాజకీయాలను ఎలా ప్రభావితం చేస్తాయో ఎదురుచూడాలి. పోటికి దూరంగా ఉన్న బీఆర్ఎస్ పార్టీకి మండలి ఎన్నికల ఫలితాలు ఏ రకంగా ఉపయోగపడుతాయో లేక నష్టం చేస్తాయో వేచిచూడాలి.

## లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన బాలుడు

- కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) : లిఫ్టుకు – స్లాబ్‌కు మధ్య ఇరుక్కున్న ఆరేళ్ల బాలుడిని హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు శుక్రవారం కాపాడాయి. మాసబ్ ట్యాంకు, శాంతినగర్‌లోని మఫర్ కంఫర్టెక్ అపార్టుమెం టులో లిఫ్ట్ డోర్‌కు గోడకు మధ్య 6 సంవత్సరాల అర్నవ్ ఇరుక్కున్నాడు అని హైడ్రాకు ఫిర్యాదు రాగానే డీఆర్ ఎఫ్ రంగంలోకి దిగింది. మధ్యాహ్నం 2.29 గంటలకు ఘటన జరిగినట్టు సమాచారం అందుకోగానే డీఆర్ ఎఫ్ మొదటి బృందం 10నిమిషాల్లో చేరుకుంది. తర్వాత మరో రెండు బృందాలు తోడయ్యాయి. గ్రిల్‌తో ఉన్న లిఫ్ట్ డోర్ తెరిచిన వెంటనే బయటకు వచ్చే క్రమంలో అంతస్తు స్లాబ్‌కు – లిఫ్ట్‌కు మధ్య ఉన్న గ్యాప్(ఖాళీగా ఉన్న సందులో)లో పడిపోయి కిందకు జారి మొదటి అంతస్తు దగ్గర ఇరుక్కున్నట్టు నివాసితులు చెప్పారు. నాలుగు అంతస్తుల అపార్టుమెంట్‌లో మూడో అంతస్తులో పిల్లలతో ఆడుకుని లిఫ్టు ఎక్కి జారిపడినట్టు నివాసితులు తెలిపారు. లిఫ్ట్ ఎవరూ ఆపరేట్‌చేయకుండా ముందుగా కరెంటు కనెక్షన్ తొలగించారు. ఆ వెంటనే డీఆర్ ఎఫ్ బృందాలు ఆపరేషన్ మొదలు పెట్టాయి. గ్యాస్‌కట్టర్లు, ఫైర్ విభాగానికి చెందిన పనిముట్లుతో లిఫ్టు ఫ్రేమ్‌ను కట్ చేయడంతో పాటు.. స్లాబ్‌ను కూడా అతి కష్టమ్మీద కట్ చేసి బాలుడుని హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు కాపాడాయి. సరిగ్గా 4.35 గంటల ప్రాంతంలో బయటకు తీసి.. తల్లిదండ్రులకు అప్పగించి.. తర్వాత ఆసుపత్రికి తరలించారు. జిల్లా ఫైర్ ఆఫీసర్ ఎ. యజ్ఞనారాయణ, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ పి. దత్తు ఆధ్వర్యంలో డీఆర్ఎఫ్ బృందాలు ఈ ఆపరేషన్‌ను పూర్తి చేశాయి. లిఫ్టు ఫ్రేమ్‌లు కట్ట చేసి క్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను పూర్తి చేసి.... పిల్లాడిని సురక్షితంగా బయటకు తీయడాన్ని చూసిన స్థానికులు హైడ్రా బృందాలను అభినందించారు.

## అదృశ్యమైన నలుగురు విద్యార్థుల ఆచూకీ లభ్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) : తప్పిపోయిన అంబర్‌పేట్ ప్రేమ్‌నగర్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఆచూకీ దొరికింది. ఈ నలుగురు బుధవారం సాయంత్రం అదృశ్యమైన సంగతి తెలిసిందే. దాదాపు 24 గంటల తర్వాత ఆ పిల్లల ఆచూకీ లభ్యం కావడంతో తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నలుగురు విద్యార్థులు యాదగిరిగుట్టలోని తమ బంధువుల ఇంట్లో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పిల్లలను హైదరాబాద్‌కు తీసుకొచ్చేందుకు అంబర్‌పేట్ పోలీసులు యాదగిరిగుట్టకు వెళ్లారు. ప్రేమ్‌నగర్‌కు చెందిన ఎండి అజమత్ అలీ(13), కొండ్‌పేట తేజ్‌నాథ్ రెడ్డి(13), నితీష్ చౌదరి(13), కోరే హర్ష వర్ధన్(13) నలుగురు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. నలుగురు కలిసి బుధవారం నుంచి కన్పించకుండా పోయారు. వెంటనే అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలి





- ఓయూ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాగేశ్వర్

చేర్యాల, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలని ఓయూ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ తెలిపారు. మండలంలోని ముస్త్యాల ఆదర్శ పాఠశాల కళాశాల వద్ద శుక్రవారం పీఎంశ్రీ కార్యక్రమాల్లో భాగంగా 10వ తరగతి ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎలా సిద్ధం కావాలో విద్యార్థులు యొక్క మానసిక స్థితిని ఎలా దృఢపరుచుకోవాలో అనే అంశం పైన ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ సూచనలు చేశారు. విద్యార్థులు పెద్ద లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానికోసం నిరంతరం కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జినుగు బిక్షం, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి

- ఫిబ్రవరి 22 నుండి 28 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం
- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్



హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) : కేంద్ర ప్రభుత్వం 2024, నవంబర్ 24న విడుదల చేసిన జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం (ఎన్పీఎఫ్ఎం) ముసాయిదాను వెనక్కి తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు. ఆర్‌టిసి క్రాస్ రోడ్ లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహ్మారెడ్డి, అరిబండి ప్రసాదరావు, నున్నా నాగేశ్వరరావు, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు నాగార్జున రెడ్డి, జయరాజు,శివ లతో కలిసి ఫిబ్రవరి 22 నుండి 28 వరకు నిర్వహించే ప్రచార క్యాంపెయిన్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ...ఈ ముసాయిదా వల్ల గతంలో రద్దయిన చట్టాలను మార్కెట్ విధానాల రూపంలో రైతులపై రుద్దే అవకాశం ఉంది. ఇది రైతుల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించిన విధానం. దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయి దాను కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం ద్వారా కనీస మద్దతు ధరకు (ఎంఎస్పి) చట్టబద్ధ హామీ ఇవ్వడంలో స్పష్టత లేకపోవడం రైతుల భద్రతకు ప్రధాన అడ్డంకిగా మారింది. ఎంఎస్పి రక్షణ లేకుండా రైతులు మార్కెట్లో ఉన్న అనిశ్చిత పరిస్థితులను అధిగమించడం చాలా కష్టం. ఇది చిన్న రైతులను ఇంకా అస్థిరతలోకి నెట్టివేస్తుందని, ఈ విధానం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను పక్కన పెట్టి, వ్యవసాయ మార్కెటింగ్ను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ఇది రాష్ట్రాల హక్కులను హరించే చర్య. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు వ్యవసాయ ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్లో అధిక ప్రాధాన్యత పొందే అవకాశం ఉంది. కాంట్రాక్ట్ ఫార్మింగ్ను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తోందన్నారు. మార్కెట్ నియంత్రణలను తొలగించడం ద్వారా, పెద్ద సంస్థలు మార్కెట్ ను పూర్తిగా అధీనంలోకి తీసుకోవడమే కాకుండా, రైతులపై ఆర్థిక ఒత్తిడి పెంచే పరిస్థితిని సృష్టిస్తోందని, వ్యాపారులు రైతుల ఉత్పత్తులను తక్కువ ధరకు కొనుగోలు చేయడం, తద్వారా అధిక లాభాలను పొందే అవకాశం ఉందని, చిన్న రైతులు వ్యవసాయం నుంచి వైదొలగాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయి. పంటలకు సరైన ధర పొందడంలో ఇంకా ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మార్కెటింగ్ వ్యవస్థలో కార్పొరేట్ సంస్థల ఆధిపత్యం మరింత పెరగడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతాయని, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న వ్యవసాయ మార్కెట్ వ్యవస్థకి సంబంధించిన అంశాలపైన కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఇలాంటి విధానాలు తీసుకురావటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, దేశ రైతాంగం ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ వ్యవసాయ మార్కెటింగ్ విధానాల ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. దీని స్థానంలో రైతులు, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడే ఒక సమగ్రమైన మార్కెటింగ్ విధానాన్ని రైతు సంఘాలు, నిపుణులు, రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి తీసుకురావాలి. కనీస మద్దతు ధరకు చట్టబద్దతని కల్పించటం, మద్దతు ధర లెక్కింపులో డా. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సు చేసినట్టుగా సి2 పైన 50శాతం కలిపి మద్దతు ధరను ప్రకటించడం, ప్రస్తుతం ఉన్న ఎపిఎంసీలలో ఆధునిక నదుపాయాలు కల్పించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

## మంత్రిగారూ.. మమ్మల్ని ఆదుకోండి!

- 1656 మంది రైతుల పాలిట శాపంగా మారిన ప్రాథమిక సహకార సంఘాలు
- సహకార సిబ్బంది నిర్వాహకం వల్ల14.73 కోట్ల రుణమాఫీ నోచుకోని 1656 మంది రైతులు
- సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్







వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 21 (జనంసాక్షి) : దేవుడు వరం ఇచ్చిన పూజారి కనికరించని చందంగా వనపర్తి జిల్లా పరిధి లోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పరిస్థితి ఉన్నది. రైతుల,అభివృద్ధి ప్రయోజనాలను కాపాడు కునేందుకు ఏర్పాటు చేసుకున్న ఈ సంఘాలు రైతుల పాలిట శాపంగా మారాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తున్న వియయం విదితమే. కానీ ఇక్కడే అసలు కథ మొదలైంది. 2023 డిసెంబర్ 9లోపల రైతులు రుణం తీసుకుంటే 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి ఎన్నికల హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగానే రుణమాఫీ చేస్తున్నారు. డీసీసీబీ ఉమ్మడి జిల్లా పరిధి లో ఉన్న 78 ప్రాథమిక వ్యవసాయ సహకార, పరపతి సంఘాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఉమ్మడి జిల్లా పరిధిలో 1656 మంది రైతులకు 14.73 కోట్ల రుణమాఫీ కాకుండా పోయింది.

2023 డిసెంబర్ 9 లోపల రుణం పొందిన రైతులు,వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అయిన,ఆన్లైన్ లో సిబ్బంది నమోదు చేయక పోవడం తో రుణమాఫీ జరగ లేదు,అందరి లాగే తమకు రుణమాఫీ అమలు అయిందని అనుకున్నారు,కానీ ఈ రైతులకు మాఫీ కాలేదు.రుణమాఫీ అయిందని కొత్త రుణం తీసుకునేందుకు వస్తే అప్పుడు తెలిసింది అసలు కథ మాకు రుణమాఫీ కాలేదని,ఈ విషయం ను సిబ్బంది ని అడుగగా ఇప్పుడు, అవుతుంది అప్పుడు అవుతుంది అని కార్యాలయం చుట్టూ తిపించుకున్నారు.వీరు చేసిన తప్పిదనం వల్లే రుణమాఫీ కాలేదని బోరున విలపిస్తూ మనోవేదనకు గురవుతున్నారు. వీరిని పఠించుకునే నాధుడే కరువయ్యారు.రైతులకు ఒక పక్క రుణమాఫీ కాక కొత్త ఋణం ఇవ్వక తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రుణమాఫీ కోసం 8 నెలలుగా సంఘాల, డీసీసీబీ బ్యాంక్ ల చుట్టూ తిరుగుతున్నరు.రైతులకు సింగిల్ విండో అధ్యక్షులు, కార్యదర్శిలు, తప్పుడు సమాచారం చెపుతూ మొఖం చాటేస్తున్నరు. ఈ రైతులు చేసిన పాపం ఏమిటి? వీరికి ఓట్లు వేసి ఎన్నుకున్నాదుకా? ఇంత జరుగుతున్న ప్రభుత్వ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.వీరికి న్యాయం చేసేది ఎవరు..? ఇలాంటి నాయకులు,సిబ్బంది ఉంటే రైతులు రాజు ఐదెప్పుడు...ఇది ఇలా ఉంటే అప్పులు తీసుకున్న రైతుల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారు.తీసుకున్న రుణం బ్యాంక్ లో ఒకటి ఉంటే. వీరి సంఘాల్లో ఇంకొకటి గా ఉంటున్నాయి. వీరు మెంటేన్ చేసే లెడ్జర్ బుక్ సరి చేసుకునే విధంగా పెన్సిల్ తో నమోదు చేసుకుని వీరికి అనుకూలంగా మార్చు కోవడం వీరికి వెన్నతో పెట్టిన విద్య...ఈ తతంగం మొత్తం అధ్యక్షుల కనుసన్నల్లో నడుస్తోంది... అక్షరాలు రాని రైతులను అడగండి అప్పుడు తెలుస్తోంది వీరి నిర్వహుకం మని ప్రజలు ఆరోపిస్తున్నారు.తక్షణమే,మంత్రి, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఈ సంఘాల నిర్వహుకం పై సమగ్ర విచారణ కు సంబంధిత శాఖ కు ఆదేశాలు జారీ చేయాలని,రైతులకు రుణమాఫీ అందేవిధంగా చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

### డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి

రుణమాఫీకి ప్రభుత్వం విధించిన గడువు తేదీ తర్వాత ఆన్లైన్ చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర య్యాయి. ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించింది. ఆ రైతుల వివరాలను పంపి రుణమాఫీ చేయాలని కోరాం. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. ఈ విషయం పై ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షులను,కార్యదర్శిలను వివరణ కోరగా మా పరిధి లో లేదని,ప్రభుత్వం మంత్రి ,నిర్ణయం తీసుకోవాలని, నిర్లక్ష్యంగా పొంతన లేని సమాదానం ఇచ్చారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి

- పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- తాజా మాజీ మున్సిపల్ పాలకవర్గాలకు ఘన సన్మానం



పటాన్‌చెరు, ఫిబ్రవరి21 (జనంసాక్షి) : ప్రజాస్వామ్యంలో పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండాలని.. సమయం వచ్చినప్పుడు ప్రజలే తిరిగి అవకాశం ఇస్తారని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ ఫంక్షన్ హాలులో.. ఎమ్మెల్యే జిఎంఆర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని తెల్లాపూర్, అమీన్పూర్, బొల్లారం మున్సిపాలిటీల తాజా మాజీ పాలకవర్గాలను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఐదు సంవత్సరాల కాలంలో నూతనంగా ఏర్పడిన అమీన్పూర్, తెల్లాపూర్, బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డుని అభివృద్ధికి ప్రత్యేకగా తీర్చిదిద్దామని తెలిపారు. ప్రతి పాలకవర్గ సభ్యుడు ప్రజల సమస్యల పరిష్కారంలో ముందున్నారని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే పంథాలో కొనసాగాలని కోరారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. అమీన్పూర్, బొల్లారం మున్సిపాలిటీల పరిధిలో దశాబ్ద కాలంగా పెండింగ్ లో ఉన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం అందించడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్,మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, తొంట అంజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్లు లలిత సోమిరెడ్డి, తుమ్మల పాండురంగారెడ్డి, రోజా బాల్ రెడ్డి, మాజీ జెడ్పిటిసిలు సుధాకర్ రెడ్డి, బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీలు దేవానందం, రవీందర్ రెడ్డి, యాదగిరి యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సోమిరెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, అఫ్జల్,.పాండు, మాజీ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్ నందు ఇంటర్ విద్య,పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్,పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 14 పరీక్షా కేంద్రాల్లో 8,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. వీరిలో ఫస్ట్ ఇయర్ స్టూడెంట్లు 4,057, సెకండ్ ఇయర్ 4,284 మంది ఉన్నారన్నారు. పరీక్షలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు చీఫ్ సూపరిడెంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేసి కఠినమైన నిఘా పెట్టాలని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసి, ఇందుకోసం కస్టోడియన్, డిపార్ట్మెంటల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో ముందుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ, పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ ఉన్నందున జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎవరు సెల్‌ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్సు సర్వీసులు నడిపేలా ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తగిన మందులతో మెడికల్ ఆఫీసర్, ఆశాలను అందుబాటులో ఉంచాలని వైద్య శాఖ అధికారులను సూచించారు. పరీక్షా సమయంలో ఎటువంటి విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్డీఓ శ్రీనివాస రావు, డిఎస్పీ మొగలయ్య, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి హృదయ రాజు,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిద్దప్ప,విద్యుత్ శాఖ అధికారి రమేష్ బాబు, ఆర్టీసీ అధికారి శ్రీనివాస రెడ్డి,విద్యా శాఖ శ్రీనివాస, పోస్టల్ అధికారి అయూబ్ ఖతీబ్ తదితరులు పాల్గొన్నారు.

## పీయంశ్రీ నిధులను వంద శాతం ఖర్చు చేసి నివేదికలు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు మంజూరు అయిన పి.యం శ్రీ , సర్వ శిక్ష అభియాన్ కింద మంజూరు అయిన నిధులను వంద శాతం ఖర్చు చేసి నివేదికలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం విద్యా శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కేంద్ర ప్రభుత్వ నిధుల వినియోగం పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పిఎంశ్రీ, సర్వ శిక్ష అభియాన్ కింద ప్రతి సంవత్సరం పాఠశాలల్లో మౌలిక వసతులు, క్షేత్రస్థాయి పరిశీలనల కొరకు విడుదలైన నిధులు ఖర్చు చేసి యూటిలైజేశన్ సర్టిఫికెట్ పంపాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తూ గ్రీన్ స్కూల్, ఆత్మ రక్షణ, క్షేత్ర స్థాయి పరిశీలన, మౌలిక సదుపాయాలు, స్పోర్ట్స్, సైన్స్ బడ్జెట్ వినియోగంపై సమీక్షించడం జరిగింది. నిధులు ఖర్చు చేసి నివేదిక ఇవ్వాలని, ఆపార్ నమోదు సైతం త్వరగా పూర్తి చేయాలని యం. ఈ. ఒ లను ఆదేశించారు. జిల్లా విద్యా శాఖ అధికారి అబ్దుల్ ఘనీ, మండల విద్యా అధికారులు, పి.యం శ్రీ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి తుమ్మల వనపర్తికి రాక..

- జిల్లా పర్యటన విజయవంతం చేసేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** ఫిబ్రవరి 22న రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వనపర్తి జిల్లా పర్యటన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కొత్తకోట మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లి గ్రామ శివారులో నూతనంగా నిర్మించనున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి భూమిపూజ చేయనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అక్కడ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. కార్యక్రమానికి వచ్చే ఏ ఒక్కరికి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమ స్థలంలో జిల్లా ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఆయిల్‌ఫామ్ సాగుచేస్తున్న ముగ్గురు మోడల్ రైతులను కూడా కార్యక్రమానికి ఆహ్వానించాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే వారికి ఆహారాన్ని అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. వ్యవసాయ మంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖ అధికారులకు ఆదేశించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి అక్బర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇటుకల తయారు శిక్షణ

- శిక్షణకు జిల్లాలో 118 మంది మహిళల ఎంపిక
- ఒక్కో విడుత లో 35 మంది మహిళలకు ఆరు రోజుల శిక్షణ
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 21(జనం సాక్షి) :** స్వయం సహాయక సంఘాల మహిళలు ఇటుకల తయారీ, ఇండ్ల నిర్మాణం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం కోసం స్వయం సహాయక సంఘాల మహిళలకు న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్) ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. సంగారెడ్డి ప్రభుత్వ ఐటిఐ లోని న్యాక్ శిక్షణ కేంద్రం లో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇండ్ల నిర్మాణం, సిమెంట్ ఇటుకల తయారీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి మండలానికి ఐదు మంది చొప్పున ఆసక్తి అనుభవం ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇటుకల తయారీ , ఇండ్ల నిర్మాణం పై శిక్షణ కార్యక్రమాన్ని న్యాఖా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఒక్కో విడతలో 35 మందికి ఆరు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణ వల్ల గ్రామాలలో ఎక్కడికక్కడ ఇటుకలు తయారు చేసే యూనిట్లు నెలకొల్పడంతో పాటు మేస్త్రీలు అందుబాటులో ఉంటారన్నారు. దీంతో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థికంగా ప్రయోజనం కలగడంతో పాటు ఇందిరమ్మ ఇల్లా నిర్మాణం పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందన్నారు. గ్రామాలలో తక్కువ ధరకు నాణ్యమైన సిమెంట్ ఇటుకలు అందుబాటులో ఉంటాయన్నారు. మహిళలు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కలెక్టర్ మహిళలకు సూచించారు ఈ కార్యక్రమంలో న్యాక్ ఏపీడి రామ్, డిఆర్డిఒపిడి జ్యోతి, అదనపు డిఆర్డిఒ జంగారెడ్డి, డిపిఎం లు మహిళ స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# గణితంపై కలెక్టర్ ప్రశ్నలు



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** విద్యార్థులు చక్కగా చదివి, అత్యుత్తమ ఫలితాలు సాధించి తాము చదివిన పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గురువారం నిర్వహించిన వార్షికోత్సవానికి సంబంధించిన వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ విద్యార్థులకు స్వయంగా గణితంపై కొన్ని ప్రశ్నలు సంధించి, సమాధానాలు రాబట్టారు. సరైన విధంగా గణిత సమస్యలను పరిష్కరించిన విద్యార్థులకు చాక్లెట్లు అందజేశారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంటగది నిర్మాణానికి సంబంధించి ఈ డబ్ల్యూ ఐ డి సి ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న పెండింగ్ పనుల పూర్తి చేయడానికి అంచనాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు. భవిత కేంద్రంలోని బాలబాలికలకు ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటివి వాటిలో చక్కగా శిక్షణ అందించాలని జిల్లా కలెక్టర్ సిబ్బందికి సూచించారు. భవిత సెంటర్లో ఉన్న చిన్నారులతో కలెక్టర్ ఆప్యాయంగా మాట్లాడారు. విద్యాశాఖ అధికారులు యుగంధర్, శేఖర్, బాలికల పాఠశాల ప్రిన్సిపల్ ఉమాదేవి, భవిత కేంద్రం సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## ఉత్కంఠభరితంగా 'బాహ సే ఇండియా' 2025



**నర్సాపూర్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** అత్యంత ప్రతిష్టాత్మక అంతర్ కళాశాలల ఈవెంట్ సొసైటీ ఆఫ్ ఆటోమోటివ్ ఇంజినీర్స్ (ఎస్ఏఈ), శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సహకారంతో ఎస్ఏఈ బాహ సే ఇండియాతో కలిసి నిర్వహిస్తున్న 'బాహ సే ఇండియా 2025' మెదక్ జిల్లా నర్సాపూర్‌లో గల బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో రెండో రోజు కొనసాగింది. బాహ సే ఇండియా నవ ఉద్యమంలో పదేళ్లు పూర్తి చేసుకుంది. ఇప్పుడు 11వ ఎడిషన్ మైలురాయిని సాధించింది. ఈసారి పోటీలో 85కు పైగా టీమ్స్ పాల్గొనడం ద్వారా ఇది ఇప్పటివరకు జరిగిన అన్ని ఎడిషన్లలో అత్యధికంగా నిలిచింది. ఇందులో 77 టీమ్స్ బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ), నర్సాపూర్ సమీపంలో ఉత్కంఠభరితమైన పోటీలకు శ్రీకారం చుట్టాయి. ఈ సందర్భంగా రెనాల్ట్ నిస్సాన్ టెక్నాలజీ, బిజినెస్ సెంటర్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ (హ్యూమన్ రిసోర్సెస్) సిమోనా అడెలినా పోపోవిసీ మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఇన్నోవేషన్ వైపు మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల టెక్నాలజీ భవిష్యత్తు మార్గాన్ని నిర్దేశిస్తుందని చెప్పారు. బాహ సే ఇండియా, ఆర్ఎన్టీబీసీఐ లక్ష్యాలు సమానంగా ఉన్నాయన్నారు. ప్రత్యేకంగా డైవర్సిటీ, ఇన్‌క్లూజివ్ అంశాలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

## చారకొండ లో 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



**చారకొండ, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** వేరువేరుగా 35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడిన సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో శుక్రవారం చోటుచేసుకొంది. డీటీ రాఘవేందర్ రెడ్డి కథనం ప్రకారం పక్కా సమాచారం మేరకు హైదరాబాద్ ఇన్ ఫోర్స్ మెంట్, టాస్క్ ఫోర్స్ అధికారుల ఆధ్వర్యంలో మండలంలోని సారంబండతండాకు చెందిన నవీన్ తన బొలెరో వాహనంలో గోకారం, సారంబండతండా గుట్టల మధ్య 15 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నింపుతుండగా పట్టుకొన్నట్లు తెలిపారు. అదేవిధంగా మండల కేంద్రంలో శారదమ్మ తన ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకొన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని మండల కేంద్రంలోని రేషన్ షాపు-1 లో భద్రపరిచినట్లు ఇన్ ఫోర్స్ మెంట్ డిటి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. ఇన్ ఫోర్స్ మెంట్ డీటీ ఫిర్యాదు మేరకు బోలెరో వాహనంతో నవీన్, శారదమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీశైలం గౌడ్ తెలిపారు. వారివెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## బీజేపీ, బీఆర్ఎస్ దొందు దొందే..

- ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**నారాయణఖేడ్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** బిజెపి బీఆర్ఎస్ దొందు దొందే అని జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి 2014లో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తా మని చెప్పి ఇవ్వలేదని ఇప్పటికి 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. గతంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి నారాయణఖేడ్ నుంచి 90 శాతం ఓట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ఉపాధ్యాయులు పట్టభద్రుల ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇవ్వాలన్నారు. గతంలో ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంకు సహకరించరో అదేవిధంగా ఈసారి కూడా అందరూ సహకరించాలని కోరారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో 3500 పైచిలుకు ఓట్లు ఉన్నాయని, ప్రతి ఒక్కరు సహకరించాలని డాక్టర్ వూట్టూరి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. గత పార్లమెంటు ఎన్నికల్లో డమ్మీ అభ్యర్థులను నిలబెట్టి బిజెపి ఎంపీలను గెలిపించారన్నారు. ఇప్పుడు కూడా అదే తర హాలో బిఆర్ఎస్ బిజెపికి పూర్తిగా మద్దతిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో మార్పు వచ్చిందన్నారు. గతంలో ఉద్యోగస్తులకు నెల దాటిన 20 రోజులకు జీతాలు వచ్చేవని, ఇప్పుడు మా ముఖ్యమంత్రి ప్రతి నెల 1వ తేదిన జీతాలు ఇస్తున్నారన్నారు. అప్పుడు అధికారంలో ఉన్న, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న అన్ని అబద్ధాలే చెప్పుతున్నారన్నారని వారు అన్నారు.

## అక్రమంగా నడుస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- యువజన, విద్యార్థి సంఘాల డిమాండ్



**మల్కాజిగిరి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** విద్యాశాఖ గుర్తింపు, అనుమతులు లేకుండా అక్రమంగా నడుస్తూ,2025 విద్య సంవత్సరానికి ముందుగానే అడ్మిషన్లు చేపడుతున్న మల్కాజిగిరి మండలం సాయినాథ్ పురంలో గల శ్రీ చైతన్య పాఠశాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఫిర్యాదు మేరకు శ్రీ చైతన్య పాఠశాల వద్ద ధర్నా నిర్వహించగా, మల్కాజిగిరి మండల విద్యాశాఖాధికారి సురేష్ అడ్మిషన్లు మరియు కార్యకలాపాలు చేపడుతున్న గదిని సీజ్ చేశారు. కె. ధర్మేంద్ర, టి. సత్య ప్రసాద్ సంయుక్తంగా మాట్లాడుతూ ఒకవైపు ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తున్నామని చెబుతూ, కార్పొరేట్ పాఠశాలల ఆగడాలను అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలం చెందారని వారు ఆరోపించారు. ఈ శ్రీచైతన్య పాఠశాల 2025 విద్యాసంవత్సరంకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేపట్టి విద్యార్థుల ను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గుర్తింపు లేని పాఠశాలల జాబితాను విడుదల చేసి, తల్లిదండ్రులలో చైతన్యం తేవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్ , టీఎస్ఎస్ఎఫ్ మల్కాజిగిరి నేత హరి, ఏ ఐ వై ఎఫ్ సంజయ్, భరత్,శ్రీను పాల్గొన్నారు.

**అనుమతులు లేవు : సురేష్, మల్కాజిగిరి మండల విద్యాశాకాధికారి**

ఈ శ్రీచైతన్య పాఠశాలకు ఎటువంటి అనుమతులు లేవని, యాజమాన్యం యథేచ్ఛగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ పాఠశాలలో 2025 విద్య సంవత్సరానికి విద్యార్థులను తల్లిదండ్రులు చేర్చవద్దని మల్కాజిగిరి మండల విద్యాశాకాధికారి సురేష్ సూచించారు. ఈ పాఠశాలపై పైస్థాయి అధికారులకు నివేదికను ఇస్తామని వారు తెలిపారు.

## మాతృభాషకు అధిక ప్రాధాన్యతనివ్వాలి

- మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్



**పాపన్నపేట, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** ఎన్ని భాషలు నేర్చిన మాతృభాషకు అధిక ప్రాధాన్యతనివ్వాలని మెదక్ జిల్లా విద్యాశాఖధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం పురస్కరించుకొని పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పద్య పఠనం పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాతృభాష తల్లి ద్వారా వస్తుందని,గురువు ద్వారా చదవడం,రాయడం నేర్చుకుంటారన్నారు. పద్య పఠనం, ధారాళంగా చదవడం పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మోక్షిత, పావని, భావన, రాకేష్‌లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ సుదర్శన మూర్తి, మండల విద్యాధికారి ప్రతాపరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్, మంగ నర్సింలు, భట్టు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పండుమిరపకు గిట్టుబాటు ధరను కల్పించాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులపై అలసత్వం వదలాలి**



**మానవపాడు, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లాలో పండించిన పండు మిరపకు ప్రభుత్వం గిట్టుబాటు ధరను కల్పించి కొనుగోలు చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా రైతు సంఘం నాయకులు జీకే ఈదన్న, స్థానిక ఉండవెల్లి మండల రైతు సంఘం నాయకులు సింగరాజు మద్దిలేటి, మాజి సర్పంచు కంచుపాడు శేషన్ గౌడ్ శుక్రవారం అన్నారు.రైతు కల్లంలో పండించిన మిరప ఆరబోసిన రైతుల తొ కలిసి మాట్లాడతూ.. రైతు సంఘం నాయకులు జికె ఈదన్న మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా చట్టం చేసి పండుమిర్చి రైతులకు క్వింటాల్కు రూ 25 వేల రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు శేషన్ గౌడ్ మాజి సర్పంచు మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలు గా రైతులు మిరప కు పెట్టు బడి పెట్టి నష్ట పోయి అప్పుల పాలవుతున్నారని వాపోతున్నారు.కౌలు మొదలు కొని విత్తనం పెస్టిసైడు, పర్టిలైజరు, గడాలు వంటి వాటికి ముందే రేటు నిర్ణయించడం జరిగింది అన్నారు. పండిన పంట కోద్ధామనుకుంటే కూలీలు కాస్టు అమాంతము పెరగడతో కలిపుకుని ఎకరాకు రూ.150000 కర్చు అవుతుం దని బువ్వ పండించే రైతుకు చివరికి బురెదె మిగులుతుందని రైతులను రాజులను చేయాలనే ప్రభుత్వాలు తుంగలో తొక్కి ఆత్మ హత్యలకు కారణమవుతునారు.తక్షణమే పండిన పంటలకు గిట్టు బాటు దర కల్పించడ మే కాక ప్రభుత్వ గిడ్డంగులు ఏర్పాటు చేయాలని మరియు సరైన దరను కల్పంచే మార్కెట్ బోర్డు ను ఎర్పాటు చేసి దాని ద్వారా రైతులతో నేరుగా కొనుగోలు చేయాలని, తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పంట కొనుగోలు అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండు చేస్తూ లేదంటే రైతులు రొడ్డెక్కి దర్న చేయడం జరుగుతుందని హెచ్చరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రైతులు శాలన్న గౌడ్, శాంతమ్మ, శ్రీనివాసులు, మహేశ్వరమ్మ, పురుషోత్తం రావు,గొల్ల మధు, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొని వారి ఆవేదన వ్యక్తం చేయడం జరిగింది.

# థర్డ్‌క్లాస్ మాటలు మాట్లాడితే గొప్పోళ్ళు కారు

- కేసీఆర్ కంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపండి
- నదీ జలాలు వాడుకోవడంలో విఫలమైన ప్రభుత్వం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. శుక్రవారం వనపర్తి సమీపంలోని నాగవరం దగ్గర గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు .ప్రతిపక్ష నాయకుల మీద థర్డ్ క్లాస్ మాటలు మాట్లాడినంత మాత్రాన గొప్పోళ్ళు కారని హితవు పలికారు. గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో ఆకలి కేంద్రాలు, గంజి కేంద్రాలు, వలసలు, బలవన్మరణాలు ఉండేవని, కేసీఆర్ హయాంలో వాటన్నింటిని రూపుమాపి తెలంగాణ రాష్ట్రం మొత్తాన్ని పచ్చబడేలా చేశారని అన్నారు. కేసీఆర్ కూడబెట్టిన నిధులతో ఒక సారి మాత్రమే రైతుబంధు సహాయం అందించారని దెప్పిపొడిచారు. వానాకాలం రైతుభరోసాను పూర్తిగా ఎగ్గొట్టి, యాసంగివి కూడా కోత పెట్టి రైతుల నోర్లు కొడుతున్నారని ధ్వజమెత్తారు. మూడెకరాల లోపు రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి వేశామంటున్న సర్కార్, అందులో కూడా సుమారు 10 లక్షల ఎకరాలకు కోతపెట్టి రైతాంగాన్ని మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. మూడెకరాలను కూడా మూడు వాయిదాలు చేయడం దుర్మార్గమని అన్నారు. నదీ జలాలను ఆంధ్రా ప్రాంతానికి తీసుకుపోతుంటే ముఖ్యమంత్రితో సహా మంత్రులు చూస్తూ ఊరకున్నారని ఎద్దేవా చేశారు. పాలమూరు -రంగారెడ్డి ప్రాజెక్టు పనులు జరుగకుండా కోర్టుల్లో కేసులు వేసింది కాంగ్రెస్ నాయకులే కదా అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థులు, రైతులు, ఆటోకార్మికులు చనిపోతు న్నారని, రైతుల ఆత్మహత్యలు 430కి పెరిగాయని అన్నారు .ఏ ఒక్క సామాజిక వర్గం కూడా ప్రభుత్వంపై సంతృప్తిగా లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టుయాదవ్, బి. లక్ష్మయ్య, పలుస రమేశ్ గౌడ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, నాగన్న యాదవ్, కంచ రవి, ఆరిఫ్, ఇమ్రాన్, తిరుమల్, బండారు కృష్ణ, స్టార్ రహీమ్ పాల్గొన్నారు.


# రుణం తీర్చుకోలేనిది

## ఎల్ఆర్ఎస్‌పై హర్షం

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి పొంగులేటి
- సహకరించిన డిప్యూటీ సీఎం భట్టి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలకు ధన్యవాదాలు
- సబ్సిడీ గడువు ఆరు నెలలు పొడిగించాలి : వత్సవాయి రవి
- శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో సి. యం, రెవిన్యూ మంత్రిల చిత్ర పటాలకు పాలాభిషేకం



**ఖమ్మం ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** ఎల్ఆర్ఎస్‌ను (ల్యాండ్ రెగ్యులేషన్ పథకం) ప్రకటించటం హర్షనీయం అని, ప్రభుత్వం ఋణం ఎలా తీర్చుకోవాలలో తెలియటం లేదని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి కొనియాడారు. గురువారం నగరంలోని శ్రీ బాలాజీ ఎస్టేట్ ఆధ్వర్యంలో ఎల్ ఆర్ ఎస్ ప్రకటించడంపై ధన్యవాదాలు తెలుపుతూ సభ నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అకుంఠిత దీక్షతో ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకుందన్నారు. అంతేకాకుండా 25% సబ్సిడీని ప్రకటించటం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం అని కొనియాడారు. ఎల్ఆర్ఎస్ వల్ల ప్రజలకు,రియల్ ఎస్టేట్ వ్యాపారులకు,ఏజెంట్ మిత్రులకు వరంగా మారిందన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం కోసం గత నాలుగున్నర సంవత్సరాల నుంచి ప్రజలు రియల్, ఎస్టేట్ వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం విధానం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారులు అనేక రకాల ఇబ్బందులకు గురి అయ్యారని తన ఆవేదన వ్యక్తం చేశారు. దాని ఫలితంగా దాదాపు నాలుగున్నర సంవత్సరాల వ్యాపార కాలం వృధా ప్రయాసగా మారిందని వాపొయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే ఎల్ఆర్ఎస్ సమస్యను పరిష్కరించిందని తెలియజేశారు. 25 శాతం సబ్సిడీ ప్రభుత్వం ప్రకటించటం హర్షించదగ్గ అంశమని కానీ ఇలా సబ్సిడీ ప్రకటిస్తారని మీము ఊహించలేదని ఆయన తెలియజేశారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని పేర్కొన్నారు. సబ్సిడీ గడువు కాలం మార్చి 31 వరకు ఇవ్వటం తమకే కలిసొచ్చే అంశం అయినప్పటికీ ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న ప్లాట్ల క్రయవిక్రయాలు ఇక ప్రారంభించాల్సి ఉంటుంది. ప్లాట్లు కొన్నవారికి రిజిస్ట్రేషన్ కు గడువు కాలం పడుతుంది కాబట్టి సబ్సిడీ సమయాన్ని మరో ఆరు నెలలు పొడిగించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తద్వారా పెండింగ్లో ఉన్న ప్లాట్ల క్రయ విక్రయాలు ఊపొందుకొని ప్రభుత్వానికి రెవెన్యూ పెరిగిద్దని ఆశించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమానికి సహకరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు,మంత్రివర్గ ఉప సంఘానికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కొనిజర్ల మాజీ ఎంపీపీ గోసు మధు ఆఫీస్ ఇంచార్జ్ పోగుల రవికుమార్ సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్లు షేక్ తాజుద్దీన్,కాసాని శ్రీశైలం, గాలి నారాయణ,తోట వెంకటేశ్వర్లు, బాబురావు, జానీ భాష,వసీం, కళ్యాణ్ చౌదరి, సాయి కిరణ్, శ్రీకృష్ణ, ప్రశాంత్, శ్రీనివాసరావు, మల్లికార్జున్, పిఎన్ఆర్ ఏఎన్ఆర్,రవి కుమార్,కృష్ణ చౌదరి, రజినీకాంత్ చంద్రన్న గౌడ్ ఉపేందర్, సుమన్, అలవాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మహేష్ అసురుడా.. పోలీసా... అనేంతలా కొందరి వింత ప్రవర్తన జనాల్ని బెంబేలెత్తిస్తుంది. దురుసుతనం, దౌర్జన్యం, బహిరంగ దూషణలతో మహిళకు కనీస గౌరవం దక్కకుంటే ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో అడుగు పెట్టాలంటే జంకుతారు. ఇలాంటి పోలీసుతో పోలీస్ వ్యవస్థకే చెడ్డ పేరు తెస్తుందనేది వాస్తవం. తనకు జరిగిన అవమానం ఇతర మహిళ పట్ల జరగకూడదని తన ఆత్మ అభిమానాన్ని, బూతులు తిడుతూ బెదిరించిన తీరును బయటపెట్టింది.

# విచారణ పేరుతో.. ఖాకీ బూతు పురాణం

## మహిళను అసభ్య రీతిలో తీవ్రంగా బెదిరించిన పోలీసు

**ఎస్సైపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి**

**ఆర్మూర్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** సారంగి స్వప్న అనే మహిళను తన తల్లి బావాయికి సంబంధించిన ఇంటి విషయంలో బయటకు గెంటేసి కబ్జా చేస్తున్న వ్యక్తికి వత్తాసు పలుకుతూ,విచారణ పేరుతో ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పిలిపించుకుని ఎస్సై మహేష్ తిడుతూ బెదిరిస్తున్నాడని తెలిపింది. వివరాలలోకి వెళ్తే.. ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో సారంగి బావాయికి 1-65, 1-65/2, 1-65/3 ఇంటి నెంబర్లు గల ఇండ్లు ఉన్నాయి.తల్లి బావాయితో అదే ఇంట్లో నివాసం ఉండేవారిమని ఆమె తెలిపింది. మూడు ఇండ్లను సారంగి నడిపి సందన్న ఆక్రమించుకొని మాపై దౌర్జన్యం చేస్తున్నాడని చెప్పింది. ఈనెల తన తల్లి చేపూర్ లోని ఇంటికి వెళ్తే సతీష్ అనే యువకుడు ఇంట్లోకి రానివ్వకుండా బయటకు గెంటివేసి,అతనే పోలీస్ స్టేషన్ లో తన తల్లి బావాయిపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ విషయమై ఆర్మూర్ పోలీస్ స్టేషన్ కు వెళితే ఎస్సై మహేష్ విచారణ పేరుతో దురుసుగా ప్రవర్తిస్తూ, మహిళ పట్ల గౌరవం లేకుండా మాట్లాడాడని వాపోయింది.చిల్లర లం...లు,ఆవారా మహిళలే స్టేషన్ కు వస్తారని బూతు మాటలతో తిట్టాడని కన్నీరు కార్చింది.సొంత ఇంట్లో తన తల్లిని రానివ్వకుండా బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి తనను ఇష్టం వచ్చినట్లు బూతు మాటలతో దూషించిన ఎస్సై పై చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.

ఎస్సై మహేష్ తనను దూషించి దురుసుగా ప్రవర్తించిన విషయాన్ని సీఐ సత్యనారాయణ గౌడ్ కు కలిసి చెప్పగా సమస్యను పరిష్కరిస్తానని చెప్పినట్లు ఆమె తెలిపారు.సీఐ తమ సమస్యను విని పరిష్కరిస్తానన్న,ఎస్ఐ మాత్రం మహిళ అని చూడకుండా దురుసుగా ప్రవర్తించాడన్నారు. ఎస్సై బూతు మాటలతో పోలీస్ స్టేషన్లో అడుగు పెట్టాలంటే భయంగా ఉందని తన ఆవేదనను చెప్పుకుంది. ఇలాంటి పోలీస్ తీరుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పింది.

# శ్రీ చైతన్య టెక్నో స్కూల్ సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు
- గుర్తింపు లేని పాఠశాలను రద్దు చేయాలి
- యువజన,విద్యార్థి సంఘాల డిమాండ్



**మల్కాజిగిరి,ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** విద్యాశాఖ గుర్తింపు, అనుమతులు లేకుండా అక్రమంగా నడుస్తూ,2025 విద్య సంవత్సరానికి ముందుగానే అడ్మిషన్లు చేపడుతున్న మల్కాజిగిరి మండలం సాయినాథ్ పురం లో గల శ్రీ చైతన్య టెక్నో పాఠశాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్ లు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఫిర్యాదు మేరకు శ్రీ చైతన్య పాఠశాల వద్ద ధర్నా నిర్వహించగా, మల్కాజిగిరి మండల విద్యాశాకాధికారి సురేష్ అడ్మిషన్లు మరియు కార్యకలాపాలు చేపడుతున్న గదిని సీజ్ చేశారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర,మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్ సంయుక్తంగా మాట్లాడుతూ, ధనార్జనే ధ్యేయంగా కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి, నిబంధనలను భేకాతరు చేస్తూ అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు.ఒకవైపు ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తున్నామని చెబుతూ, కార్పొరేట్ పాఠశాలల ఆగడాలను అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు విఫలం చెందారని వారు ఆరోపించారు. 2025 విద్యాసంవత్సరంకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కాకముందే శ్రీ చైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యం ముందస్తు అడ్మిషన్లు చేపట్టి విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అకర్షణీయమైన పేర్లతో విద్యాశాఖ గుర్తింపు లేని సీవో, కో స్పార్క్, టెక్నో వంటి కోర్సుల ను ప్రవేశాెట్టి లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు.తక్షణమే విద్యాశాఖ అధికారులు మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న గుర్తింపు లేని పాఠశాలల జాబితాను విడుదల చేసి, తల్లిదండ్రులలో చైతన్యం తేవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్, టీఎన్ఎస్ఎఫ్ మల్కాజిగిరి నేత హరి, ఏఐవైఎఫ్ సంజయ్, భరత్,శ్రీను పాల్గొన్నారు.

**మల్కాజిగిరి మండల విద్యాశాకాధికారి సురేష్ వివరణ**

ఈ శ్రీచైతన్య టెక్నో పాఠశాలకు ఎటువంటి అనుమతులు లేవని, యాజమాన్యం యథేచ్ఛగా అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని,ఈ పాఠశాలలో 2025 విద్య సంవత్సరానికి విద్యార్థులను తల్లిదండ్రులు చేర్చవద్దని వారు సూచించారు.అక్రమంగా 12 అడ్మిషన్లు తీసుకున్నట్లు తమ దృష్టికి వచ్చింది.ఈ పాఠశాలపై ఉన్నత స్థాయి అధికారులకు నివేదికను ఇస్తామని వారు తెలిపారు.



# నీటి సమస్య పరిష్కరించాలి

- పాడైపోయిన బోర్లను మరమ్మత్తు చేయాలి
- జలమండలి అధికారులతో ఎమ్మెల్యే సమావేశం

**మల్కాజిగిరి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీలలో వేసవికాలంలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి మరియు గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ జలమండలి అధికారులకు వినతి పత్రాన్ని అందజేసి స్థానికంగా నెలకొన్న సమస్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో నీటి సరఫరా మరియు పాడైపోయిన బోర్ల మరమ్మత్తుల సమస్యలపై మాట్లాడడం జరిగింది. రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గౌతమ్ నగర్ డివిజన్ తోపాటు అన్ని కాలనీలు మరియు స్లామ్స్ లలో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు మరియు పాడైపోయిన బోర్ లను మరమ్మతులను రిపేరు చేసి నీట్ తీయదడి లేకుండా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అంద జేయాలని అధికారులను అడగడం జరిగింది. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ సునీల్ ,డిజిఎం ఆశ్రిత,మేనేజర్ నవీన్,కార్పొరేటర్ సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, ఆకుల నర్సింగ్ రావు, నాయకులు మధుసూదన్ రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో వికలాంగులకు నిధులు పెంచాలి



- ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం ఉద్యమించాలి
- ఎన్పీఆర్డీ 15వ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణలో వక్తలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు ఇచ్చిన హామీల అమలు కోసం,స్థానిక సంస్థల్లో, నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్స్ సాధన కోసం పోరాటలు ఉదృతం చేస్తామని,ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసంఉద్యమించాలని వక్తలు పిలుపునిచ్చారు. చిక్కడపల్లి రాష్ట్ర కార్యాలయం వద్ద ఎన్పీఆర్డీ 15వ ఆవిర్భావ దినోత్సవంసందర్భంగా జెండా ఆవిష్కరణ రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ చేశారు. ఎన్పీఆర్డీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, యం అడివయ్య మాట్లాడుతూ.. జాలి, దయ, కరుణ మాకొద్దు, మా హక్కులు మాకు కావాలి అంటూ దేశ వ్యాప్తంగా వికలాంగులను ఐక్యం చేయడానికి 2010ఫిబ్రవరి 21-22 తేదీల్లో ఎన్పీఆర్డీ కలకత్తా పట్టణంలో ఏర్పడిందని, ఆత్మగౌరవం, హక్కుల సాధన కోసం వికలాంగులను సమీకరించి పోరాటాలు చేస్తుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వలు వికలాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందుతున్నాయని అన్నారు. ప్రయివేట్ పరిశ్రమలలో వికలాంగులకు 5శాతం ఉద్యోగాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఫిబ్రవరి 21నుండి 27వరకు రాష్ట్ర వ్యాప్తంగా సంఘం ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఏ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. వికలాంగుల పట్ల కొనసాగుతున్న వివక్షత, అసమానతలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎన్పీఆర్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె దశరథ్,రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకి ఆరోగ్య జీవిత బీమా





- బడ్జెట్‌లో తగిన నిధుల కేటాయింపు
- జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యపై ఆలోచిస్తున్నాం
- హెచ్ యూజే -2025 డైరీ ఆవిష్కరణలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** జర్నలిస్టులకి హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించడంతో పాటు జీవిత బీమా కల్పించేదానిపై ప్రభుత్వంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం బడ్జెట్ లో తగిన నిధులు కేటాయిస్తామన్నారు. ఇండ్ల స్థలాల సమస్యను ఏం చేయాలనే దానిపై ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సెక్రెటేరియేట్ లో హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్ యూజే-టీడబ్ల్యూజేఎఫ్ ) 2025 డైరీని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ యూజే అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, జగదీష్ జర్నలిస్టుల సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా, జర్నలిస్టుల హెల్త్ కార్డులు పనిచేయడం లేదని చెప్పారు. జర్నలిస్టుల కుటుంబాలకి ప్రతి ఏడాది రూ.10 లక్షల వరకు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ స్కీంలో జర్నలిస్టుల హెల్త్ స్కీం కలిపి అన్ని ప్రయివేట్, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో జర్నలిస్టులకు ఉచిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కోసం రైతు బీమా అమలు చేస్తున్నట్లు.. అక్రిడేటెడ్ జర్నలిస్టులందరికీ జర్నలిస్టు బీమా కింద జీవిత బీమా అమలు చేయాలని కోరారు. ఏదేని కారణంతో జర్నలిస్టు చనిపోతే.. వారి కుటుంబాలకు పరిహారం కింద రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలు అందేలా ప్రభుత్వం జర్నలిస్టు బీమా పథకం తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పదించిన డిప్యూటీ సీఎం.. జర్నలిస్టుల ఆరోగ్య బీమా, జీవిత బీమా, హెల్త్ కార్డులపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ట్రీట్మెంట్ తీసుకుని ఇంటి దగ్గర రెండు మూడు నెలలు రెస్ట్ లో ఉండే జర్నలిస్టులకూ కుటుంబ పోషణ కోసం ఆర్థిక సహకారం అందించే విషయమై పరిశీలన చేస్తామన్నారు. ఇండ్ల సమస్య కోర్టు పరిధిలో ఉన్నందున, ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఆలోచన చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ యూజే వర్కింగ్ ప్రెసిడెంట్ గండ్ర నవీన్, ట్రెజరర్ బట్టిపాటి రాజశేఖర్, నాయకులు రామకృష్ణ, మధుకర్, క్రాంతి, ప్రశాంత్, కొడవటి నవీన్, సీనియర్ జర్నలిస్టులు యాదగిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
22 ఫిబ్రవరి 2025
తెలంగాణ

### ప్రజా సమస్యల పరిష్కారం కోసం

# మీట్ యువర్ ఎస్పీ

- మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన శరత్ చంద్ర పవార్ ఐ పి ఎస్
- నేడే డిండి పోలీస్ స్టేషన్లో అందుబాటులో జిల్లా ఎస్పీ



ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజల వద్దకు వెళ్లి పరిష్కరించే దిశగా నేడు అనగా శనివారం డిండి (గుండ్లపల్లి) పోలీసు స్టేషన్లో ఉదయం 11.00 గంటలకు మీట్ యువర్ యస్పి కార్యక్రమాన్ని నిర్వహించానున్నారని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాధితుల యొక్క ఫిర్యాదులను పోలీసు స్టేషన్లలోనే పరిశీలించి సత్వర న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కావున ఆ మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యల గురించి ఎస్పిని స్వయంగా కలిసి దరఖాస్తులు సమర్పించేందుకు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జనంసాక్షి @ దేవరకొండ



### మార్చి 24,25న

## బ్యాంకు ఉద్యోగుల సమ్మె

**దేవరకొండ, ఫిబ్రవరి 21(జనంసాక్షి):** న్యాయమైన డిమాండ్ల సాధన కోరుతూ యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో దాదాపు పది లక్షల ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు, అధికారులు మార్చి 24, 25 తేదీల్లో సమ్మెకు చేపట్టనున్నట్లు నల్గొండ ఏఓ మోడల్ ఓబీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్విటీ అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేవరకొండ శాఖ నందు బ్యాంకు ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించినారు. ఈ సందర్భంగా ఎన్ వి టీ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించాలని, సిబ్బందిని సకాలంలో నియమించాలని కోరారు. పని ఒత్తిడి పెరగడం, డిజిటలైజేషన్ అందుబాటులో ఉన్నందున వారానికి ఐదు రోజులు మాత్రమే బ్యాంకులు తెరవాలన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల స్థానంలో శాశ్వత నియామకాలు చేపట్టాలన్నారు. 12వ వేతన సవరణలో భాగంగా మిగిలి ఉన్న డిమాండ్లను తక్షణమేనెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ చరణ్ ,ప్రశాంత్, క్యాష్ ఆఫీసర్ గోపాల కృష్ణ, శాంతా నాయక్, శ్రీధర్, మనిషా, సాయి కిషోర్, వెంకట్, వెంకన్న, చక్రపాణి, రాజకుమార్, ప్రవీణ్ ,కలమ్మ, శ్రీకాంత్ , మురళి, తదితరులు పాల్గొన్నారు.

## బొడ్డు బాబురావుకు డాక్టరేట్



**చిట్యాల ఫిబ్రవరి 21(జనంసాక్షి)** చిట్యాల పట్టణానికి చెందిన బొడ్డు బాబురావు కు మనం ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్ లో గురువారం రాత్రి డాక్టరేట్ అవార్డు పొందడం పట్ల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్ హర్షం వ్యక్తం చేశారు.సమాచార హక్కు ప్రజా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులుగా బొడ్డు బాబురావు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు మనం ఫౌండేషన్ గుర్తించి ఈ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు తెలిపారు.హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్ భవనం లో గురువారం రాత్రి మాజీ బి.సి కార్పొరేషన్ చైర్మన్ ఒకలా భరణం క్రిష్ణ మోహన్దా,డా ఆది నారాయణ,రిటైర్డ్ జడ్జి నేరళ్ళ మాల్యాద్రి చేతుల మీదుగా బాబురావు అవార్డు పొందటం శుభపరిణామం అని కొనియాడారు.అవార్డు కు సహకరించిన మనం ఫౌండేషన్ చైర్మన్ డా,కె చక్రవర్తి,ఇతర సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# తాజ్ బంజారాకు జిహెచ్ఎంసి షాక్

**పన్ను కట్టనందుకు హోటల్ సీజ్**




**హైదరాబాద్,ఫిబ్రవరి 21 ( జనంసాక్షి):** హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన తాజ్ బంజారా హోటల్‌కు జీహెచ్ఎంసీ అధికారుల షాక్ ఇచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్ తాజ్ బంజారా హోటల్‌ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. గత రెండేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో ఈ మేరకు అధికారులు సీజ్ చేశారు. పన్ను చెల్లించాలని పలు మార్లు నోటీసులు ఇచ్చినా హోటల్ యాజమాన్యం స్పందించలేదు. దీంతో అధికారులు హోటల్‌ను సీజ్ చేశారు. మొత్తం రూ. కోటి 47 లక్షల టాక్స్ పెండింగ్ ఉందని, పన్ను చెల్లించాలని.. జీహెచ్ఎంసీ అధికారులు 5 సార్లు నోటీసులు ఇచ్చిన హోటల్ యాజమాన్యం స్పందించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా హోటల్ నిర్వాహకులు జీహెచ్ఎంసీకి పన్ను బకాయలు చెల్లించలేదు. దీనిపై పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా హోటల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. పరిస్థితి గమనించిన జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఉదయం హోటల్‌ను సీజ్ చేశారు. హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన.. నిత్యం బిజీగా ఉండే తాజ్ బంజారా హోటల్‌కు సెలబ్రెటీలు ఎక్కువగా వస్తుంటారు. క్రికెటర్లు ఎప్పుడు వచ్చినా ఈ హోటల్‌లో బస చేస్తుంటారు. అలాగే దేశంలోని కీలక రాజకీయనేతలు హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడే స్టే చేస్తారు. పార్టీ సమావేశాలకు అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది ఈ హోటల్ వైపు మొగ్గుచూపుతారు. అటాంటి హోటల్ సీజ్ కావడం గమనార్హం..

# కనీస రహదారికినోచుకోని గిరి పల్లెలు

**గూడాల్లో కానరాని మంచినీటి సౌకర్యం**



**భద్రాచలం,ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** జిల్లావ్యాప్తంగా అనేక గ్రామాల ప్రజలు నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోవడం లేదు. రాళ్లతో నిండిన బాటలతో నడక సాగిస్తూ నానా పాట్లు పడుతున్నారు. అనేక గ్రామాలకు కాలిబాటలు కూడా లేవు. నేటికీ డోలీలు ఆశ్రయిస్తున్నారు. గిరిజన గ్రామాలుఅనేకం రవాణాకు దూరంగా ఉన్నాయి. దీంతో ఇతర గ్రామాలకు వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, పంటలను విక్రయిద్దామన్నా కొండలను ఎక్కి దిగాల్సి వస్తుంది. రహదారి, తాగునీరు సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించాలని స్థానిక గిరిజన సంఘాలు కోరుతున్నాయి. అనేక గిరిజన గ్రామాల్లో నేటికీ విద్యుత్ సౌక్యం లేకుండా పోయింది. ఇలాంటి గ్రామాల్లో అభివృద్ధి మాటెలా ఉన్నా అక్కడికి చేరుకోవడానికి దారులు కూడా లేవు. గిరి ప్లలెలకు రహదారి, విద్యుత్తు సౌకర్యం కల్పించ డానికి కృషి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు. ఆయా గూడాల్లోని గ్రామాల్లో ఒక్కగానొక్క బోరు మాత్రమే ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. అనేక గ్రామాల్లో ఇప్పటికీ చెలిమెలు, వాగు నీటితోనే గొంతు తడుపుకొంటున్నారు. గిరిజనుల గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కరవయ్యాయి. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదంతో పలుచోట్ల గ్రామీణులు నాటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. గ్రామాలకు నేటికీ రహదారుల లేక ప్రజలు ఇతర గ్రామాలకు రాకపోకలు సాగించడానికి నానా అవస్థలు పడుతున్నారు. దట్టమైన అడవుల్లో, మొనదేలిన రాళ్ల మధ్య నడుస్తూ బతుకుపోరాటం చేస్తున్నారు. ఇక చినుకు పడితే కాలు తీసి ముందుకు వేయలేని విధంగా బురద దారులు, వంతెనలు లేని అనేక గ్రామాల ప్రజలు వర్షాకాలం బాహ్య ప్రపంచానికి దూరం అవుతున్నారు. విద్యుత్ వెలుగులు, తాగు నీరు, రహదారులు వంటి సదుపా యాలు కొరవడిన గ్రామాల్లో ప్రజలు అవస్థలుపడటం పరిపాటిగా మారింది. ఓటర్లుగానే తప్పితే మనుషులుగా తమను నాయకులు గుర్తించడం లేదంటూ గిరిజనులు వాపోతున్నారు. కొండకొనలతో సహజీవనం చేస్తూ, మౌలిక సదుపాయాలు కొరవడి అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న పల్లెలపై నేతలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# నర్సిరెడ్డి గెలిస్తే ఓటర్ గెలిచినట్టే

**టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి**




**నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 21, జనంసాక్షి:** ఈ నెల 27 న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉపాధ్యాయ,అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని అత్యధిక మొదటి ప్రాధాన్యత ఓట్లతో గెలిపించాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి కోరారు. నర్సిరెడ్డి గెలిస్తేనే ఓటర్ గెలిచినట్లని,ఇంకెవరు గెలిచినా వారు వెంటనే అధికార పార్టీలో చేరిపోయే అవకాశవాదులేనని, అప్పుడు ఓటర్ ఓడిపోతారని అన్నారు. నర్సిరెడ్డి మాత్రమే గత ఆరేళ్ళుగా నిజమైన ఉపాధ్యాయ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నిత్యం నియోజకవర్గంలో పర్యటిస్తూ విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, నర్సిరెడ్డి చొరవతోనే టెట్ వివాదం పరిష్కారమైందని, వేలాది మంది ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు వచ్చాయని అన్నారు.తనకు మంజూరైన నియోజకవర్గ అభివృద్ధి నిధులను100 శాతం పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి కేటాయించారని, ముఖ్యమంత్రి సహాయనిధి నుండి పేదలకు వైద్య సహాయం కోసం నాలుగున్నర కోట్లు మంజూరు చేయించారని తెలిపారు.శుక్రవారం నల్లగొండ జిల్లాలోని పలు పాఠశాలలను రవి సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. అనంతరం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నెల మొదటి తేదీన వేతనాలు ఇస్తామన్న హామీ మోడల్ స్కూల్స్, గురుకులాలు,కెజిబివిల్లో అమలు జరగడం లేదన్నారు. రెండేళ్ళుగా ఉపాధ్యాయుల సప్లిమెంటరీ బిల్లులు, సెలవు జీతాలు, మెడికల్ రీయింబర్స్ మెంట్, జిపిఎఫ్, జిఎల్ఐ తదితర బకాయిలు ట్రెజరీలో ఆమోదం పొందినప్పటికీ ఇకుబేర్ లో పెండింగ్ లో ఉన్నాయని, రిటైరైన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్ తదతర రిటైర్మెంట్ బెనిఫిట్స్ సంవత్సర కాలంగా విడుదల కాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వీసు నిబంధనలు రూపొందించి డిఈఓ,డిప్యూటీ ఇఒ, ఎంఈఒ, డైట్, బిఈడి కళాశాల అధ్యాపకుల పదోన్న తులు చేపట్టాలని, గురుకులాల పనివేళలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అనుకూలంగా శాస్త్రీయంగా నిర్ణయించాలని ,కెజిబివి ఉద్యోగులకు పేస్కేలు ఇవ్వాలని, కేర్ టేకర్లను నియమించాలని,010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం,జిల్లా కార్యదర్శి గేర నరసింహ్మ, నలపరాజు వెంకన్న, తెలంగాణ పౌర స్పందన వేదిక జిల్లా అధ్యక్షులు అంజిరెడ్డి,పూర్వ రాష్ట్ర కార్యదర్శి నర్రా సరళ,మండల బాధ్యులు రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదమిత్ర మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి

**ఆపద సమయాలలో సమర్ధవంతంగా పనిచేయాలి : డిఆర్‌డిఓ పిడి శేఖర్ రెడ్డి**



**నల్గొండ బ్యూరో, ఫిబ్రవరి 21, జనంసాక్షి :** అనుకోని రీతిలో విపత్తులు సంభవించిన సమయాలలో,తక్షణ సహాయ చర్యలు చేపట్టేందుకు వీలుగా ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణను అందించామని డి ఆర్ డి ఓ పి డి శేఖర్ రెడ్డి చెప్పారు. ఈ నెల10 నుండి 21వరకు మొదటి బ్యాచ్12 రోజులు,100 మంది శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్నారు.శుక్రవారం డిఆర్డిఓ పిడి శిక్షణ పూర్తి చేసుకున్న ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ సర్టిఫికెట్ పత్రాలను అందజేశారు.పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటిని ఎదుర్కొనేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతోఉపయోగపడతాయని పిడి అన్నారు.డిఆర్డిఓ కార్యాలయంలో మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తి చేసుకున్న వాళ్లంటాలను ఆయన అభినందించారు. ప్రకృతి పరంగా,మానవ తప్పిదాల వల్ల విపత్తులు సంభవించినప్పుడు స్థానికంగా ఉండే సామాజిక కార్యకర్తలు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఉద్దేశంతోనే ఆపదమిత్ర పేరుతో శిక్షణ అందించడం జరిగిందన్నారు.ఆపద సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి ఆస్తి ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలని తదితరు అంశాలపై వాలంటీర్స్ కు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.శిక్షణ పూర్తి చేసిన వాలంటారులు ఆపద సమయాలలో సమర్ధవంతంగా సేవలందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు సిబ్బంది వాలంటార్లు తదితరులు పాల్గొన్నారు.

### కొత్తగూడెం వయా చంద్రుగొండ మియాపూర్ సూపర్ లగ్జరీ

# మియాపూర్ వరకు పునరుద్ధరించాలి

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకోవాలి**




**చంద్రుగొండ ,ఫిబ్రవరి 21 (జనంసాక్షి):** కొత్తగూడెం నుండి వయా చంద్రుగొండ, ఎర్రగుంట, పెనుబల్లి మీదుగా ఎంజీబీఎస్ వరకు నడుస్తున్న సూపర్ లగ్జరీ బస్సును మియాపూర్ వరకు పునరుద్ధరించాలని ఆయా మండలాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో మియాపూర్ వరకు నడిచిన సూపర్ లగ్జరీ బస్సు మధ్యలో నిలుపుదల చేసిన పిదప ప్రజల ఆకాంక్ష మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేయడంతో తిరిగి పునరుద్ధరించారు. కానీ ఆయా మండల ప్రజల ఆశలు మీద నీళ్లు చల్లినట్లు అయింది. అ బస్సును కేవలం ఎంజీబీఎస్ హైదరాబాద్ వరకే వెళుతుండడంతో మియాపూర్ వరకు మార్గమధ్యం లో ఉన్న సిటీస్ కు చేరే వారికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎంజీబీఎస్ లో దిగిన వారు మరల బస్సులు లేదా ఇతర మార్గాల ద్వారా వారి గమ్యస్థానాలకు వెళ్ళటానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదికాక బస్సు మూడు గంటల 30 నిమిషాలకే ఉదయం చేరుతుండటంతో ఆ సమయంలో అక్కడి నుంచి వారి మార్గాలకు వెళ్ళటానికి బస్సులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొత్తగూడెం నుంచి తొమ్మిది గంటల 45 నిమిషాలకు రాత్రి బయలుదేరి ఉదయం 3:30 కు వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు మియాపూర్ కు వెళ్లకపోవడంతో చాలామంది కొత్తగూడెం నుంచి ప్రయాణానికి మొగ్గుచూపు తున్నారు. ఈ విధంగా వెళ్ళటానికి వ్యయ ప్రయాసలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సూపర్ లగ్జరీ బస్సు మియాపూర్ వరకు వెళ్ళినప్పుడు బస్సు నిండుగా ఉండి ఆర్టీసీ కి సైతం నష్టాలు చేకూర్చకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రయాణం ఉండటం ఆనందంగా ఉండేది. అటువంటి సూపర్ లగ్జరీ బస్సును ఎంజీబీఎస్ వరకు నడవడం వల్ల ప్రయాణికులు సైతం విముకుత చూపిస్తున్నారు. ఈ విషయంలో మరొక మారు మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి చొరవ తీసుకొని ప్రజల ఉపయోగార్ధం బస్సును మియాపూర్ వరకు పొడిగించే విధంగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి బస్సును పునరుద్ధరించాలని కోరుతున్నారు.



## రెక్కల రామక్క దేవుడుని దర్శించుకున్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్

**ఆళ్లపల్లి ఫిబ్రవరి 21( జనంసాక్షి):** మండల పరిధిలోని మర్కోడు గ్రామపంచాయతీ పెద్దూరు గ్రామంలో నిర్వహిస్తున్న, రెక్కల రామక్క దేవుడిని శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ దర్శించుకున్నారు. మొదటగా గిరిజన సాంప్రదాయంగా ఎస్పి రోహిత్ రాజుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని గద్దెల వద్ద కొమరం వంశీయుల ఆరాధ్య దైవమైన రెక్కల రామక్క చరిత్రను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ సాంప్రదాయాలను కొనసాగిస్తూ రాబోయే తరాలకు తెలిపే విధంగా చూసుకోవాలని అన్నారు. మొక్కులు తీర్చుకోవడానికి ఆలయ ప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పి చంద్రబాను, టేకులపల్లి సిఐ సురేష్, ఎస్సై రతీష్ ,మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు కొమర వెంకటేశ్వర్లు, కొమరం సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ కొమరం హనుమంతరావు, కొమరం రాంబాబు ,కొమరం రామ్మూర్తి, కొమరం వెంకటకృష్ణ ,కొమరం లాలయ్య, కొమరం వెంకటేశ్వర్లు, కొమరం సతీష్, మాజీ ఉపసర్పంచ్ కొమరం ప్రభాకర్ ,కొమరం నరసింహారావు, కొమరం శంకర్ బాబు ,కొమరం జగన్, కొమరం పృధ్వి ,కొమరం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జాతరకు భారీ పోలీస్ బందోబస్తు

- బందోబస్తు లో పాల్గొననున్న 600 మంది పోలీస్ సిబ్బంది
- 65సీసి కెమెరాల ఏర్పాటు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**మేళ్లచెరువు (జనంసాక్షి):** ఫిబ్రవరి 26వ తారీఖు నుండి జరగనున్న మేళ్ల చెరువు మహా శివరాత్రి జాతరకు భారీ పోలీస్ బందోబస్తు ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. శుక్రవారం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎడ్ల పందాలు, కబడ్డీ పోటీలు జరిగే ప్రాంతాన్ని శివాలయ పరిసరాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.జాతరలో మొత్తం 600 మంది పోలీస్ సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు.జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చూడాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. ప్రధాన కూడళ్ళతో పాటు దేవాలయ పరిసరాల్లో సుమారు 65 సీసి కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున జాతరకు వచ్చే నలుమూలల దారుల్లో పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.భక్తులు జాతర సజావుగా జరిగేటట్లు సహకరించాలని కోరారు. ఆయన వెంట సీఐ రజితరెడ్డి, దేవాలయ చైర్మన్ శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డిస్థానిక ఎస్సై పరమేష్, దేవాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మంచినీటి సమస్యపై దృష్టి పెట్టాలి

**రంగారెడ్డి,ఫిబ్రవరి21 (జనంసాక్షి):** వేసవి తొంగి చూస్తున్నందున ఇప్పటికే గ్రామాల్లో నీటి సమస్యలు మొదలయ్యాయని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక నేతలు అన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి గ్రామానికి నీటి సరఫరా చేమాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ఓవర్ హెడ్ ట్యాంకుల వద్ద మురుగునీరు నిల్వకుండా, లైన్‌మెన్, వాటర్ గ్రిడ్, ఆర్‌డబ్ల్యూస్ అధికారులు పేర్లు, వారి సెల్ నెంబర్లు రాయవల్సిందిగా సూచించారు. నిర్మాణంలో ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం త్వరిత గతిన పూర్తి చేయాల్సిందిగా కోరారు. జిల్లా అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ఇల్లా అభివృద్ధి ముందుకు సాగుతోందన్నారు.

## చెట్లు నరికితే కఠిన చర్యలు

**మొక్కల రక్షణకు ఏర్పాట్లు**

**నిజామాబాద్,ఫిబ్రవరి21 (జనంసాక్షి):** మొక్కల పెంపకంలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని జిల్లా అటవీ అధికారులు అన్నారు. అక్రమంగా చెట్లను నరికే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కోతుల బెడద పేరుతో చెట్లను నరుకుతున్నారని అన్నారు. ఇలా చేయడం వల్ల గ్రామాల్లో పచ్చదనం కరువవుతుందన్నారు. చివరకు పీల్చడానికి గాలికూడా దక్కదని అన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా చెట్లను నరికినా, దొంగకర్ర ఎగుమతి చేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. మానవాళికి ప్రాణవాయువును అందించే చెట్ల సంరక్షణ పౌరుల సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. మొక్కల నర్సరీల్లో ఎండాకాలం వాటిని కాపాడడానికి అటవీ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను ఎండల నుంచి కాపాడటానికి సన్నాహాలు చేస్తున్నారు. మొక్కలు ఎండల నుంచి తట్టుకునేలా షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది మొక్కలను నాటి టార్గెట్ పూర్తిచేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఒకరు అన్నారు. ఎండల నుంచి మొక్కలకు రక్షణ ఉండేందుకు గ్రీన్‌షెడ్‌నెట్‌లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మొక్కల పెంపకంపై ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వీటి పెంపకంలో క్షేత్రస్థాయి సిబ్బందిని కూడా అలర్ట్ చేశాం.గ్రామప్రాంతాల్లో మొక్కలు నాటడానికి అనువుగా అన్నీ సిద్ధం చేశామని అన్నారు. పంపిణీ చేయడానికి మొక్కలను వన నర్సరీల్లో సిద్ధం చేసామన్నారు. ఆయా నర్సరీల్లో గ్రామాల్లో అందజేయడానికి మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. వివిధ రకాల నీడనిచ్చే, పండ్ల, పువ్వుల మొక్కలను సైతం పెంచుతున్నారు. ప్రధానంగా టేకు, వేప, కానుగ, ఖర్జూర, ఈత, నెమలినార, చింత, దానిమ్మ, జామ, గుల్మోర్గ, మర్రి, రావి తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. వేసవిని తట్టుకునే మొక్కలు కూడా ఉన్నాయి. కాగా ఎండల నుంచి మొక్కలను కాపాడుకోవడానికి షెడ్‌నెట్‌లను విరివిగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఉన్నత స్థాయి అధికారులు కూడా నర్సరీలను సందర్శించి మొక్కల వివరాలను సేకరించారు.

# విపణి

# నష్టాల పరుగు

## నాలుగో రోజూ 22,800 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ముఖ్యంగా ఆటో స్టాక్స్‌లో విక్రయాల కారణంగా సూచీలపై ఒత్తిడి పెరిగింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6 శాతం, టాటా మోటార్స్ షేర్లు 2.46 శాతం చొప్పున నష్టపోయాయి. ఈ క్రమంలో స్టాక్ మార్కెట్ బెంచ్ మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ వరుసగా నాలుగో రోజూ నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ 22,800 దిగువకు చేరింది. మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీల్లోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అటు ప్రపంచ మార్కెట్లలోనూ వాణిజ్య యుద్ధ భయాలు కొనసాగుతు న్నాయి. సెన్సెక్స్ ఉదయం 75,612.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,735.96) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 75,112.41 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 424.90 పాయింట్ల నష్టంతో 75,311.06 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 117.25 పాయింట్ల నష్టంతో 22,795.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 7 పైసలు బలహీనపడి 86.71 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, సన్‌ఫార్మా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్



నష్టపోయాయి. టాటా స్టీల్, ఎల్‌అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.90 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2944 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఫ్లాట్‌గా ప్రారంభమైన స్టాక్ మార్కెట్లు..**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. దీంతో సూచీలు ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. ప్రస్తుతం సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 55 పాయింట్లు తగ్గి 75,668 వద్ద.. నిఫ్టీ 9 పాయింట్లు కుంగి 22,903 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో ఎంఅండ్ఎం, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్ సిమెంట్, నెస్లే ఇండియా, మారుతీ సుజుకీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. టాటా స్టీల్, జొమాటో, ఎల్‌అండ్‌టీ, ఎన్టీపీసీ, టీసీఎస్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 86.50 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 76.40 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,943.30 డాలర్ల వద్ద కదలాడుతోంది. అమెరికా మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఆసియా-పసిఫిక్ ప్రధాన సూచీలు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.89, జపాన్ నిక్కీ 0.11 శాతం, షాంఘై 0.74 శాతం లాభంతో కదలాడు తున్నాయి. ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ మాత్రం స్వల్ప నష్టంతో ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఈఎఐ) గురువారం నికరంగా రూ.3,312 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.3,908 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు.

## కొత్త ఈవీ పాలసీ ఊహాగానాలు

### టాటా, మహీంద్రా షేర్లు డౌన్



ప్రముఖ కార్ల తయారీ సంస్థలైన టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. విదేశీ కార్ల తయారీ కంపెనీలకు ఆహ్వానం పలికేందుకు కేంద్రం కొత్త ఈవీ పాలసీని తీసుకురాబోతోందన్న వార్తల నేపథ్యంలో ఈ ఉదయం ఆయా కంపెనీల షేర్లు ఆరు శాతం వరకు నష్టపోయాయి.దేశంలోకి అమెరికా కార్ల తయారీ సంస్థ టెస్లా ఎంట్రీ దాదాపు ఖరారైంది. అయితే, సుంకాలు మరింత తగ్గించాలని ఆ కంపెనీ కోరుతోంది. ఈనేపథ్యంలో టెస్లా కోసం ప్రభుత్వం కొత్త ఈవీ పాలసీని మరింత సులభతరం చేస్తూ తీసుకురాబోతోందంటూ వార్తలు వస్తున్నాయి. దిగుమతి సుంకాన్ని తగ్గిస్తే విదేశీ కార్లు దేశీయ మార్కెట్లో ప్రవేశించేందుకు వీలు పడుతుంది. అప్పుడు దేశీయ కార్ల తయారీ కంపెనీలకు గట్టి పోటీ ఏర్పడుతుంది. ఈ భయాల నేపథ్యంలో ఆటో స్టాక్స్ అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయని నిపుణులు చెబుతున్నారు.ఈక్రమంలో నిఫ్టీ ఆటో సూచీ 2 శాతం మేర నష్టపోయింది. మహీంద్రా అండ్ మహీంద్రా 6 శాతం, టాటా మోటార్స్ 2 శాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ప్రస్తుతం ఈవీ కార్ల మార్కెట్‌లో ఈ రెండూ మెజారిటీ వాటా కలిగిఉన్నాయి. మరోవైపు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగుతోంది. మధ్యాహ్నం 1.15 గంటల సమయానికి సెన్సెక్స్ 445 పాయింట్ల నష్టంతో





## రూ.30 వేల కోట్ల పెట్టుబడులు

### కేరళలో అదానీ గ్రూప్ వ్యాపారకలాపాలు

అదానీ గ్రూప్ వచ్చే ఐదేళ్లలో కేరళలో రూ.30 వేల కోట్లు పెట్టుబడి పెట్టాలని యోచిస్తోందని అదానీ పోర్ట్స్, సెజ్ లిమిటెడ్, ఓఆ, కరణ్ అదానీ ప్రకటించారు.రూ.5,500 కోట్ల పెట్టుబడితో తిరువనంతపురం ఎయిర్‌పోర్టు సామర్థ్యాన్ని ఏడాదికి 45 లక్షల ప్రయాణికుల నుంచి 1.20 కోట్లకు సరిపడా విస్తరించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే, కొచ్చిలో లాజిస్టిక్స్, ఈ-కామర్స్ హబ్‌ను ఏర్పాటు చేస్తామని; అదే ప్రాంతంలో సిమెంట్ తయారీ సామర్థ్యాన్ని పెంచుతామని ఆయన తెలిపారు. అదానీ గ్రూప్ కేరళలో పోర్టును అభివృద్ధి చేస్తోంది, ఇప్పటికే రూ.5 వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. ఇన్వెస్ట్ కేరళ గ్లోబల్ సమ్మిట్‌లో అదానీ పోర్ట్స్ ఒ సెజ్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, కరణ్ అదానీ కేరళలో పెట్టుబడి ప్రణాళికలను ప్రకటించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో దాదాపు 3,000 మంది పాల్గొనే అవకాశం ఉంది.

## పేటీఎం నుంచి సోలార్ సౌండ్ బాక్స్..

ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ పేటీఎం మాతృసంస్థ 'వన్97 కమ్యూనికేషన్స్'.. సోలార్ సౌండ్‌బాక్స్‌ను లాంచ్ చేసింది. భారత్‌లో మొట్ట మొదటిసారిగా సౌరశక్తితో నడిచే సౌండ్ బాక్స్‌ను తీసుకొచ్చింది. తక్కువ సూర్యకాంతితో ఛార్జ్ అయ్యేలా వీటిని రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. వ్యాపారులకు విద్యుత్ ఖర్చుల్ని తగ్గించేందుకు వీటని అందుబాటులోకి తెచ్చినట్లు పేటీఎం వెల్లడించింది. పేటీఎం సోలార్ సౌండ్ బాక్సులు పైభాగంలో సోలార్ ప్యానెల్‌ను కలిగిఉంటాయి.



## చాట్‌జీపీటీ తగ్గేదేలే..

### 400 మిలియన్లకు యాక్టివ్ యూజర్లు





ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ వినియోగించే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ విభాగంలో పోటీ ఇచ్చేందుకు ఇప్పటికే పలు సంస్థలు ముందుకొస్తున్నా చాట్‌జీపీటీకి ఉనక్రేజ్ ఏ మాత్రం తగ్గడం లేదు.గతేడాది డిసెంబర్‌తో పోలిస్తే ప్రస్తుతం ఉన్న యూజర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ విషయాన్ని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ బ్రాడ్ లైట్‌క్యాప్ వెల్లడించారు. తమ సేవలు చాలామందికి చేరువైనట్లు ఆయన తెలిపారు.ప్రస్తుతం ఓపెన్‌ఏఐ చాట్‌బాట్‌కు వారానికి 400 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉన్నారు. డిసెంబర్‌లో ఈ సంఖ్య 300 మిలియన్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో చాలా పెరుగుదల నమోదైంది. చాట్‌జీపీటీని కేవలం వ్యక్తులు మాత్రమే కాదు.. కంపెనీలు కూడా వినియోగిస్తున్నాయి. వీటి సంఖ్య దాదాపు 2 మిలియన్ల వరకు ఉంది. సెప్టెంబర్‌తో పోలిస్తే ఈ సంఖ్య రెట్టింపైంది. ఉబర్, మోర్గాన్ స్టాన్లీ, టీ- మొబైల్స్ వంటి పెద్దపెద్ద కంపెనీలు ఓపెన్ ఏఐని వినియోగిస్తున్న సంస్థల జాబితాలో ఉన్నాయి. చాలామంది డెవలపర్లు ఓపెన్‌ఏఐకి చెందిన ఏఐ మోడళ్లను వారి సొంత యాంలలో వినియోగిస్తున్నారు. దీంతో ఈ సేవల్ని వినియోగించే డెవలపర్ల సంఖ్య ఆరు నెలల్లో రెట్టింపైంది. అదే సమయంలో ఓపెన్‌ఏఐ అడ్వాన్స్‌డ్ రీజనింగ్ మోడల్ వినియోగం ఏకంగా ఐదు రెట్లు పెరిగిందని కంపెనీ తెలిపింది. చైనాకు చెందిన ఏఐ కంపెనీ డీప్‌సీక్‌ను ఒక్కసారిగా మార్కెట్‌లోకి దూసుకొచ్చి ప్రపంచాన్ని ఆశ్చర్య ఇదిలాఉండగా.. కృత్రిమ మేధ విభాగంలో ఇప్పటికే పోటీ నెలకొంది. పరిచింది. గ్రోక్ కూడా తన ఏఐ సేవల్ని మెరుగుపరుస్తూ వస్తోంది.

## బీమా ప్రీమియానికి గాలి నాణ్యతతో లింక్!



**జనంసాక్షి:**ఆరోగ్య బీమా జారీ చేసేటప్పుడు వయసు, బరువు, వ్యాధులు వంటివి ఆయా సంస్థలు పరిగణనలోకి తీసుకుంటాయి. దాని ఆధారంగానే ఆరోగ్య బీమా సంస్థలు ప్రీమియం నిర్ణయిస్తుంటాయి. ధూమపానం చేసే వారికి, చేయని వారికి కూడా వేర్వేరుగా ప్రీమియం ఉంటుంది. ఇకపై వాయు నాణ్యతను కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఇన్సూరెన్స్ సంస్థలు భావిస్తున్నాయట. ముఖ్యంగా దేశ రాజధాని దిల్లీలో వాయు నాణ్యత అంతంతమాత్రంగానే ఉంటున్న వేళ దీన్నీ పరిగణనలోకి తీసుకోవాలనుకుంటున్నాయని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. అదే జరిగితే దేశ రాజధాని దిల్లీ వాసులు ఇకపై ఆరోగ్య బీమాకు 10 నుంచి 15 శాతం మేర అధికంగా చెల్లించాల్సి రావొచ్చు .ప్రస్తుతం వివిధ ఇన్సూరెన్స్ కంపెనీలు ఈ అంశంపై చర్చిస్తున్నాయి. ఆపై బీమా నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అదే జరిగితే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను నిర్ణయించడంలో వాయు నాణ్యత పరిగనణలోకి తీసుకోవడం ఇదే తొలిసారి కానుంది. అంతేకాదు ఇతర నగరాల్లో బీమా ప్రీమియంలను పెంచుకొనేందుకు బీమా సంస్థలకు ఓ సాధనం కానుంది. వాయు నాణ్యత విషయంలో దిల్లీ నిత్యం వార్తల్లో నిలుస్తుంటుంది.వాహన కాలుష్యం, నిర్మాణ పనులు, పొరుగు రాష్ట్రాల్లో రైతులు సాగు వ్యర్థాలకు నిప్పు పెట్టడం వంటి కారణాలతో దిల్లీ నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. ఆస్తమా వంటి శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఇలాంటి కారణాలతో ఆస్పత్రిలో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఇందుకోసం ఆరోగ్య బీమా వినియోగించు కుంటున్న వారి సంఖ్య 2023 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2025లో 8 శాతం మేర పెరిగిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా బీమా సంస్థలు ప్రీమియం వసూలులో గాలి నాణ్యత ఫ్యాక్టర్‌ను జోడించాలని ఆలోచన చేస్తున్నాయి. దీన్ని ఐఆర్‌డీఏఐ ఆమోదిస్తుందా? లేదా? చూడాలి.

## దిల్లీలో డీఎన్‌పీఏ కాన్‌క్లేవ్

**దిల్లీ:** భారత్‌లోని ప్రముఖ న్యూస్ పబ్లిషర్లతో ఏర్పాటైన డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ మూడో కాన్‌క్లేవ్ దిల్లీ వేదికగా ఫిబ్రవరి 27న జరగనుంది. అన్ని రంగాల్లోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ దూసుకొస్తున్న వేళ.. ఇదే థీమ్‌తో ఈ కాన్‌క్లేవ్ నిర్వహించనున్నారు. 'ఏఐ యుగంలో మీడియా రూపాంతరం' అనే అంశంపై ఇందులో చర్చించనున్నారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే మేధావులు ఒక్కచోట చేరి డిజిటల్ న్యూస్ మీడియా భవిష్యత్తు, కొత్త అవకాశాలు, ఏఐ నుంచి ఎదురయ్యే సవాళ్లు వంటి అంశాలపై చర్చించనున్నారు.కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. యూరోపియన్ పార్లమెంట్ సభ్యుడు, ఏఐ వర్కింగ్ గ్రూప్ కో ఛైర్మన్ మైఖేల్ మెక్‌నమారా, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శి ఎస్.కృష్ణన్, సమాచార ప్రసారాల శాఖ సంజయ్ జాజు సహా పలువురు ప్రముఖులు ఈ కాన్‌క్లేవ్‌లో పాల్గొనున్నారు.డీఎన్‌పీఏలో దేశంలోనే టాప్ 20 ప్రింట్, టీవీ మీడియా హౌస్‌లు భాగస్వాములుగా ఉన్నాయి. ఈనాడు, న్యూస్ 18, ఇండియా టుడే, దైనిక్ భాస్కర్, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, టైమ్స్ ఆఫ్ ఇండియా, హిందుస్థాన్ టైమ్స్, ఏబీపీ, మలయాళ మనోరమ వంటి సంస్థలు ఈ అసోసియేషన్‌లో భాగం.





'భారత్‌కు అమెరికా నిధులు' వ్యాఖ్యల వివాదం

## ట్రంప్ చెప్పిన ఆ రూ.182 కోట్లు భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు మళ్లాయా?

**జనంసాక్షి:**భారత్‌లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యూఎస్‌ఎయిడ్ ద్వారా అందిన 21 మిలియన్ డాలర్ల (మన కరెన్సీలో దాదాపు రూ.182 కోట్లు) నిధులపై రాజకీయంగా పెను దుమారం కొనసాగుతోంది.దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సంచలన ఆరోపణలు చేశారు. తాజాగా ఈ వివాదం మరో మలుపు తిరిగింది. ఆ నిధులను బంగ్లాదేశ్‌కు మళ్లించారంటూ తాజాగా ఓ కథనం వెలువడింది. దాన్ని షేర్ చేస్తూ భాజపాపై కాంగ్రెస్ నేతలు నిప్పులు చెరిగారు. అసలేం జరిగిందంటే..యూఎస్ ఎయిడ్ ద్వారా భారత్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు అందిన సాయం (జూంఎఆ ఈబీనిట)పై ఓ ఆంగ్ల మీడియా పరిశోధనాత్మక కథనం ప్రచురించింది. అందులో అమెరికా తాజాగా ఆరోపణలు చేస్తోన్న ఆ 21 మిలియన్ డాలర్ల సాయాన్ని 2022లో బంగ్లాదేశ్ కోసం కేటాయించినట్లు పేర్కొంది. "బంగ్లాలో అమర్ ఓట్ అమర్ (నా ఓటు నాదే) అనే ప్రాజెక్ట్ కోసం ఈ నిధులను మంజూరు చేశారు. ఇందులో ఇప్పటికే





13.4 మిలియన్ డాలర్లను ఆ దేశానికి ఇచ్చారు" అని ఆ కథనంలో ఉంది ఈ కథనాన్ని కాంగ్రెస్ నేతలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. "ఈ అబద్ధం మొదట వాషింగ్టన్‌లో చెప్పారు. ఆ తర్వాత భాజపా ఆర్మీ దాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోంది. నిజానిజాలు తెలుసుకోకుండా వారు ప్రతిపక్షాలను వేలెత్తిచూపారు. ఇప్పుడు వారంతా క్షమాపణలు చెబుతారా?" అని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. అయితే, ఈ రిపోర్ట్‌ను భాజపా తీవ్రంగా ఖండించింది. అది నకిలీ, అవాస్తవ కథనం అని పేర్కొంది. ఇతర దేశాలకు ఇచ్చే నిధుల్లో కోత విధిస్తూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని డోజ్ విభాగం ఫిబ్రవరి 16న జాబితా ప్రకటించింది. అందులో భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు ఉద్దేశించిన నిధులను కూడా రద్దు చేసినట్లు ప్రకటించింది. డోజ్ నిర్ణయాన్ని ట్రంప్ సమర్థించడమే గాక.. గత బైడెన్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఆ నిధులను భారత్‌లో ఎవరినో గెలిపించడానికి కేటాయించారని ఆరోపించారు. తాజాగా దీనిపై మరోసారి స్పందిస్తూ అది కిక్‌బ్యాక్ స్కీమ్ అని దుయ్యబట్టారు. "ఆ డబ్బంతా భారత్‌కే వెళ్తుందని మీరు ఊహించగలరా? దాన్ని పొందినప్పుడు వారు ఏమి ఆలోచిస్తారో నాకు తెలుసు. ఇదో కిక్‌బ్యాక్ స్కీమ్. నిధులు తీసుకుంటారు. ఖర్చు చేస్తారు. అవి ఇచ్చిన వారికి తిరిగి లబ్ధిచేకూర్చేలా పనిచేస్తారు" అంటూ గత బైడెన్ ప్రభుత్వంపై పరోక్షంగా ఆరోపణలు చేశారు.

# జాతీయం అంతర్జాతీయం

## లాటెంట్ షో వివాదం.. నటి రాఖీ సావంత్‌కు నోటీసులు

'ఇండియాస్ గాట్ లాటెంట్' కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ రణ్‌వీర్ అల్హాబాదియా విమర్శలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.ఈ కేసులో తాజాగా బాలీవుడ్ నటి రాఖీ సావంత్‌కు మహారాష్ట్ర సైబర్ సెల్ సమన్లు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడానికి ఫిబ్రవరి 27న మహారాష్ట్ర సైబర్ సెల్ ముందు హాజరు కావాలని అధికారులు నోటీసులో పేర్కొన్నారు.నటికి నోటీసులు ఇవ్వడంపై ఐజీ యశస్వి యాదవ్ మాట్లాడుతూ.. షోలోని అన్ని ఎపిసోడ్‌లలో పాల్గొన్న వారందరి పైనా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని.. అందులో భాగంగానే ఆమెకు నోటీసులు ఇచ్చామన్నారు. యూట్యూబర్‌కు చెందిన అన్ని షోల వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని తమకు ఆదేశాలు అందాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో నటులు, నిర్మాతలు సహా మొత్తం 42 మందికి సమన్లు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఆశీష్ చంచలాని, రణ్‌వీర్ స్టేట్‌మెంట్లను రికార్డు చేయడానికి ఫిబ్రవరి 24న తమ ముందు హాజరు కావాలని ఇప్పటికే మహారాష్ట్ర సైబర్ సెల్ నోటీసులు ఇచ్చింది.

## భాషను బలవంతంగా రుద్దడం లేదు..

### కానీ: మోదీకి స్టాలిన్ లేఖపై కేంద్రమంత్రి పోస్టు



దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఏ భాషను బలవంతంగా రుద్దడం లేదని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. విదేశీ భాషపై అతిగా ఆధారపడటం వల్ల విద్యార్థులు భాషాపరమైన మూలాలను తెలుసుకోకుండా పరిమితం చేసినట్లవుతుందన్నారు.జాతీయ విద్యావిధానం ద్వారా ఈ పరిస్థితిని సరిచేసే ప్రయత్నం జరుగుతోందని మంత్రి ఎక్స్ వేదికగా వెల్లడించారు. తమిళ భాష శాశ్వతమని గతంలో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యను ప్రస్తావించిన మంత్రి.. తమిళ సంస్కృతి, భాషను విశ్వవ్యాప్తం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యను రాజకీయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. మోదీ కి గురువారం తమిళనాడు సీఎం లేఖ రాసిన నేపథ్యంలో మంత్రి నుంచి ఈ స్పందన వచ్చింది సమగ్రశిక్షా పథకం కింద రాష్ట్రానికి రూ.2,152 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్రధాని నరేంద్రమోదీని ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ప్రధానికి రాసిన లేఖలో.. జాతీయ విద్యావిధానం-2020ని పూర్తిగా అమలు చేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయబోమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్రంలోని విద్యార్థులు, రాజకీయ పార్టీలు, ప్రజల మధ్య ఆవేదన, ఆక్రోశం కలిగించిందని తెలిపారు. సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయకపోతే ఉపాధ్యాయులకు వేతనం, విద్యార్థులకు సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నాలు దెబ్బతింటాయన్నారు. 2024-25వ ఏడాదికి రాష్ట్రానికి అందాల్సిన రూ.2,152 కోట్లను వెంటనే మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

## భారత ప్రధాని మోదీ నాకు పెద్దన్న: భూటాన్ ప్రధాని



భారత ప్రధాని నరేంద్ర మోదీ తనకు పెద్దన్న వంటి వారని భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గే అన్నారు. దిల్లీలో నిర్వహించిన 'సోల్' లీడర్‌షిప్ కాన్‌క్లేవ్‌లో పాల్గొని ప్రసంగించారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో నాయకత్వం గురించి ఏమీ తెలిసేది కాదని.. అందుకు తాను అర్హుడిని కాదని అనుకునేవాడినని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ పర్యటనకు ఓ విద్యార్థిగా వచ్చానని అన్నారు. దీనిద్వారా ప్రపంచంలోనే గొప్ప నేతగా పేరొందిన నరేంద్రమోదీ నుంచి నాయకత్వ పాఠాలు నేర్చుకొనే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తంచేశారు. ఇది తనకు దొరికిన గొప్ప సదావకాశమని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞత, ధైర్యం, ముందుచూపుతో కేవలం పదేళ్లలో భారతదేశాన్ని ప్రగతిపథంలో నడిపించారని అన్నారు. ప్రస్తుతం ప్రపంచదేశాలు భారత్ వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. నాయకత్వం అనేది కేవలం బిరుదుల్లో ఉండదని.. వారు చూసే దృష్టికోణంలో ఉంటుందని అన్నారు. చరిత్ర కూడా ఇదే చెబుతోందని అన్నారు. ప్రపంచంలో గొప్ప నాయకులుగా పేరుపొందిన వారు కేవలం ఒక సంస్థకు లేదా దేశానికి మాత్రమే నాయకత్వం వహించలేదని.. ఓ విప్లవం, అభివృద్ధికి నాయకత్వం వహించారని అన్నారు. సరైన నాయకులు తమ దేశాన్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసకువెళ్లగలరని.. అటువంటి నాయకుడే ప్రధాని మోదీ అని ప్రశంసలు కురిపించారు.ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు.

## ఒక్క రోజు కాలేదు.. అప్పుడే విమర్శలా?

### దిల్లీ సీఎం రేఖా గుప్తా

**దిల్లీ:** భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ దిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖా గుప్తా తిప్పికొట్టారు. "కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు దిల్లీని పాలించాయి.ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా..? మొదటిరోజే మేం క్యాబినెట్ సమావేశం జరిపాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చాం. దాంతో ప్రజలకు రూ.10లక్షల మేర వైద్యసహాయం అందనుంది.ఈ పథకాన్ని ఆప్ అమలు చేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దిల్లీ తన హక్కులన్నీ పొందుతుంది. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోండి. ఎంతోమంది మీ పార్టీని వీడాలని చూస్తున్నారు. కాగ్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారు" అని రేఖ దుయ్యబట్టారు.దిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం అందించే పథకాన్ని మొదటి క్యాబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని భాజపా హామీ ఇచ్చిందని, కానీ మొదటిరోజే దానిని ఉల్లంఘించిందని ఆతిశీ విమర్శించారు. దీనిపైనే సీఎం స్పందన వచ్చింది.



నిన్న రామ్‌లీలా మైదానంలో భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో దిల్లీ 9వ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆమె సచివాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థిక సహాయం రూ.2,500 జమ చేస్తామని తెలిపారు. దిల్లీ అభివృద్ధి కోసం ఒక్కరోజు కూడా వృథా చేయకుండా శ్రమిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే సభలో ప్రవేశపెడతామని చెప్పారు. ఆమె అధ్యక్షతన దిల్లీ సచివాలయంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో తొలి మంత్రివర్గ భేటీ జరిగింది. అనంతరం మంత్రులందరితో కలిసి యమునా ఘాట్ వద్దకు వెళ్లి హారతి నిర్వహించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
22 ఫిబ్రవరి 2025

# ఎమ్మెల్సీ పోలింగ్ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**• జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** వరంగల్-ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఓ, ఏపిఓ, సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకుని ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రధానంగా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే, శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు, బ్యాలెట్ బాక్సులను పీ.ఓలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు, అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పిఓలదే అని అన్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా, శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా పోలింగ్ డే సందర్భంగా పిఓలు, ఏపీఓలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ హమీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, పర్యవేక్షకులు సలీమ్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

# శేరిలింగంపల్లి సర్వతోముఖాభివృద్ధికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతా..

**• పిఏసి చైర్మన్ అరికెపూడి**



**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** తన రాజకీయ ఎదుగుదలకు తోడ్పాటునందించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి ముందుకు సాగనున్నానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు 79.58 కోట్ల రూపాయల ఎస్ఎన్డిపి పథకానికి సంబంధించి ప్రభుత్వ నిధుల అంచనా వ్యయంతో ఆయా డివిజన్ల పరిధిలో చేపట్టనున్న నాలా విస్తరణ పనులకు సంబంధించి శుక్రవారం కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎన్డిపి ఫేస్ – 2 లో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో 79.58 కోట్ల రూపాయల అంచనా తో నాలా విస్తరణ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం శుభ పరిణామని తెలియజేశారు. ఇందులో భాగంగా గఫూర్ కాలనీ జంక్షన్ నుండి దుర్గం చెరువు వరకు 11.55 కోట్ల రూపాయల నిధులతో ఆర్ సిసి బాక్స్ డ్రైన్ నిర్మాణపు పనులకు, 13.86 కోట్ల రూపాయల నిధులతో జనార్ధన్ హిల్స్ కాలనీ నుండి యూరో కిడ్స్ స్కూల్ వరకు వరద నీటి కాలువ నిర్మాణపు పనులకు, గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు 6 కోట్ల 80 లక్షల రూపాయలతో ఆర్సిసి బాక్స్ డ్రైన్ నిర్మాణపు పనులు, పటేల్ చెరువు నుండి గంగారం చెరువు వరకు 18 కోట్ల 92 లక్షల రూపాయలతో ఆర్సిసి బాక్స్ డ్రైన్ నిర్మాణం, నల్లగండ్ల చెరువు నుండి బెల్ చౌరస్తా గ్యాస్ గోడౌన్ నాలా వరకు 28 కోట్ల 45 లక్షల రూపాయలతో ఆర్సిసి బాక్స్ డ్రైన్ నిర్మాణపు పనులకు సంబంధిత అధికారులతో కలిసి ఆయన శంకుస్థాపన గావించారు. శేరిలింగంపల్లిలో వరద నీరు నిలవకుండా వర్షం నీటిని నియంత్రించే పనులకు కోట్ల అంచనా వ్యయంతో పనులను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్డిపి అధికారులు డిఈ రాజు, ఏఈ నిఖిల్, మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్, సీనియర్ నాయకులు ఉట్ల కృష్ణ, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్ చౌదరి, తిరుపతి, శ్రావణ్ యాదవ్, ఉట్ల దశరథ్, రజనీకాంత్, శ్రీనివాస్, కావూరి అనిల్ నరేష్, వినయ్, స్థానిక కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కీసర గుట్ట బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వానం



**బోడుప్పల్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** మహా శివరాత్రి సందర్భంగా కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రావాలని కోరుతూ టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్వర్యంలో శుక్రవారం నాడు ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రిని ఆహ్వానించిన వారిలో కీసర గుట్ట చైర్మన్ తాటకం నారాయణ శర్మ,టెంపుల్ డైరెక్టర్లు,నాయకులు తదితరులు ఉన్నారు.

# చెలరేగుతున్న మంటలు..

**• మొన్న మాల్తుమ్మెద.. నిన్న అటవీ ప్రాంతంలో..**



**నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** మండలంలోని మాల్తుమ్మెద సీడ్ ఫామ్లో మొన్న గత 15 రోజుల క్రితం ప్రమాదవశాత్తు మంటలు చేలరేగి చెట్లన్నీ పూర్తిగా దగ్ధమయ్యాయి.అలాగే నిన్న తాండూర్ శివారు పరిధిలోని అటవీ ప్రాంతంలో గురువారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దానితో తాండూర్ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు పెంచుతున్న వందల ఎకరాల నీలగిరి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి.వరుసగా మండలంలో మంటలు చెల్లారేగడంతో మండలంలో చర్చతోపాటు ప్రజలు ఆందోళన చెందుతున్నారు.అధికారుల నిర్లక్ష్యం కారణమా లేక ఇంకేమైనా జరిగి ఉండవచ్చునని ప్రజలు అంటున్నారు.నిత్యం ఫారెస్ట్ అధికారులు ఫీల్డ్ పై వెళ్తున్నామని చెప్తుంటారు కానీ ఇది ఎలా జరిగిందోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.వరుస ఘటనలపై పూర్తిగా అధ్యయనం చేసి మండలంలో మరొకసారి మంటలు చిలరేయకుండా ముందస్తు జాగ్రత్తలు అధికారులు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.లేక అధికారులు మొక్కల పెంపకం పట్ల నిర్లక్ష్య కారణమా మొక్కల పట్ల అశ్రద్ధ వహిస్తున్నారా అనే ఎన్నో రకాల అనుమానాలు వ్యక్తం కావడంతో పాటు చర్చ జరుగుతుంది.ఇప్పటికైనా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఇలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని కోరుతున్నారు.ఏదేమైనా ప్రభుత్వ సంపద మంటల్లో కాలిపోవడం బాధాకరమని,మొక్కల పెంపకం పట్ల ప్రభుత్వాలు ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ మొక్కలు ప్రమాదవశాత్తు మొక్కలు దగ్ధం కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# ఎమ్మెల్సీ ఓటు హక్కు ఉన్న ఉద్యోగులకు 27న సెలవు

**• కలెక్టర్ క్రాంతి వల్లూరి**



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** ఈ నెల 27న జరగనున్న కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు ఈ నెల 27న రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించినట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ క్రాంతి వల్లూరు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సెలవు ప్రకటించింది అన్నారు. కావున ఉద్యోగులు 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు.

# మదీనాకు కొత్త ఇండిగో విమాన సర్వీసులు




**శంషాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** శంషాబాద్ జిఎంఆర్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మదీనాకు కొత్త విమాన సర్వీస్ సేవలను శుక్రవారం జిఎంఆర్ సంస్థ సీఈఓ ప్రదీప్ ఫణికర్ ఇండిగో ఎయిర్లైన్స్ సంస్థ నాయకులతో కలిసి ప్రారంభించారు. తొలి విమానం ఆనందోత్సాహాల మధ్య గేల్ సీనియర్ అధికారుల సమక్షంలో బయలుదేరింది. ఈ సేవలు సోమవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉంటాయి. ప్రయాణ సమయం 5 గంటల 47 నిమిషాలు సుమారు. ఈ కొత్త సేవతో అంతర్జాతీయ కనెక్టివిటీ మరింత మెరుగవుతుందన్నారు. జీఎంఆర్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ (గేల్) సీఈఓ ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ మదీనాకు ఇండిగో తొలి విమానాన్ని ప్రారంభించడం సంతోషకరమైన విషయం. ఈ కొత్త మార్గం మా అంతర్జాతీయ నెట్వర్క్ను విస్తరించడమే కాకుండా, హైదరాబాద్ ను ప్రపంచంలోని అత్యంత ప్రముఖమైన ఆధ్యాత్మిక నగరాలలో ఒకటైన మదీనాతో అనుసంధానించే ప్రత్యేక ప్రయాణ అనుభవాన్ని ప్రయాణీకులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిఎంఆర్ అధికారులు, ఇండిగో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాసుబుక్కుల కోసం అనాజ్‌పూర్ రైతుల నిరసన



**అబ్దుల్లాపూర్మెట్, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని అనాజ్ పూర్ గ్రామంలోని రైతులకు పాస్ బుక్కులు అందజేయాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు రైతులు నిరసనకు దిగారు. ఈ కార్యక్రమానికి సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై, రైతుల సమస్యలపై మాట్లాడుతూ, 1991లో సర్వేనెంబర్లు 281, 275, 276, 278లో 125 ఎకరాలు, ఎకరం చొప్పున 125 మంది రైతులకు పట్టా సర్టిఫికెట్లు అందజేసి, పాస్ బుక్కులు ఇచ్చారని తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఆన్లైన్ రికార్డుల నుంచి రైతుల పేర్లు తొలగించి, పాస్ బుక్కులు ఇవ్వడం మానేశారని ఆరోపించారు. దీనివల్ల రైతులు రైతు బంధు, రైతు బీమా లాంటి ప్రభుత్వ ప్రయోజనాలను పొందలేకపోతున్నారని అన్నారు. పలు సంవత్సరాలుగా రెవెన్యూ అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసినా, పాసుబుక్కులు ఇవ్వని ప్రభుత్వం, పెద్ద పరిశ్రమలు ఏర్పాటు కావడానికి ఈ భూమిని సేకరించాలనే కుట్రలో భాగంగా రైతుల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.సిపిఎం మండల కార్యదర్శి ఏర్పుల నరసింహ మాట్లాడుతూ, 30 ఏళ్ల క్రితం ఇదే సిపిఎం పార్టీ పోరాడి రైతులకు పట్టా సర్టిఫికెట్లు ఇప్పించిందని గుర్తు చేశారు. ఇప్పటికీ రైతుల కోసం పోరాడుతామని, భూ సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించేందుకు రైతులతో కలిసి కృషి చేస్తామని హెచ్చరించారు.నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోడ సామిల్, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ జంగయ్య, వెంకటేష్, ముగ్గు రాములు, మండల కమిటీ సభ్యులు గుండె శివ, వర్కాల ముత్యాలు, పెండ్యాల బిక్షపతి, ఎరుకలి మహేందర్, ఎలకపల్లి మహేష్, రైతులు కావలి రాములు, కావలి మల్లేష్, కావలి జంగయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఎం నాయకులు ప్రకటించారు.

# ఆకునూరులో ఇద్దరు హఠాన్మరణం

**• శోకసంద్రంలో కుటుంబ సభ్యులు**





**చేర్యాల, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** చేర్యాల మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన మైలారపు రేడియో చంద్రమౌళి (60) ఊపిరితిత్తుల సమస్యతో హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అమరగొండ కనకయ్య (56) అనే రైతు ఒక్కసారిగా గుండె నొప్పికి గురి కావడంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హఠాన్మరణం చెందారు. వారి మృతి పట్ల ఆకునూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు చంద్రమౌళికి భార్య, నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. మృతుడు కనకయ్యకు భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

# ఆరోగ్య కేంద్రాలకు సకాలంలో మందులు సరఫరా చేయాలి

**• జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** డ్రగ్ స్టోర్ ద్వారా జిల్లాలో ఉన్న అన్ని ఆరోగ్య కేంద్రాలకు సకాలంలో మందులు సరఫరా జరుగుతుందని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని డ్రగ్ స్టోర్, మెదక్ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా డ్రగ్ స్టోర్‌ను పరిశీలించి, స్టోర్ ద్వారా ఏ ఏ మందులు సరఫరా అవుతున్నాయి, మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. మెదక్ ఏరియా ఆసుపత్రిలో వ్యాధి నిరోధక టీకాల నిలువ చేయు గదిని ప పరిశీలించారు, 18 సంవత్సరాల నిండిన వారికి కంటి పరీక్ష చేయు విధానాన్ని స్వయంగా రోగులను అడిగి తెలుసుకున్నారు, కలెక్టర్ స్వయంగా కంటి పరీక్ష చేయించుకున్నారు. అనంతరం ఫిజియోథెరపీ సెంటర్ సేవలను సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ కార్యాలయాన్ని పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. పిహెచ్ సిలలో డెలివరీలను మెరుగుపరచాలని, ప్రభుత్వ డెలివరీలను పెంచడం ద్వారా సాధారణ ప్రసవాల శాతం పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఓ శివదయాల్, డాక్టర్ శివరాం, యునైజేషన్ అధికారిని మాధురి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ నవీన్, సంబంధిత వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రకాళి చెరువు మట్టిని ఇటుక బట్టీల సద్వినియోగం చేసుకోవాలి

**• హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య**



**వరంగల్ బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని ఇటుక బట్టీల యజమానులు ఇటుకల తయారీకి, పొలాలను సారవంతం చేసుకునేందుకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు.శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపు, తదితర అంశాలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. చెరువు పూడిక తీత ఎంతవరకు వచ్చింది, రోజుకు ఎంత తరలిస్తున్నారు, మట్టి నాణ్యత, ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అనే వివరాలను సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాగునీటి పారుదల శాఖ ఈఈ శంకర్ మాట్లాడుతూ భద్రకాళీ చెరువు పూడికతీత మట్టిలో ఇప్పటివరకు నాలుగు లక్షల 60 వేల క్యూబిక్ మీటర్లను తీసుకెళ్లేందుకు దరఖాస్తులను తీసుకెళ్లారని అధికారులు తెలిపారు. ఈ నెల 28వ తేదీ వరకు గడువు ఉన్నందున మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని తరలించేందుకు రూట్ సర్వేను రేపటికల్లా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా పివో అజిత్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, హనుమకొండ తహసిల్దార్ శ్రీపాల్ రెడ్డి, సీఐ సీతా రెడ్డి, మున్సిపల్ డీఈ సంతోష్, మైనింగ్, రవాణా, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలపై కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలి

**• బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు**



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలపై కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలని బిఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శుక్రవారం వేములవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తూ, భయభ్రాంతులకు గురి చేస్తే ప్రజల వెంట బిఆర్ఎస్ పార్టీ పోరాటాలు చేస్తుందన్నారు. జిల్లాలో జరుగుతున్న అన్ని రకాల చర్యలపై ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించాలన్నారు.మంచి పనులు చేస్తే మా వంతు సహకారం అందిస్తామని, అంతేగానీ ఇష్టం వచ్చినట్లు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన ఎల్లప్పుడూ కొట్లడుతమని,జిల్లా కలెక్టర్ తో పాటు మిగతా అధికారులందరూ ఎవరి కనుసన్నల్లో పని చేస్తున్నారో జిల్లా ప్రజలు గమనించాలన్నారు. కలెక్టర్ అనాలోచిత నిర్ణయం వల్ల 1లక్ష మంది పాడి రైతులు ఎంతో ఇబ్బంది పడ్డారని, మిల్క్ చిల్లింగ్ సెంటర్ మూసివేయడం వల్ల రూ. 10 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. పాడి రైతులకు జరిగిన నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. పాడి పరిశ్రమ, మిల్క్ కూలింగ్ సెంటర్ అనేది సహకార సంఘం అది ఏ ఒక్కరి ఆస్తి కాదు, అందరి వుమ్మడి ఆస్తి అని గుర్తుంచుకోవాలన్నారు. జిల్లాల్లో ఎవరి ఆదేశాల మేరకు పాలన కొనసాగుతుంది...అసలు ప్రజాస్వామ్య వ్యవస్థ వుందా అని ప్రశ్నించారు.ఇప్పటివరకు వేములవాడతో జిల్లా వ్యాప్తంగా జరిగిన ఆసుపత్రి మూసివేత, టీస్టాల్ మూసివేత, పాలకేంద్రం మూసివేత, ఆర్ఎంపీ క్లినిక్‌పై దాడులు కక్ష్య పూరితంగా జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు జిల్లా ప్రజలకు చక్కటి పాలన అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులపై ఇప్పటి వరకు ఓపిక పట్టామని,ఇకపై జిల్లా ప్రజలకు మెరుగైన పాలన అందించాలని లేదంటే రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామన్నారు ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్,నరాల శేఖర్ సిరిగిరి రామచందర్, కొండ కనకయ్య వెంగ్గల శ్రీకాంత్ గౌడ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## వంద శాతం ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** రానున్న పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలలో వచ్చే మూడు రోజులు జిల్లాలోని సీనియర్ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని శుక్రవారం కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు మెరుగైన బోధన, వారి ఆరోగ్యం సానిటేషన్, అందుకనుగుణంగా సంక్షేమ హాస్టళ్ళపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. తహసిల్దార్లు, ఎం.పి.డి.ఓల సమన్వయంతో వసతి గృహాలను విస్తృతంగా సందర్శించి రోజు వారీ నివేదికలను అందజేయాలి. ఇందులో భాగంగా హాస్టళ్ళలో విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించి రుచికరమైన భోజనం అందించాలని,విద్యార్ధుల మెరుగైన భోధనకు చర్యలు చేపట్టాలని, నిత్యావసరాల సరుకుల యొక్క నాణ్యతలను పరీక్షించాలని అన్నారు. నిత్యం సానిటేషన్ చేపట్టాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డైట్ మెనూ ప్రకారం పక్కాగా ఉండాలని సూచించారు, వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించిందని అన్నారు,పదవ తరగతి పరీక్షల దృష్ట్యా సంక్షేమ హాస్టల్స్ విద్యార్థులు నూరు శాతం హాజరు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థులు ఏదైనా సబ్జెక్టులలో వెనుకబడి ఉంటే వారిని గుర్తించి నిపుణులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఇప్పటికే సూచించిన ప్రణాళిక ప్రకారం ప్రత్యేక అధికారులు వసతి గృహాల సందర్శన తనిఖీలు చేయాలని ఆయన తెలిపారు.

## యథేచ్ఛగా సాగుతున్న మెడికల్ దందా

- ఫార్మసిస్ట్ లేకుండానే మందుల విక్రయాలు
- ప్రజల ప్రాణాలకు రక్షణ ఏది..?
- మొద్దు నిద్రలో సంబంధిత అధికారులు

**నస్పూర్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** కోల్‌బెల్ట్ ఏరియాలో మెడికల్ షాపుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.కొందరు మెడికల్ దుకాణాల యజమానులు ప్రజల ప్రాణాలతో చెలగాటం అడుతున్నారు.అవగాహన లేని నిర్వాహకులు సగం తెలిసి సగం తెలియక మందులను విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.ఫార్మసీ సర్టిఫికెట్లు అద్దెకు తీసుకుని పలు చోట్ల మెడికల్ దుకాణాలు నడుపుతున్నారు.మందుల షాప్ నిర్వహణ ఫార్మసిస్టు చూడాల్సి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫార్మసిస్ట్ విద్య పూర్తి చేసిన వ్యక్తి మందులు విక్రయించాలి.కానీ శ్రీరాంపూర్ ఏరియాలోని కోల్ బెల్ట్ లో నిబందలనకు విరుద్ధంగా మెడికల్ షాపులు నడుపుతున్నారని పలు ఆరోపణలు ఉన్నాయి. ఫార్మసీ సర్టిఫికెట్ లు అద్దెకు తీసుకొని మెడికల్ షాపు అనుమతి పొంది మెడికల్ దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు.మెడికల్ వ్యాపారంలో అధిక లాభాలు ఉండడంతో షాపులను ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు భారీగా ముందుకు వస్తున్నారు.ఫార్మసిస్టులకు దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక స్తోమత లేకపోవడంతో వ్యాపారులు ఇదే అదునుగా వారి సర్టిఫికేట్లను ఏడాది ఒప్పందంపై అద్దెకు తీసుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

### శ్రీరాంపూర్‌లో నిబంధనలకు నీళ్లు..

ఫార్మసీ పూర్తి చేసిన వ్యక్తి వద్ద సర్టిఫికెట్ లు ఏడాదికి రూ.20 నుంచి రూ.30 వేలు చెల్లించి మెడికల్ దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎవరి సర్టిఫికెట్ అనుమతి పొంది దుకాణం నడుపుతున్నారో వారు వేరే పనులు చేసుకుంటున్నారు.దీంతో ఎలాంటి అనుభవం అవగాహన లేని వారు మెడికల్ షాపులు నడుపుతున్నారని విమర్శలు ఉన్నాయి. శ్రీరాంపూర్ ఏరియాలో సుమారుగా 80 శాతం పైగానే అద్దె సర్టిఫికెట్లతో మెడికల్ షాపులు కొన్నేళ్ల నుంచి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రజలు ఆరోపిస్తున్నారు.తెలిసీ తెలియని అవగాహనతో విక్రయాలు చేస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి.

### ఫార్మసిస్టు, యజమాని లేకుండానే విక్రయాలు..?

శ్రీరాంపూర్ లోని ఆర్కే 6 ఏరియాలో రెండు మెడికల్ షాపులు ఫార్మసిస్ట్,యజమాని లేకుండానే వర్కర్లతో దుకాణాలను నడిపిస్తున్నారని పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మందులపై కనీసం అవగాహన లేని వారు షాపులను నడుపుతున్నారని మందుల దుకాణాలకు వెళ్లి మందు కావాలని అడిగితే ఫార్మసిస్ట్ లేకుండానే వారికి తెలిసిన మందు ప్రజలకు అంటగడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

### చర్యలు శూన్యం..

జిల్లాలో ప్రమాణాలు పాటించని మెడికల్ నిర్వాహకులపై డ్రగ్ ఇన్స్పెక్టర్,సంబంధిత అధికారులు ఇలాంటి దుకాణాలను గుర్తించిన దాఖలాలు లేవని పలువురు ఆరోపిస్తున్నారు. షాపుల నిర్వాహకులు కనీసం జ్వరానికి ఎంత మోతాదులో ఉన్న మాత్రలను ఇవ్వాలనే పరిజ్ఞానం లేని వారు ప్రజలకు మందులు విక్రయిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.ఇది తెలియని ప్రజలు వారు ఇస్తున్న మందులను వాడుతూ మరింత అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయి. యాంటీబయాటిక్స్ ఇష్ట రీతిన వాడరాదు.వైద్యుడి సూచన మేరకే యాంటీబయాటిక్స్ విక్రయించాలి.మోతాదుకు మించి వినియోగంతోనే అనేక అనర్థాలకు దారి తీస్తుంది.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి అక్రమంగా నడుస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.జిల్లా వ్యాప్తంగా ఇలాగే మందుల షాపుల వ్యవహారం కొనసాగుతుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని మెడికల్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ధన రాజకీయాలను ఓడిద్దాం..

- యుటిఎఫ్ కార్యదర్శి ఏ.వెంకట్

**ఖానాపూర్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బుతో గెలవాలన్న ఆలోచనతో వస్తున్న రాజకీయ దాహం కలిగిన వారిని పక్కనపెట్టి యుటిఎఫ్ బలపరుస్తున్న అశోక్ కుమార్ ను గెలిపించాలని యు టి ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకట్ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఆయన ఖానాపూర్ లో విలేకరులతో మాట్లాడారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఓడించి ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడే అశోక్ కుమార్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ధన రాజకీయాలను ఓడించి రియాల్టర్లను ఓడించి ఉపాధ్యాయ వర్గానికి చెందిన వారిని గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షులు దాసరి శంకర్, టీఎస్ యుటిఎఫ్ కుటుంబ సంక్షేమ నిధి జిల్లా కన్వీనర్ చల్ల గోవర్ధన్ రావు, జిల్లా కార్యదర్శి మురళిధర్, తదితరులు పాల్గొన్నారు.



## వన్యప్రాణులను వేటాడే వారిపై బైండోవర్ కేసులు నమోదు

- ప్రమాదాల నివారణకు పోస్టర్ విడుదల
- జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్



**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** ఇటీవల ములుగు జిల్లాలో కొంత మంది రైతులు మరియు వేటగాళ్లు వన్య ప్రాణుల కోసం అమర్చిన కరెంట్ తీగల వలన ములుగు మండలం అబ్బపూర్ గ్రామ సమీపంలోని మొక్కజొన్న తోట వద్ద ఒక మహిళా చనిపోగా, మంగపేట మండలం పాలయిగూడెము గ్రామ సమీప అటవీ ప్రాంతంలో ఒక మగ వ్యక్తి గాయాల పాలయినాడు, దీని పై స్పందించిన ములుగు ఎస్పీ శబరిష్, జిల్లా పోలీస్ యంత్రగాన్ని అప్రమత్తం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ములుగు ఎస్పీ సమక్షంలో ములుగు డీఎస్పీ, సిఐ, ఎస్సై ద్వారా తేదీ 05.02.2025 నాడు ఈ కరెంట్ తీగలు అమర్చడం వలన కలిగే ప్రమాదాలు మరియు ఈ లాంటి కేసులలో నేరస్థులు చట్టపరంగా ఎదుర్కునే జైలు శిక్షలు గురించి, ఈ లాంటి నేరాలు చేసే వారి గురించి ముందోస్తు సమాచారం ఇచ్చిన వారికీ 5,000/- రూపాయల నగదు బహుమతి ప్రోత్సహం అని, పోస్టర్ విడుదల చేయడం జరిగింది. ఈ పోస్టర్లను ములుగు మండలంలోని అన్ని మండల, గ్రామ ప్రజా కూడలిలో పోలీస్ అధికారులు అంటించినారు, మరియు మండలం వారీగా ఆటోల సహాయంతో మైక్ ద్వారా కూడా వాయిస్ రూపంలో ప్రజలలో అవగాహన పెంపోందిచడం జరిగింది. ఇలాంటి వినూత్న ప్రోగ్రాం నిర్వహించినటువంటి ములుగు డీఎస్పీ ఎన్ రవీందర్, సీఐ ములుగు వి శంకర్, ఎస్సై ములుగు సిహెచ్ వెంకటేశ్వరావు ని, ములుగు ఎస్పీ అభినంధిచినారు. ఈ విధంగా వన్య ప్రాణులు వేట కోసం ఎవరైనా కరెంటు తీగలు అమర్చినట్లయితే చట్టపరమైన కఠిన చేర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ములుగు ఎస్పీ తెలియజేశారు.

## రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి



**నూగూర్ వెంకటాపురం, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** కార్పొరేట్ కంపెనీల డీలర్ల చేత దారుణంగా మోసపోయిన మొక్కజొన్న రైతులను కాడాలని ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి జిల్లా కలెక్టర్ దివాకర టీ ఎస్ ని కోరినారు. శుక్రవారం నర్సింహా మూర్తి రైతులతో పాటు కలిశారు. సింజెంట, హై టెక్, మోన్ సెంట వంటి మొక్కజొన్న విత్తనాలు వేసి వెంకటాపురం, వాజేడు, మండలాల రైతులు నష్టపోయారని తెలిపారు. బహుళ జాతి విదేశీ విత్తన ఉత్పత్తి కంపెనీలను అడ్డుపెట్టుకొని కొంతమంది దళారుల అవతారం ఎత్తి రైతులను దగా చేస్తున్నారని అన్నారు. విదేశీ విత్తన ఉత్పత్తి కంపెనీ లను అనుమతులు లేకుండా గత కొన్నేళ్లుగా మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారని వివరించారు. సింజెంట మొక్కజొన్న 4000 ఎకరాలు, హై టెక్ మొక్కజొన్న ఐదు వేల ఎకరాలు, మొన్సెంట్ వెయ్యి ఎకరాల్లో రైతుల చేత వ్యవసాయం చేపిస్తున్నట్లు కలెక్టర్ కు తెలిపారు. బాండ్ వ్యవసాయం అని నోటి మాట చెప్పి కంపెనీ తో ఆర్గనైజర్లు ఒప్పందం చేసుకొని రైతులకు రావలసిన ప్రయోజనాలను ఆర్గనైజర్లు తన్నుకు పోతున్నారని అన్నారు. సింజెంట మొక్కజొన్న విత్తనం ఎకరానికి మూడు టన్నులు వస్తుందని, హై టెక్ మొక్కజొన్న నాలుగు టన్నులు వస్తుందని, టన్నుకు ఇరవై ఎనిమిది వేలు ధర ఇస్తామని నమ్మబలికి నట్లు వివరించారు. పంట చేతికి వచ్చే సమయానికి మొక్కజొన్న కండెలు తప్ప గింజ ఎక్కలేదని, దిగుబడి ఎకరానికి ఒక టన్ను మాత్రమే వచ్చినట్లు రైతులు కలెక్టర్ ముందు వాపోయారని తెలిపారు. దిగుబడి తగ్గి నష్టపోయామని కంపెనీ ల ఆర్గనైజర్లను అడిగితే మొఖం చేటే స్తున్నారని అన్నారు. నష్టపరిహారం ఇవ్వం పొమ్మని అంటున్నారని కలెక్టర్ కు తమ సమస్య ను వివరించినట్టు ఆయన తెలిపారు. సింజెంట, హై టెక్, మోన్సెంట మొక్కజొన్న పంటలు వేసి దిగుబడి రాక నష్టపోయిన రైతులకు కంపెనీల నుండి నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని కలెక్టర్ ని కోరినారు. కలెక్టర్ దివాకర టి ఎస్ మాట్లాడుతూ కంపెనీ ఆర్గనైజర్లు, రైతులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వాస్తవాలు తెలుసు కొని రైతులకు ఖచ్చితంగా న్యాయం చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

## మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :** జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధాన్ని పగడ్బందీగా అమలు చేయాలని, మాదకద్ర వ్యాల వల్ల కలిగే అనర్ధాలపై జిల్లాలో ప్రతి వారం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్‌లో మాదకద్రవ్యాల నిషేధం (నార్కోటిక్ డ్రగ్స్ )పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు జరగకుండా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేశారా? లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. యాంటీ డ్రగ్ కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలోనూ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు డ్రగ్స్ పై క్షేత్రస్థాయిలో నిఘా పెట్టలని అన్నారు. కేవలం పోలీసు శాఖ మాత్రమే కాకుండా ఆబ్కారీ శాఖ అధికారులు కూడా మాదకద్రవ్యాల నిషేధంపై కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి నేతత్వంలోనూ ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు సైతం ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల నెలవారి సమావేశాలలో డ్రగ్స్ నిషేధం గురించి తెలిపి క్షేత్రస్థాయిలో వారి ద్వారా ప్రజలకు అవగాహన కల్పించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇక ముందు జరిగే యాంటి నార్కోటిక్ సమావేశాలకు ఆయా శాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ నిషేధంపై నిర్వహించిన కార్యక్రమాల నివేదికను తయారుచేసి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. మాదకద్రవ్యాలను జిల్లాలో పూర్తిగా నిషేధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకటేష్, డిసిఆర్బీ డిఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, డిఇఓ, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## గుండెపోటుతో పదో తరగతి విద్యార్థిని మృతి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** విద్యార్థిని గుండెపోటుతో మరణించిన ఘటన కామారెడ్డి జిల్లాకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం సింగరాయిపల్లికి గ్రామానికి చెందిన విద్యార్థిని శ్రీనిధ(14) చదువు నిమిత్తం కామారెడ్డిలోని కల్కినగర్‌లో తన పెద్దనాన్న ఇంట్లో ఉంటూ ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఉదయం ఇంటి వద్ద భోజనం చేయకుండా టిఫిన్ బాక్స్‌తో ఆమె పాఠశాలకు బయల్దేరింది. కాలినడకన వస్తూ పాఠశాలకు సమీపంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. పాఠశాల యాజమాన్యం అక్కడికి చేరుకొని విద్యార్థినిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సీపీఆర్ చేసి రక్షించే ప్రయత్నం చేశారు. పరిస్థితిలో మార్పు లేకపోవడంతో మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ సీపీఆర్ చేస్తూ వైద్య చికిత్స అందిస్తుండగానే ప్రాణాలు కోల్పోయిందని పాఠశాల యాజమాన్యం, ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

## కాగజ్‌నగర్ కలుషితమయం

- 30 డ్యామేజీలు.... 100 లీకేజీలు
- మంచినీరు వృధా, కలుషితం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- మరమ్మతులపై పట్టింపు లేని పాలకులు


**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** ప్రజలకు స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేయాలనే సదుద్దేశానికి ఇబ్బందులు తప్పడం లేదు. పైప్ లైన్ కు డేనేజీలు, లీకేజీల కారణంగా మంచి నీరు వృధా పోవడమే కాకుండా, కలుషితం సైతం అవుతుంది. వివరాల్లోకి వెళితే కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మున్సిపాలిటీలో మంచి నీటి సరఫరా పథకానికి పాలకుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా పైప్ లైన్లకు ఏర్పడిన లీకేజీలను, డ్యామేజ్ లను మరమ్మతు చేయక నెలలు, సంవత్సరాల తరబడి కాలం గడిచిపోతుంది. మున్సిపాలిటీ పరిధిలోని వినయ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ ముందు పైప్ లైన్ కు 2 సంవత్సరాల క్రితం పైప్ లైన్ కు లీకేజీ ఏర్పడి మంచినీరు వృధాగా పోతుంది. ఈ లీకేజీ జరిగినచోట కొంతమంది మహిళలు బట్టలు ఉతకడం, వంట గిన్నెలు తోము కోవడం (శుభ్రం చేయడం) జరుగుతుంది. అలాగే కాగజ్ నగర్ పట్టణంలోని ఎల్లా గౌడ్ తోటలో గల మంచినీటి పథకం (ఓహెచ్ఆర్) సమీపంలోని సిమెంట్ రోడ్డుపై మధ్య భాగంలో పైప్ లైన్ కు పెద్ద గుంత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వాహదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే కాగజ్ నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియాలో గల ప్రధాన రహదారి సమీపంలో గల మురికి కాలువలో పైప్ లైన్ కు లీకేజీ ఏర్పడి మంచినీరు వృధా పోవడమే కాకుండా, కలుషితం అవుతుంది. అసలే ఎండాకాలం.. ఆపైన పట్టణంలోని వార్డుల్లో మంచిది సమస్య తీవ్రతరం కాబోతుంది. అలాగే వెంకటేశ్వర ఆలయం బాలాజీ నగర్ వద్ద పైప్ లైన్ కు అనేక లీకేజీలు ఏర్పడి మంచినీరు వృధా పోతుంది. గత సోమవారం రోజు రాత్రి సమయంలో ఎల్లా గౌడ్ తోటలోని మంచినీరు సరఫరా చేసే వాల్ నుండి కొన్ని గంటలపాటు మంచినీరు వృధా పోయింది. ఈ విధంగా కాగజ్ నగర్ మున్సిపాలిటీలో చెప్పుకుంటూ. పోతే 30 వార్డుల్లో గల పైపు లైన్లకు 30 డ్యామేజీలు, 100 లీకేజీలు అన్న చందంగా మంచి నేటి సరఫరా పథకం తయారైంది. ఈ విషయమై కాగజ్ నగర్ మున్సిపాలిటీ ఇంచార్జ్ డి. ఈ. ఈ రమాదేవిని వివరణ త్వరగా ప్రధాన పైపులైనుకు గల లీకేజీలను మరమతూ చేయాలంటే కొన్ని రోజులపాటు మున్సిపాలిటీకి మంచినీటి సరఫరా నిలిపివేయాల్సి వస్తుందని అన్నారు. దీంతో పట్టణవాసులకు మంచినీటి సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. అందుకే లీకేజీలు, పైప్ లైన్ డేమేజ్ లకు మరమ్మతులు చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరణ ఇచ్చారు.




## జర్నలిస్టులకు ఆకాశమే హద్దు..

- సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులు
- కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం

**వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 21 (జనం సాక్షి) :** జర్నలిస్టులకు ఆకాశమే హద్దు అని, లిమిట్స్ ఉండవని,సమాజాన్ని మేల్కొల్పేది జర్నలిస్టులు మాత్రమే అని కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం అన్నారు. శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగం విభాగాధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఫ్రెషర్స్ డేకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ జర్నలిజం విద్యార్థులకు లీడర్షిప్ క్వాలిటీస్ ఉంటాయని సమస్యల మీద ఎప్పటికప్పుడు ముందుంటారని,ఆ సమస్యల పరిష్కారానికి పాటుపడతారని అన్నారు. విద్యార్థులు భాష నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడు వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు.అబ్బాయిల కంటే అమ్మాయిలకు ఇంకా ఎక్కువ అవకాశాలు ఉన్నాయని టీవీ మీడియాలో అమ్మాయిలు ఇప్పుడు ఎక్కువగా కనబడుతున్నారని అన్నారు. జర్నలిజం విభాగంలో ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని,అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తానని అన్నారు.కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్‌గా క్లాసులకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయి పర్యటనలో వారి అనుభవాలను రంగరించి ఎన్నో మెలుకువలను తెలుసుకునేందుకు విద్యార్థులు కష్టపడితే విద్యార్థులందరూ కూడా త్వరగా సెటిలయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. సిడిఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్ లాల్ మాట్లాడుతూ అన్ని కోర్సుల కంటే జర్నలిజం కోర్స్ ముఖ్యమైనదని, దీని ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌సి డైరెక్టర్ ఐలయ్య, కాకతీయ విశ్వవిద్యాలయం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత, జర్నలిజం విభాగం అధ్యాపకులు డాక్టర్ శ్రీకాంత్ యాదవ్, డాక్టర్ సుధాకర్, వెంకటేశ్వర్లు, డాక్టర్ మోటె చిరంజీవి తో పాటు మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.








# ఫాసిజం అంతం విప్లవ విద్యార్థులతోనే సాధ్యం

## ఆచరణాత్మక బోధనలు చేసిన ఆర్ఎస్‌యూ బాటలో నడుస్తాం

### మనువాదంపై హిందు, ముస్లింలు ఒక్కటై పోరాడాల్సిన అవసరం ఉంది

### 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానం సదస్సులో పలువురు వక్తల పిలుపు



**బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థులు 50 ఏళ్ల విప్లవ విద్యార్థి ఉద్యమ ప్రస్థానంపై నిర్వహించిన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు పూర్వ విప్లవ విద్యార్థులు, వక్తలు ఆర్ఎస్‌యూతో తమ అనుబంధాలూ, పోరాటాలను గుర్తుచేసుకున్నారు. ఆ సంఘం నేర్పిన విప్లవ భావాలను, చైతన్యాన్ని, భారతదేశానికి అందించిన నాయకత్వాన్ని నెమరువేసుకున్నారు. ఆర్ఎస్‌యూ బోధించిన మార్గంలోనే నడవాలని, మతోన్మాదంపై ప్రజలంతా కలిసికట్టుగా పోరాడాలని ఈ సందర్భంగా వేదికపై పిలుపునిచ్చారు.**

**- హైదరాబాద్, ఫిబ్రవరి 21 (జనంసాక్షి) :**










### భారత విప్లవానికి నాయకత్వాన్ని అందించింది : పాణి

ఉజ్వలమైన చరిత్రకు భూమిక వేసిన ఆర్ఎస్‌యూ ఈనాడు మనకు కనిపించకపోవచ్చు. కానీ, దాని ప్రభావం అది అందించిన చైతన్యం వర్తమానాన్ని నడిపిస్తున్నది. అది నడుస్తున్న చరిత్రను, భవిష్యత్తును ఎలా నిర్మించుకోవాలో ఆర్.ఎస్.యూ మనకు నేర్పింది. మరీ ముఖ్యంగా మేధో,కళా ,సాంస్కృతిక రంగాలపై ఆర్ఎస్‌యూ ప్రభావం చాలా పెద్దది ఆర్ఎస్‌యూ తన ఆచరణ ద్వారా రచనల ద్వారా ఆలోచనల ద్వారా పంచిన జీవన రంగాలకు ఎంతో సృజనాత్మక విప్లవాత్మక ప్రభావాన్ని వేసింది. తన ఆచరణ ద్వారా భారత విప్లవానికి నాయకత్వాన్ని అందించింది. ఆర్.ఎస్.యూ తన ఆచరణ ద్వారా గ్రామాలను, విశ్వవిద్యాలయాలను అనుసంధానించింది. గ్రామాలను వర్గపోరాట కేంద్రాలుగా మలిచింది. విశ్వవిద్యాలయాలను భావజాల సంఘర్షణ కేంద్రాలుగా మలిచింది.విప్లవ రచయితల సంఘం తన రచనలు, సాహిత్యం ద్వారా ఆర్ఎస్ యూను ఎంతగా ప్రభావితం చేసిందో అంతకన్నా ఎక్కువగా తన ఆచరణ ద్వారా పోరాటాల ద్వారా త్యాగాల ద్వారా ఆర్ఎస్ యూ విరసాన్ని ప్రభావితం చేసింది. ఆర్ఎస్ యూ తన సృజనాత్మక కార్యాచరణ ద్వారా అద్భుతమైన సృజనా కారులను, మేధావులను, రచనా కారులను, నాయకత్వాన్ని అందించింది. ఆపరేషన్ కగార్ పేరుతో అంతిమ యుద్ధం చేస్తూ విప్లవోద్యమాన్ని నిర్మూపలిస్తామని భారత పాలకవర్గం అనుకున్నది. కానీ ప్రజలందరినీ నిర్మూలించ లేరని విశ్వాసంతో జీవిద్దాం.

### కర్నాటకకు స్ఫూర్తి : వీరమణి (కర్ణాటక)

కర్ణాటకలో వీరమణి విద్యార్థి సంఘానికి పునాదులు వేసింది. ఆర్ఎస్‌యూ స్ఫూర్తితో కర్ణాటకలో ప్రగతి పర విద్యార్థి కేంద్రం పేరుతో విప్లవ విద్యార్థి సంఘం ఏర్పడింది. ఎపిఆర్ఎస్‌యూ స్ఫూర్తితో గ్రామాలకు తరలండి.. కార్యక్రమాలు తీసుకుని కర్ణాటకలో ప్రజా పోరాటాలు నిర్వహించింది. ఆ క్రమంలో కర్ణాటక రాష్ట్రం అంతటా ప్రజా పోరాటాలను నిర్మించి విప్లవోద్యమాన్ని బలోపేతం చేశాయి.

### గర్విస్తున్నా : వివేక్ (తమిళనాడు)

50 ఏళ్ళ ఆర్ఎస్‌యూ విద్యార్థుల కలయిక సమావేశంలో భాగస్వామిని అవుతున్నందుకు గర్విస్తున్నాను. టిఎన్ఆర్ఎస్‌యూ సభ్యునిగా పనిచేసినందుకు ఆనందంగా ఉన్నది. అప్పటి ఆంధ్రప్రదేశ్ లోని విప్లవోద్యమాలు విప్లవ ప్రజాసంఘాలైన ఆర్ఎస్‌యూ, ఆర్‌వైఎల్ రైతు కూలీల సంఘం ఆదర్శంగా తమిళనాడులో విప్లవ ప్రజా సంఘాలు ఏర్పడ్డాయి. ఆ క్రమంలోనే తమిళనాడులో చారిత్రక ప్రజా ఉద్యమాలను నిర్మించారు. మాకు అన్నివిధాలా ఆదర్శంగా నిలిచిన ఆర్ఎస్‌యూ దారిలో తమిళనాడులో ప్రజా ఉద్యమాలను నిర్మించింది.

### వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్నా

**- జయ (హైదరాబాద్)**

పదహారేళ్ల అమ్మాయిగా బోలక్‌పూర్ బాలికల హాస్టల్లో చేరి పెద్ద స్వర్ణ, చిన్న స్వర్ణతో కలిసి పనిచేసి, ఆర్ఎస్‌యూ విద్యార్థినిగా నా వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్నాను. అన్ని రంగాల్లో పనుల్లో విద్యార్థులు అందరితో సమానంగా బాలికలుగా పనిచేసి గ్రామాలకు తరలండి, కార్యక్రమంలో భాగంగా రాజమండ్రిలో నిర్బంధానికి గురై జన జీవితం గడిపినా, ఉత్సాహం తగ్గలేదు.




### మాదిగవాడలోనే తినాలని బోధించింది : రాజశేఖర్

విప్లవోద్యమాన్ని విభిన్న కుల అస్తిత్వాలకు కుదించలేమని ఆర్ఎస్‌యూ భావించింది. పాలకవర్గాలు విప్లవోద్యమాన్ని బలహీనపరచడానికి ప్రజల్లో చీలికలు సృష్టించే కుట్రలో భాగంగానే అస్తిత్వాలు ఉనికిలోకి వచ్చాయి. సమాజంలోని అన్ని వర్గాల సమస్యలను పరిశీలించి, కుల సమస్య విప్లవోద్యమ విజయంతోనే ముడిపడి ఉన్నది. ఆర్ఎస్‌యూ చేపట్టిన గ్రామాలకు తరలిరండి కార్యక్రమంలో విద్యార్థులు ఎక్కడికి పోవాలి, ఎక్కడ తినాలని దేశా నిర్దేశం చేసింది. మాదిగవాడలోనే తినాలని బోధించింది. సమస్త కులాలు, వృత్తులకు సంబంధించింది పాటలు పాడింది. రాసింది. 1990 దాకా ఆర్ఎస్‌యూలో విద్యార్థుల మధ్య కుల ప్రస్తావన లేదు. అన్ని రకాల కుల వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా ఆర్ఎస్‌యూ పోరాడింది. ఒకరకంగా దళిత వర్గాలకు దన్నుగా నిలిచింది. గుణాత్మక మార్పులు ఏర్పర్చేందుకు మొదటిసారి ఆర్ఎస్‌యూలోకి అగ్రవర్గాల అమ్మాయిలు వచ్చారు. దళిత విద్యార్థులు ఆర్ఎస్‌యూ నాయకత్వంలోకి వచ్చారు. ఎక్కడయితే అట్టడుగు వర్గాలుంటాయో అక్కడ ఉన్నది. ఉంటుంది.

### సమాజ మార్పు విప్లవం ద్వారానే స్వేచ్ఛ : జ్యోతి హైదరాబాద్

70,80 దశకంలో లింగ బేధం వివక్ష అనేదే లేకుండా, ఆర్ఎస్‌యూలో పనిచేశాం. విద్యార్థుల్లో సమస్యల పరిష్కారం కోసం పోరాటాల ఆర్ఎస్ యూ విద్యార్థులతో కలిసి పనిచేశాం. మహిళగా సామాజిక ఆచరణలోకి రావాలంటే కాదు మొదలుకుంటూ ధరలోని, ఘర్షణ ఎదుర్కొన్నా. గ్రామాలకు తరలిరండి కార్యక్రమంలో గ్రామాల్లో బిజెపి, ఆర్ఎస్ఎస్, ఎబివిపి వాళ్లతో తనదిగా ఘర్షణ పడాల్సి వచ్చింది. శాస్త్రీయ ఆలోచనలకు వ్యతిరేకించడమే ఎబివిపి పనిగా పెట్టుకుని ఆర్ఎస్‌యూ విద్యార్థుల్లో ఘర్షణ పడేదిదారులకు గురయ్యేది. ప్రాథమిక స్థాయిలో మహిళలపై హింసా దౌర్జన్యాలు ఎబివిపి రూపంలో జరిగేవి. ప్రశ్నించడం నేర్పిన ఆర్ఎస్‌యూ మహిళా సమానత్వం గురించి మాట్లాడింది. పురుషులతో పోలిస్తే మహిళలకే ఎక్కువ సమస్యలున్నాయి. అందుకే ఇటు ఉద్యమంలో మహిళలు లాగే లేని పోరాటాలు చేశారు. చేస్తున్నారు. ఆ క్రమంలోనే మహిళలకే విప్లవం అవసరమని ఆర్ఎస్‌యూ నేర్పింది. స్వేచ్ఛ సమానత్వం పేరుతో వికృత పోకడలు వస్తున్నాయి. నిజమైన స్వేచ్ఛ మహిళలకు సమాజ మార్పు విప్లవం ద్వారానే లభిస్తుంది అని ఆర్ఎస్‌యూ బోధించింది ఆ మార్గంలోనే మహిళలంతా నడవాలి.

### మనువాదంపై హిందూ ముస్లిములు కలిసి పోరాడాలి

**- ఎంఎం రహమాన్, జనంసాక్షి ఎడిటర్**




గ్రామాల్లో అంటరానితనం, వెట్టిచాకిరీ, రెండుగ్లాసుల పద్ధతికి వ్యతిరేకంగా అణగారిన వర్గాలు, రైతుకూలీలు తలెత్తుకునేలా మహత్తర పోరాటానికి ఆర్ఎస్‌యూ నాయకత్వం వహించింది. మనుస్మృతి ప్రధానంగా హిందువులను అణిచివేసింది. అణగారినవర్గాలకు చదువును దూరం చేసింది. 1847లో శూద్రులు, అతి శూద్రుల కోసం సావిత్రి భాయి, జ్యోతిరావు పూలే ఏర్పాటు చేసిన పాఠశాలను రద్దు చేయించి, వాళ్లను బహిష్కరించింది కూడా మనువాదులే. ముస్లింలను అణగారిన వర్గాల నుంచి వేరు చేయాలని బ్రాహ్మణవాదులు యత్నిస్తుండగా.. మూతబడిన పాఠశాలకు ఉచితంగా తన ఇంటిని అప్పజెప్పి, బాలికల పాఠశాల పునరుద్ధరణ కోసం మున్షీ గఫార్ బేగ్, షేక్ ఉస్మాన్, షేక్ ఫాతిమాలు కృషిచేశారు. ముస్లింల సహకారంతోనే సావిత్రి భాయి పూలే బాలికల విద్య పాఠశాల నడిపారు. భవిష్యత్తులో మనువాదానికి వ్యతిరేకంగా హిందువులు, ముస్లింలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది. భారతదేశంలో కమ్యునిస్టు విప్లవ పార్టీల్లో ముస్లింలు లేరనే ప్రచారం ఉత్తిదే. వందేళ్ల క్రితం టర్కీ వెళ్తూ తప్పిపోయిన పడవ రష్యాకు వెళ్లగా.. అనుమనితులుగా పట్టుబడ్డ భారతీయ ముస్లింలను బంధించి లెనిన్ ముందు హాజరుపరిచారు. సోవియట్ అక్కడి కమ్యూనిస్టు పార్టీ వైభవాన్ని తెలియపరచగా.. ఆ ఎర్రజెండాను మోసుకొచ్చి భారత్‌లో కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన ముజఫర్ అహ్మద్ బృందం ముస్లిములే. సాయుధ తెలంగాణ పోరాటంలో మగ్దుం మొహియుద్దీన్, రజాకార్ల వ్యతిరేక ఉద్యమంలో అమరుడైన షోయబుల్లాఖాన్, హైదరాబాద్ పాతబస్తీలో ఎమ్‌టీ ఖాన్, సాయుధ తెలంగాణ ఉద్యమంలో నిజాం తూటాలకు నేలకొరిగిన షేక్ బందగి కూడా నల్లగొండ జిల్లానే! అలాగే రాష్ట్రవ్యాప్తంగా షేక్ ఇమామ్, సలీం, రియజ్ అనేకమంది ఉన్నారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370